జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | శుక్రవారం 25 ఏప్రిల్ 2025 | సంపుటి : 15 | సంచిక : 228 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంచార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

# టెక్నాలజీ వినియోగంతో రియల్ టైమ్‌లో సేవలు



- స్మార్ట్ పాలనకు ప్రాధాన్యత ఉంటుంది
- త్వరలో భారీ డేటా లేక్ ఏర్పాటు
- పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూనే, ప్రజలకు సేవల విషయంలో మానవీయకోణం చూపాలి
- రాష్ట్రంలో భారీ డేటా లేక్‌ను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టాం

**అమరావతి**

పాలనలో ఏఐని వినియోగించినా మానవీయకోణం ముఖ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం నాడు సచివాలయంలో నిర్వహించిన ఏఐ వర్క్‌షాప్‌లో సీఎం మాట్లాడుతూ.. టెక్నాలజీ వినియోగంతో రియల్ టైమ్‌లో సేవలను డెలివరీ చేయొచ్చన్నారు. స్మార్ట్ పాలనకు ప్రాధాన్యత ఉంటుందని, త్వరలో భారీ డేటా లేక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూనే, ప్రజలకు సేవల విషయంలో మానవీయకోణం చూపాలని చెప్పుకొచ్చారు. ఏఐ ఆధారిత స్మార్ట్ వ్యవస్థ ఏర్పాటుతో రియల్ టైమ్‌లో సేవలు అందించవచ్చని చెప్పారు. ఇందుకోసం పాత విధానాల స్థానంలో నూతన సాంకేతికతను ప్రవేశపెట్టాలన్నారు. టెక్నాలజీ అనేది ప్రజల కోసం ఉపయోగపడాలన్నారు. రాష్ట్రంలో భారీ డేటా లేక్‌ను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టామని తెలిపారు. 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైన ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. 2 ఎంబీపీఎస్ ఇంటర్నెట్ కోసం ఎదురుచూసిన రోజుల నుంచి డేటా ఆధారిత పాలన దిశగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దామన్నారు. వేగంగా భూరికార్డుల డిజిటలైజేషన్ చేయాలని వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతుల్లో అధికంగా 75 శాతం భూసంబంధితమైనవే ఉన్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి త్వరితగతిన - మిగతా3లో



## ఇంగ్లీష్‌లోనూ మోదీ హెచ్చరిక

- ప్రపంచ దేశాలకు సూటి సందేశం!
- బిహార్ గడ్డ నుంచి యావత్ ప్రపంచానికి ఒక విషయం స్పష్టం చేస్తున్నా
- ఉగ్రవాదులను, వారికి అండగా నిలిచేవారిని భూమిపై ఎక్కడున్నా సరే వెంటాడతాం
- ఉగ్రవాదంతో దేశ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేరు.
- సాధారణంగా హిందీలో ప్రసంగించే ప్రధాని మోదీ..
- పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ ఆంగ్లంలోనూ హెచ్చరించడం గమనార్హం.

# తెగువ చూపారు.. వారందరికీ సెల్యూట్

- 'ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి
- యుద్ధ వాతావరణంలో ప్రజలు బతుకుతున్నారు
- దుర్మార్గమైన రెడ్‌బుక్ పాలన జరుగుతోంది
- "బలం ఓడిపోయినా స్థానిక సంస్థల్లో టీడీపీ పోటీ చేస్తోంది
- ప్రజలు ఓడించారు కాబట్టే.. చంద్రబాబు తన సొంత నియోజకవర్గం చంద్రగిరిని విడిచిపెట్టి కుప్పం వెళ్లిపోయాడు.



**తాడేపల్లి**

ఉప ఎన్నికలు, అవిశ్వాస తీర్మానాల సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు తెగువ చూపారని.. వారందరికీ సెల్యూట్ చేస్తున్నానని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతి నిధులతో గురువారం ఆయన భేటీ అయ్యారు. ముందుగా జమ్ముకశ్మీర్‌లోని ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన వారి మృతికి సంతాపంగా వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాసేపు మౌనం పాటించారు. అనంతరం సమావేశం ప్రారంభించారు. 'ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. యుద్ధ వాతావరణంలో ప్రజలు బతుకుతున్నారు. దుర్మార్గమైన రెడ్‌బుక్ పాలన జరుగుతోంది" అని వైఎస్ జగన్ - మిగతా3లో



## స్థానిక సంస్థలు.. స్థానిక ప్రభుత్వాలుగా మారాలి

- ఆర్థిక, రాజకీయ, సామాజిక పటుత్వం అవసరం
- రాజకీయాలకు అతీతంగా పంచాయతీలకు నేరుగా నిధులు
- జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లకు అవార్డుల ప్రదానం

**అమరావతి**

'గ్రామ పంచాయతీలు బలంగా ఎదగాలి. ఆర్థిక, సామాజిక, రాజకీయ సమన్వయంతో ఐక్యంగా పని చేయాలి. అన్ని రంగాల్లో స్వయం ప్రతిపత్తిని సాధించాలి. అభివద్ధి, ఆకాంక్షలు కలగలిపి స్వర్ణ గ్రామాలుగా వెలగాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అన్న మహాత్ముడి మాటకు అనుగుణంగా పల్లెలు జాతీయ సమగ్రతకు, సుస్థిరతకు కూడా మూల కేంద్రాలు కావాలి - మిగతా3లో



## ఇక భారత్ విడిచి వెళ్లాల్సిందే

- పాక్ పౌరులకు హెచ్చరిక
- దేశంలో ఉన్న పాక్ దేశస్తులు భారత్‌ను విడిచి వెళ్లిపోవాలి
- పహల్గాం ఉగ్రదాడి వెనుక పాక్ హస్తం ఉంది
- సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశంపై కఠిన చర్యలు తీసుకుంటోంది




## పాక్‌ను ఒంటిరిని చేసేలా మద్దతును కూడగడుతున్న భారత్

- విదేశీ దౌత్యవేత్తలతో సౌత్ బ్లాక్‌లో కీలక భేటీ..!
- దాయాది దేశాన్ని ఏకాకిని చేసేదిశగా కేంద్రం రాయబారులతో సమావేశం ఏర్పాటు
- ప్రపంచ దేశాల ముందు పాకిస్తాన్‌ను ఎండగట్టేందుకు.. ఉగ్రదాడుల దాడిని ప్రపంచదేశాలకు వివరించే ప్రయత్నం చేసింది

# ఏపీలో కొత్త పెన్షన్లకు గ్రీన్ సిగ్నల్

- భర్తను కోల్పోయిన వితంతువులను ఆదుకోవడం కోసం 89,788 కొత్త వితంతు పెన్షన్లకు ఆమోదం
- దాదాపు లక్ష కొత్త పెన్షన్లకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్
- కొత్తగా ధరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్‌ను జూన్ నుండి




**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ నెలకు రూ.4 వేలు చేసిన సంగతి తెలిసిందే. దివ్యాంగులకు సైతం నెల రూ.6 వేలు ఇస్తోంది. ఒకటో తేదీ ఉదయాన్నే ప్రభుత్వ అధికారులు ఏకంగా ఇంటికొచ్చి మరీ పెన్షన్ అందజేస్తున్నారు. ఈ క్రమంలోనే కూటమి ప్రభుత్వం కొత్త పెన్షన్లకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు లక్ష కొత్త పెన్షన్లకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. భర్తను కోల్పోయిన వితంతువులను ఆదుకోవడం కోసం 89,788 కొత్త వితంతు పెన్షన్లకు ఆమోదం తెలిపారు. మే నెల మొదటి తారీఖు నుండి వీరందరికీ - మిగతా3లో

# పాక్‌ను ఒంటిరిని చేసేలా మద్దతును కూడగడుతున్న భారత్



పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో జర్మనీ, జపాన్, పోలాండ్, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, ఖతర్‌తో సహా అనేక దేశాల రాయబారులతో విదేశాంగ మంత్రిత్వ శాఖ సౌత్ బ్లాక్‌లోని కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించింది. పహల్గాం దాడి ఘటన ఆయా దేశాల రాయబారులకు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ వివరించారు. పాక్ అండతో ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడ్డ తీరును ఆయా దేశాలకు వివరించి.. దాయాది దేశాన్ని ఏకాకిని చేసేదిశగా కేంద్రం రాయబారులతో సమావేశం ఏర్పాటు చేసింది. ప్రపంచ దేశాల ముందు పాకిస్తాన్‌ను ఎండగట్టేందుకు.. ఉగ్రదాదుల దాడిని ప్రపంచదేశాలకు వివరించే ప్రయత్నం చేసింది. చైనా, కెనడాతో సహా జీ20 దేశాలు, ఎంపిక చేసిన దేశాల రాయబారులకు పహల్గాం ఉగ్రవాద దాడి గురించి విదేశాంగ మంత్రిత్వ శాఖ వివరించింది. సమావేశం దాదాపు 30 నిమిషాల పాటు కొనసాగింది. పహల్గాంలో ఉగ్రవాదులు ఎలా మారణకాండ సృష్టించారో వివరించి.. అంతర్జాతీయంగా ఆయా దేశాల మద్దతును కూడగట్టేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇదిలా ఉండగా.. బుధవారం అర్ధరాత్రి విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్తాన్ అత్యున్నత దౌత్యవేత్త సాద్ అహ్మద్‌ను సైతం పిలిపించిన విషయం తెలిసిందే. భారత ప్రభుత్వం ఆయనకు 'పర్సన నాన్ గ్రాటా' నోట్‌ను జారీ చేసింది. పర్సన నాన్ గ్రాటా అంటే ఒక దౌత్యవేత్త లేదంటే.. ఓ విదేశీ వ్యక్తికి ఒక నిర్దిష్ట దేశంలో ప్రవేశం లేదంటే.. బస నిరాకరించినట్లుగా అర్థం. భారతదేశం ఈ నోట్‌ను పాకిస్తాన్ దౌత్యవేత్తలకు అందజేసింది. వారంతా వారంలోగా భారత్‌ను విడిచి వెళ్లాల్సి ఉండనున్నది. దక్షిణ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. బుధవారం జరిగిన సీసీఎస్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సహా ఇతర సీనియర్ మంత్రులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉగ్రవాద దాడిని తీవ్రంగా పరిగణించింది. న్యూఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో నియామకమైన రక్షణ, నావికాదళం, వైమానిక దళ సలహాదారులను పర్సన నాన్ గ్రాటాగా ప్రకటించాలని సీసీఎస్ నిర్ణయించిందని విదేశాంగ కార్యదర్శి తెలిపారు. ఈ క్రమంలో ఆయా దౌత్యవేత్తలను వారం రోజుల్లోగా భారతదేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు. దీనితో పాటు, ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ నుంచి భారతదేశం తన సైనిక సలహాదారులను సైతం వెనక్కి పిలువనున్నది. అట్టారి చెక్ పోస్ట్‌ను తక్షణమే మూసివేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. చెల్లుబాటు అయ్యే పత్రాలతో ఈ మార్గం ద్వారా ఇప్పటికే భారతదేశంలోకి ప్రవేశించిన వారు మే 1, 2025 నాటికి అదే మార్గం ద్వారా తిరిగి రావాలని సూచించింది. పాకిస్తాన్‌తో సింధు జల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేయాలని కూడా భారతదేశం నిర్ణయించింది. సార్క్ వీసా మినహాయింపు పథకం కింద పాకిస్తాన్ పౌరులు ఇకపై భారత్‌లో ప్రయాణించేందుకు అనుమతి ఇవ్వరు. వీసా స్కీమ్ కింద భారతదేశంలో ఉన్న పాకిస్తానీ పౌరులు 48 గంటల్లోపు దేశం విడిచి వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది.


## ఇంగ్లీష్‌లోనూ మోదీ హెచ్చరిక



**ఇంటర్నెట్ డెస్క్:** ప్రధాని నరేంద్ర మోదీ సాధారణంగా హిందీలో ప్రసంగిస్తుంటారు. అంతర్జాతీయ వేదికలపైనా ఇదే భాషలో భారత వైఖరిని స్పష్టం చేస్తుంటారు. కానీ, నేడు బిహార్‌లో నిర్వహించిన ఓ సభలో మాత్రం అరుదైన రీతిలో ఒక్కసారిగా తన ప్రసంగాన్ని హిందీ నుంచి ఆంగ్లంలోకి మార్చారు. పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ.. ఇంగ్లీష్‌లోనూ హెచ్చరించడం గమనార్హం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తన బలమైన సందేశాన్ని ప్రపంచ దేశాలకు సూటిగా చేరవేసేందుకు ఆంగ్లంలో ప్రసంగించినట్లు తెలుస్తోంది. 'ఇండియా విల్ ఐడెంటిఫై, ట్రాక్ అండ్ పనిష్ ఎవ్రీ టెర్రరిస్ట్ అండ్ దేర్ బ్యాకర్స్' (ప్రతి ఒక్క ఉగ్రవాదిని, వారికి మద్దతుగా నిలిచేవారిని భారత్ గుర్తించి, వెంటాడి, శిక్షిస్తుంది) అంటూ ప్రధాని మోదీ ఆంగ్లంలో స్పష్టం చేశారు. "ఈ రోజు బిహార్ గడ్డ నుంచి యావత్ ప్రపంచానికి ఒక విషయం స్పష్టం చేస్తున్నా. ఉగ్రవాదులను, వారికి అండగా నిలిచేవారిని భూమిపై ఎక్కడున్నా సరే వెంటాడతాం. ఉగ్రవాదంతో దేశ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేరు. ఉగ్రవాదాన్ని శిక్షించకుండా వదిలిపెట్టబోం. బాధితులకు న్యాయం చేకూరేలా అన్ని విధాలా ప్రయత్నిస్తాం. ఈ విషయమై దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది" అంటూ ప్రధాని మోదీ ఇంగ్లీష్‌లో పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి వేళ భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెప్పారు. "మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ఉగ్రవాదులు నరమేధానికి పాల్పడ్డారు. సైనిక దుస్తుల్లో వచ్చి.. పర్యాటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు.


## నేనేమీ మాట్లాడలేను.. ఒంటరిగా వదిలేయండి

### హైదరాబాద్ ఐబీ ఆఫీసర్ తండ్రి కన్నీటి వేదన



జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు సృష్టించిన మారణకాండకు అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. అనంతనాగ్ జిల్లా పెహల్గాం పట్టణ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం పర్యాటకులే లక్ష్యంగా చేసిన దాడిలో 26 మంది పర్యాటకులు అసువులు బాసారు. పెహల్గాంలోని బైసరాన్‌కు విహార యాత్రలోభాగంగా , ప్రకృతి అందాలను వీక్షిస్తున్న తరుణంలో ఉగ్రమూకలు వారిపై దాడికి తెగబడ్డారు. దాంతో ఆ ఆనంద క్షణాలు కాస్తా విషాదంగా మారిపోయాయి. ఉగ్రదాడిలో చనిపోయిన వారిలో జార?ండ్ రాష్ట్రానికి చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ కుమారుడు ఉన్నారు. ఐబీ(ఇంటెలిజెన్సీ బ్యూరో) ఆఫీసర్ గా హైదరాబాద్ లో విధులు నిర్వర్తిస్తున్న మనీష్ రంజాన్.. ఉగ్రమూకల దాడిలో ప్రాణాలు విడిచాడు. రంజాన్ మృతదేహం బుధవారం స్వస్థలానికి చేరుకున్న తరుణంలో ఆయన తండ్రి మంగ్లేస్ మిశ్రా కన్నీటి పర్యంతమయ్యారు. కుమారుడి మృతదేహాన్ని చూస్తూ కృంగిపోయారు. ఈ క్రమంలోనే జాతీయ మీడియా ఆయన్ని పలకరించగా తాను మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నానని, ఒంటరిగా ఉన్నానంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. 'నన్ను ఒంటరిగా వదిలేయండి. నేనే మాట్లాడలేను. కశ్మీర్ కు నవ్వుతూ వెళ్లాడు నా కుమారుడు రంజన్. ప్రతీరోజూ మాకు కాల్ చేసి మా ఆరోగ్యం గురించి అడిగేవాడు.. జాగ్రత్తలు చెప్పేవాడు. తాను అసువులు బాసిన చివరి రోజు కూడా మాకు కాల్ చేశాడు. అంతకుముందే మా కాల్ చేసి మాట్లాడిన నా కుమారుడు ఇలా వస్తాడని అనుకోలేదు' అంటూ కన్నీటి వేదనతో చెప్పారు.

# భయానక అనుభవం.. ఉగ్ర దాడి నుంచి ఆ బృందం ఎలా తప్పించుకుందంటే?



**శ్రీనగర్:** అందాల కశ్మీరంలో పర్యాటకులపై తూటాల వర్షం కురిసింది. వారిపై ఉగ్ర ముష్కరులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాంలోని బైసారన్ ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ దారుణానికి 26 మంది పర్యాటకులు బలయ్యారు. 20 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులున్నారు. వారిలో ఒకరు నేపాలీ కాగా మరొకరిది యూఏఈ. మరో ఇద్దరు స్థానికులు కాగా మిగతావారు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, యూపీ, బిహార్ తదితర రాష్ట్రాలకు చెందినవారు. వారిలో కేరళ రాష్ట్రానికి చెందిన ఓ బృందం ఉగ్రదాడి నుంచి తృటిలో తప్పించుకుంది. కేరళ నుంచి చిన్నారి సహా దాదాపు 23 మంది కశ్మీర్ పర్యటనకు వచ్చారు. వాళ్లంతా బైసరన్ ప్రాంతంలో ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు వెళ్లారు. అయితే, టూరిస్ట్ స్పాట్‌కు వెళ్లాలంటే గుర్రంపైన వెళ్లాల్సి ఉంటుంది. దీంతో వారు గుర్రపు స్వారీ ఖరీదు అధికంగా ఉండటంతో వేరే ప్రదేశానికి ట్యాక్సీ మాట్లాడుకుని వెళ్లిపోయారు. దీంతో ఈ దాడి నుంచి తృటిలో ప్రాణాలతో పడ్డారు. వేరే ప్రదేశానికి వెళ్తున్న టైంలో తమకు కొన్ని భారీ శబ్దాలు వినిపించాయని.. దుకాణాలు మూసివేస్తున్నారని.. ప్రజలు కూడా పారిపోతున్నారని ఆ పర్యాటకులు వివరించారు. అక్కడ ఏం జరుగుతోందో తమకు అర్థంకాలేదన్నారు. మేము అందమైన ప్రదేశానికి తీసుకెళ్లమని తమ గైడ్‌ను అడిగామని.. బతికి ఉండాలనుకుంటున్నారా..? లేదా..? అని. ట్యాక్సీ అతను సరాసరి తామున్న హోటల్ వద్దకు తీసుకెళ్లాడన్నారు. టీవీలో వార్తలు చూసిన తర్వాత అక్కడ ఉగ్రదాడి జరిందని.. గుర్రపు స్వారీకి వెళ్లి ఉంటే తమ పరిస్థితి ఎలా ఉండేందోనంటూ భయంకరమైన అనుభవాన్ని వివరించారు.

## ఇక భారత్ విడిచి వెళ్లాల్సిందే



**న్యూఢిల్లీ :** భారత్‌లోని పాక్ పౌరులకు కేంద్ర మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. దేశంలో ఉన్న పాక్ దేశస్తులు భారత్‌ను విడిచి వెళ్లిపోవాలని సూచించింది. జమ్మూకశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిని భారత్ తీవ్రంగా ఖండిస్తోంది. పహల్గాం ఉగ్రదాడి వెనుక పాక్ హస్తం ఉందని, సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశంపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో బుధవారం సమావేశమైన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ తీసుకున్న ఐదు సంచలన నిర్ణయాల అమలుకు భారత్ వడివడిగా అడుగువేస్తోంది. వేగంగా చర్యలు తీసుకునే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గురువారం పాక్ పౌరులకు జారీ చేసిన అన్నీ వీసాలను భారత్ రద్దు చేసింది. వాటిలో వైద్య వీసాలు కూడా ఉన్నాయి. పాకిస్తానీలకు వీసా సేవలను నిలిపివేసింది. కొద్ది సేపటిక్రితం విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. పాక్ పౌరులకు చెల్లుబాటయ్యే అన్నీ వీసాలను ఏప్రిల్ 27 రద్దు చేస్తున్నట్లు తెలిపింది. ఆ దేశ పౌరులకు జారీ చేసిన అన్నీ వైద్య వీసాలు ఏప్రిల్ 29 మంగళవారం వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని పేర్కొంది. సవరించిన సమయపాలన ఆధారంగా ప్రస్తుతం భారతదేశంలో ఉన్న అన్ని పాకిస్తానీలు వారి వీసాల గడువు ముగిసేలోపు వెళ్లిపోవాలని పేర్కొంది.

# పాకిస్తాన్ వెన్నులో వణుకు!

### భారత్ సర్జికల్ స్ట్రయిక్స్ చేస్తుందేమోనని మిస్సైల్స్ టెస్ట్‌కు ఆదేశాలు..!



పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌పై భారత్ కఠిన చర్యలకు ఉప్రకమించింది. అయితే, దాడి ఘటన తర్వాత భారత్ ఎలాంటి చర్యలు తీసుకుబోతోందని పాకిస్తాన్ భయాందోళనకు గురవుతున్నది. ఈ క్రమంలో ఈ నెల 24-25 తేదీల్లో జరిగిన ఎకనామిక్ జోన్‌లో కరాచీ తీరంలో ఉపరితలం నుంచి ఉపరితలం వరకు లక్ష్యాలను ఛేదించే క్షిపణులను పరీక్షించేందుకు పాకిస్తాన్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే, పరిణామాలన్నింటిని భారతీయ ఏజెన్సీలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. గతంలో ఉగ్రవాదులు దాడులకు ఆత్మాహుతికి పాల్పడడంతో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు వీరమరణం పొందిన విషయం తెలిసిందే. ఆ ఘటన తర్వాత పాకిస్తాన్‌పై భారత్ సైర్జికల్ స్ట్రయిక్స్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మళ్లీ భారత ఎలాంటి దాడులు చేస్తుందోనని పాకిస్తాన్ ఆందోళనకు గురవుతున్నారు. పహల్గాం దాడి తర్వాత పాకిస్తాన్‌పై భారత్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. సింధు జలాల ఒప్పందం రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆ దేశంపై ఆందోళన మరింత పెరిగింది. భారత్ దాడి చేస్తుందని పాకిస్తాన్ భావిస్తున్నది. ఇందులో భాగంగానే మిస్సైల్స్‌ని పరీక్షిస్తుంది. పాకిస్తాన్ వైమానిక దళం, నావికదళానికి నోటీసులు జారీ చేసింది. ఏదైనా దాడి జరిగితే ప్రతిస్పందించాలని సైన్యాన్ని అప్రమత్తం చేసింది. పాకిస్తాన్ నేవీ విన్యాసాలు మొదలుపెట్టిందని భారత్‌లో రక్షణ, భద్రతా సంస్థల వర్గాలు తెలిపాయి. భారత కదలికలను పాక్ పరిశీలిస్తూ వస్తున్నది. పహల్గాం దాడి ఘటనకు పాల్పడిన వారితో పాటు వారి స్పాన్సర్లను జవాబుదారీగా చేస్తామని భారత్ స్పష్టం చేసింది. పాకిస్తాన్‌లో జరుగుతున్న కార్యకలాపాలను భారత ఏజెన్సీలు నిశితంగా గమనిస్తున్నాయి. పాకిస్తాన్ సైన్యం సన్నాహాలను పర్యవేక్షిస్తున్నారు. పహల్గాం దాడి తర్వాత భారతదేశంలో జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో ప్రధాన నిర్ణయాలు తీసుకున్నారు. పహల్గాం దాడితో పాకిస్తాన్ సంబంధాలపై చర్చించారు. పాకిస్తాన్ సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతును ఉపసంహరించుకునే వరకు.. 1960 నాటి సింధు జల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు కేంద్రం చర్యలు తీసుకున్నది. అయితే, భారత ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తక్షణం ప్రభావం చూపకపోయినా.. దీర్ఘకాలికంగా ఇబ్బందులుపడే అవకాశాలున్నాయి. అలాగే, అట్టారిలోని ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ కూడా తక్షణమే మూసివేశారు. ఎస్ఏఏఆర్సీ వీసా మినహాయింపు పథకం కింద పాకిస్తాన్ జాతీయులను భారత్‌లో పర్యటించేందుకు అనుమతించరు. గతంలో పాక్ జాతీయులకు జారీ చేసిన వీసాలు రద్దయ్యాయి. వీసాలు రద్దయిన నేపథ్యంలో భారత్‌ను విడిచి వెళ్లేందుకు 48 గంటల సమయం ఉంటుంది.

## ఆయుధాలతో శ్రీనగర్‌లోకి విదేశీయులు.. ఆధారాలు ఉన్నాయన్న పాకిస్థాన్




**న్యూఢిల్లీ:** పెహల్గామ్ దాడి నేపథ్యంలో భారత్ తీసుకున్న కఠిన నిర్ణయాలను వ్యతిరేకిస్తూ పాకిస్థాన్ ప్రతీకార చర్యలకు దిగింది. ఉగ్రదాడిలో పాకిస్థాన్ హస్తం ఉన్నట్లు భారత్ పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిపై పాకిస్థాన్ సర్కారు స్పందించింది. పెహల్గామ్ దాడిలో తమ ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు చూపాలని పాకిస్థాన్ కోరింది. ప్రపంచ దేశాలకు ఆ ఆధారాలను వెల్లడించాలని పాకిస్థాన్ డిప్యూటీ ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ తెలిపారు. ఇవాళ ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్, ఇతరులతో కలిసి మాట్లాడారు. శ్రీనగర్‌లోకి కొందరు విదేశీయులు ఆయుధాలతో ప్రవేశించారని, దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని డిప్యూటీ ప్రధాని దార్ తెలిపారు. భారత ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ఆ వ్యక్తులను శ్రీనగర్‌లో దాచినట్లు పాక్ డిప్యూటీ పీఎం ఆరోపించారు. భారతీయ నిఘా సంస్థలు విదేశీయులకు సపోర్టు ఇస్తున్నాయని, ఆ విదేశీయులు భారత్‌కు ఐఈడీలు సరఫరా చేస్తున్నట్లు విదేశాంగ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఒకవేళ భారత్ తమపై ఎలాంటి చర్యలకు దిగినా, దాన్ని ఎదుర్కొనేందుకు పాక్ సైనిక దళాలు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. పెహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మృతిచెందారు.

# స్థానిక సంస్థలు.. స్థానిక ప్రభుత్వాలుగా మారాలి

-మొదటిపేజీ తరువాయి

అన్నారు. స్థానిక సంస్థలు అన్ని రంగాల్లో స్వావలంబన సాధించి స్థానిక ప్రభుత్వాలుగా మారేలా ప్రతి ఒక్కరూ కషి చేయాలని, దానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. "నాకు పల్లెలు అంటే ప్రాణం. పల్లెల్లో బతకాలని బలంగా ఉండేది. కానీ సాధ్యపడలేదు. కూటమి ప్రభుత్వంలో చాలా ఇష్టంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖలను చేపట్టాను. శాఖలను తీసుకున్న తర్వాత 2 నెలల పాటు సమగ్ర పరిశీలన చేసిన తర్వాత అధికారుల సమావేశంలో నేను చెప్పింది ఒక్కటే.. పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖల్లో ఏ పనికి ఏ నిధుల కేటాయింపు జరిగిందో అది పక్కాగా దానికే ఖర్చు చేయాలి. పారదర్శకంగా పనులు జరగాలి అని చెప్పాను. ఎలాంటి మళ్లింపులు, వధా ఖర్చులు లేకుండా పల్లెల్లో సౌకర్యాలు, వసతులు సమకూరాలి అని చెప్పాను. దాని ప్రకారమే ఇప్పుడు పనులు జరుగుతున్నాయి. అలాగే పీఆర్, ఆర్.డి. శాఖల్లోని సిబ్బంది బదిలీలు ఎన్నడూ జరగనంత పారదర్శకంగా జరిపాం. సిఫార్సులకు, అవినీతికి తావు లేకుండా బదిలీలను పక్కాగా జరిపాం. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులు ఉన్నప్పటికీ నిబంధనలను అనుసరించి మాత్రమే బదిలీలు చేశాం. సమర్ధత ఉన్నా నిర్లక్ష్యం కాబడిన ఉద్యోగులను, అధికారులకు తగిన సమున్నత అవకాశాలు ఇచ్చేలా ప్రణాళికతో ముందుకు వెళ్లాం. పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖల్లో సమూల మార్పులు తీసుకొచ్చాం. దీని ఫలితమే సమష్టి కషితో పనులు పల్లెలలో వేగంగా జరుగుతున్నాయి. దీనిని ముందుకు తీసుకెళ్లడంలో ఎంతో కషి చేస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ శశిభూషణ్ కుమార్ గారికి,



పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ కమిషనర్ శ్రీ మైలవరపు కష్ణతేజ గారికి ప్రత్యేక కతజ్ఞతలు తెలుపుతున్నాను. పనులను వేగవంతంగా పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు సంబంధించిన బిల్లులు కూడా త్వరలోనే అందుతాయి. కేంద్రంలో కొన్ని ఆర్థికపరమైన అంశాల వల్ల ఆలస్యం అయింది. అవి త్వరలోనే తీరుతాయి. నాకు పాలనపరమైన అనుభవం లేకున్నా, ప్రజలకు మేలు చేయాలనే త్రికరణ శుద్ధి ఉంది. రాజకీయాలకు అతీతంగా నిధులు అందిస్తున్నాం . గ్రామ పంచాయతీలు గతంలో కులాలు, రాజకీయాలు, వర్గపోరుతో సతమతం అయ్యేవి. దీన్ని క్రమంగా అధిగమిస్తున్నాం. గ్రామ పంచాయతీలకు రాజకీయాలకు అతీతంగా నిధులు అందిస్తున్నాం. ఉపాధి కూలీ అనొద్దు.. ఉపాధి శ్రామికుడు లేదా నేస్తంగా పిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, ఏపీఎస్ఆర్ డీపీర్ కమిషర్ ఆర్. ముత్యాలరాజు, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి, అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, సత్యసాయి జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ వై.వి.కె. షణ్ముఖ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం సీఈ బాలు నాయక్, గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్య విభాగం చీఫ్ ఇంజినీర్ గాయత్రిదేవి, సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెగువ చూపారు.. వారందరికీ సెల్యూట్

-మొదటిపేజీ తరువాయి

మండిపడ్డారు. ప్రజావ్యతిరేకతను అణచివేయడం సాధ్యం కాదన్న ఆయన.. మేనిఫెస్టో అమలు చేయకపోతే ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త నిలదీస్తాడని చెప్పారు. "బలం లేకపోయినా స్థానిక సంస్థల్లో టీడీపీ పోటీ చేస్తోంది. ప్రజలు ఓడించారు కాబట్టే.. చంద్రబాబు తన సొంత నియోజకవర్గం చంద్రగిరిని విడిచిపెట్టి కుప్పం వెళ్లిపోయాడు. అక్కడ బీసీలు ఉన్నారు.. వారు ఆర్థికంగా ఇతరత్రా బలంగా ఉండరు కాబట్టి, వారిని తొక్కితొక్కిపెట్టవచ్చని చంద్రబాబు కుప్పంలో పాగావేశారు" అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

**జై జగన్.. అన్నారని కేసులు పెట్టారు..**

చంద్రగిరి ఎంపీపీ ఉప ఎన్నికల్లో గెలిచాక జై జగన్, జై వైఎస్సార్‌సీపీ అన్నారని కేసులు పెట్టారు. గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు తిరిగే ధైర్యంలేదు. తిరిగితే ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నీ విధ్వంసం. ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లడాన్ని నరకంగా మార్చేశారు. విద్యా, వైద్య రంగాలు దారుణంగా తయారయ్యాయి. చంద్రబాబుగారు అధికారంలో వచ్చాక 4 లక్షలు పెన్షన్లు తీసేశారు. అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. బెల్టుషాపులు గుడి, బడి పక్కనే కనిపిస్తున్నాయి.

**రూపాయికి ఇడ్లీ వస్తుందో లేదో తెలియదు కానీ..**

..ప్రతి బాటిల్‌పైన రూ.20ల ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. వైఎస్సార్‌సీపీలో కన్నా ఇసుక రేటు రెండింతలు పెరిగింది. ఉచితం అని చెప్పి.. దోచుకుంటున్నారు. పైనుంచి కిందిదాకా ముడుపులు చెల్లిస్తేనే మైనింగ్ అయినా, పరిశ్రమ అయినా నడిచేది. అవినీతినుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి డైవర్షన్ టాపిక్స్ ఎంచుకుంటున్నారు. విశాఖపట్నంలో ఊరూపేరు లేని ఉర్సా లాంటి కంపెనీలకు రూ.3,000 కోట్లు ఖరీదు చేసే భూములిస్తున్నారు. ఒక చిన్న ఇంట్లో రెషిడెన్షియల్ అపార్ట్‌మెంట్ కట్టే కరెంటు బిల్లు ఆ కంపెనీ కడుతుంది. అమెరికాలో వాళ్ల ఆఫీసు చూస్తే.. అది కూడా చిన్న ఇల్లే. రూపాయికి ఇడ్లీ వస్తుందో లేదో తెలియదు కానీ చంద్రబాబు హయాంలో ఉర్సా లాంటి ఊరూ పేరు కంపెనీకి రూ.3,000 కోట్ల డబ్బులు దోచిపెడుతున్నారు.



విశాఖఫట్నంలో లూలు గ్రూపులకు, లిల్లీ గ్రూపులకు రూ.1500- 2000 వేల కోట్లు ఖరీదు చేసే భూములను.. టెండర్లు లేకుండా కట్టబెట్టారు.

**జగన్ చేయగలిగాడు.. బాబు ఎందుకు చేయలేకపోతున్నాడు?'**

..లెఫ్ట్, రైట్, సెంటర్ రాష్ట్రాన్ని రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. అమరావతి నిర్మాణ పనుల్లోనూ దోపిడీ. 2018లో ఐదేళ్ల కిందట చంద్రబాబు హయాంలో టెండర్లు పిలిచినప్పుడు పనుల విలువ రూ. రూ.36,000 కోట్లు. అప్పట్లో ఇప్పటికన్నా స్టీలు, సిమెంట్లు రేట్లు ఎక్కువ. అయినా కూడా ఆ రూ.36,000 కోట్ల విలువ ఈరోజు రూ.78,000 కోట్లకు పెంచేశారు. టెండర్లు రింగ్ ఫార్మ్ చేసి వాళ్ల కాంట్రాక్టర్లకే ఇచ్చుకుంటున్నారు. మొబలైజేషన్ అడ్వాన్సులు కొత్తగా ఇవ్వడం మొదలుపెట్టాడు. 10 శాతం మొబలైజేషన్ అడ్వాన్స్‌లు ఇవ్వడం, అందులో 8శాతం కమీషన్లుగా తీసుకోవడం.. ప్రభుత్వం చేసిన అప్పులన్నీ ఎక్కడకు పోతున్నాయో తెలియడంలేదు. గతంలో ఎందుకు జగన్ చేయగలిగాడు.. చంద్రబాబు ఎందుకు చేయలేకపోతున్నాడు?" అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు.

**బాబు హయాంలో బటన్లు లేవు.. నేరుగా ఆయన జేబులోకే డబ్బులు**

"జగన్ నేరుగా బటన్ నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి వేసేవాడు. ఇప్పుడు చంద్రబాబు హయాంలో బటన్లు లేవు.. నేరుగా ఆయన జేబులోకే పోతున్నాయి. ఇదే విషయాన్ని ఎన్నికల సమయంలో మొత్తుకుని చెప్పాను. చంద్రబాబు నాయుడుని నమ్మడం అంటే చంద్రముఖిని నిద్రలేపడమే. ఈ రోజు ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోంది. వీటికి సమాధానం చెప్పుకోలేక ప్రతిరోజూ డైవర్షనే. ఒక రోజు లడ్డూ, మరోరోజు బోటు.. ఇంకోరోజు ఐపీఎస్ అధికార్ల అరెస్టులు అంటూ డైవర్షన్లు

**ఇలాంటి పాలనే రాష్ట్రంలో జరుగుతోంది..**

..కరెంటు బిల్లులు షాక్ కొట్టేలా పెంచారు.. వీటి గురించి అడిగితే.. ఆయన చేసిన లిక్కర్ స్కాంను మరలా ఇంకొకరు మీద రుద్ది అరెస్టు చేస్తాడు. ఇలా ప్రతి రోజూ ఏదో ఒక సెన్సేషన్ క్రియేట్ చేసి దాన్నుంచి టాపిక్ డైవర్షన్ చేయడం పరిపాటిగా మారింది. రోమన్ రాజులు మీద ప్రజల్లో వ్యతిరేకత ఎక్కువగా వస్తుందని గ్లాడియేటర్స్‌ను పెట్టిన గేమ్స్ ఆడించేవాళ్లు. మనుషులు చేతుల్లో కత్తులు పెట్టి, జంతువులను పెట్టి.. చనిపోయేవరకు యుద్ధాలు చేయించేవారు. వాటని ప్రజలు చూసేలా చేసి వారిని మభ్యపెట్టి డైవర్ట్ చేసేవారు. దీంతో రాజు ఎలా పరిపాలన చేస్తున్నారో చర్చించడం మాని ప్రజలు ఆ ఆటలు గురించే చర్చించేవారు. మిగిలిన విషయాలు పక్కకు పోయేవి. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో పాలన జరుగుతుంది. ఎంతో మంచి చేసిన మనమే ప్రతిపక్షంలో కూర్చొన్నాం. ఇక ఏ మంచీ చేయకుండా, మోసం చేసిన చంద్రబాబు పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పక్కరలేదు ..ఇంత మోసం చేసిన మనిషిని ప్రజలు సింగిల్ డిజిట్ రాని పరిస్థితుల్లోకి పరిమితం చేస్తారు. ఆ రోజు వస్తుంది. కచ్చితంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అఖండమైన మెజార్టీతో అధికారంలోకి వస్తుంది. ప్రతి కార్యకర్తకు.. మన ప్రభుత్వంలో మీ జగన్ 2.0లో తోడుగా ఉంటాడు అని హామీ ఇస్తున్నాను. ఈ రోజు కార్యకర్త ఎంతలా ఇబ్బంది పడుతున్నాడో చూస్తున్నాను" అని వైఎస్ జగన్ అన్నారు.

## పెరుగుతున్న బంగారం ధరతో...
# స్వర్ణకారుల అవస్థలు

**రాజమండ్రి :** బంగారం ధర లక్ష రూపాయలు దాటేసింది. పది గ్రాముల పసిడి త్వరలో లక్షా పాతికకు వెళ్తుందని అంచనా. బంగారం ధర ఆకాశాన్నంటుండటంతో మధ్యతరగతి ప్రజలు బంగారు వైపు చూసేందుకు జంకుతున్నారు. ముఖ్యంగా బంగారు వస్తువులు చేయించుకోవడానికి గోల్డ్ స్మిత్ వర్కర్స్ దగ్గరికి రావడం మానేశారు. దీంతో ఉన్న వ్యాపారం పోయి గోల్డ్ స్మిత్ వర్కర్లు డీలాపడ్డారు. ప్రస్తుతం తమ పరిస్థితి దయనీయంగా ఉందంటున్నారు స్వర్ణకారులు. స్వర్ణకారులు సాధారణంగా బంగారం, వెండి తోపాటు ప్లాటినం వంటి లోహాలను ఉపయోగించి ఆభరణాలు, ఇతర అలంకరణ వస్తువులను డిజైన్ చేయడం, క్రాఫ్టింగ్ చేయడం, మరమ్మతు చేయడం, సవరించడం వంటి పనులను చేపడతారు. ఒక బంగారు వస్తువు తయారు చేయాలన్నా.. వస్తువు రీప్లేస్‌మెంట్ చేయాలన్న చాలా నిశిత దృష్టి అవసరం. అలాంటి స్వర్ణకారుడు ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి మెయిన్ రోడ్ లో 700కి పైగా బంగారు షాపులు ఉన్నాయి. ఇందులో వందలాది మంది స్వర్ణకారులు పనులు చేసుకుంటున్నారు. తాజాగా పెరిగిన బంగారం ధరలతో బంగారం కొనుగోలు చేయలేక మధ్యతరగతి వారు కూడా కనీసం షాపులకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే మమ్మలను ఆదుకోవాలని కోరుతున్నారు. బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నందున ప్రజలు బంగారు ఆభరణాలు తయారు చేయడానికి తమ వద్దకు రాక పనులు లేక స్వర్ణకారులు షాపులు వెలవెలబోతున్నాయి. స్వర్ణకారుల షాపుల వద్ద పనులు లేక కొన్ని షాపులు మూసేస్తే మరికొన్ని షాపుల వద్ద ఖాళీగా పనిలేక నిరాశతో ఉన్నారు. బంగారు ధరల పెరుగుదలను పరిగణనలోకి తీసుకుంటే ప్రజలు మునుపటి కంటే తక్కువ బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారు. తత్ఫలి తంగా, స్వర్ణకారులు ప్రతికూలంగా ప్రభావితమవుతున్నాయి అంటున్నారు. చాలా మంది చేతి వృత్తులవారి జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయని, ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్న సీనియర్ స్వర్ణకారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల్లో స్వర్ణకారులకు లోన్లు రాక.. ఇటు పనులు లేక కొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని వాపోతున్నారు. బంగారం ధర పెరుగుదలతోపాటు.. పెద్ద పెద్ద లగ్జరీష్ బంగారం షాపులు వచ్చేయడంతో పనులు బాగా తగ్గిపోయిని వాపోతున్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుని ఏదైనా భృతి ప్రకటించాలని కోరుతున్నారు రాజమండ్రి స్వర్ణకారులు. తూర్పుగోదావరి జిల్లాలో ఒక రాజమండ్రిలోనే వెయ్యి మందికి పైగా స్వర్ణకారులు ఈ సాంప్రదాయ వృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. ఇక చుట్టుపక్కల స్వర్ణకారులైతే మరొక 3,000 నుంచి 4,000 మంది వరకు ఉంటారు. పూర్వపు ఉమ్మడి గోదావరి జిల్లాలో దాదాపు వేలాది మంది స్వర్ణకారులు పరిస్థితి ఇలాగే ఉందని అంటున్నారు. ఆభరణాల తయారీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రావడంతో ఈ వృత్తికి ప్రాధాన్యత తగ్గడం..

## టెక్నాలజీ వినియోగంతో రియల్ టైమ్‌లో సేవలు

-మొదటిపేజీ తరువాయి

భూ రికార్డుల డిజిటలైజేషన్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కాగా.. 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై సచివాలయంలో ఉన్నతాధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు వర్క్‌షాప్‌కు హాజరై, ప్రారంభోపన్యాసం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైన ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. గుడ్ గవర్నెన్స్ కోసం ఏఐ సహా నూతన టెక్నాలజీ వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై ప్రధానంగా చర్చించనున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పౌర సేవల్లో టెక్నాలజీ వాడకం, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, వచ్చే ఫలితాలపై కేస్ స్టడీస్ పరిశీలించనున్నారు. ఏయే విభాగాల్లో ఎటువంటి సాంకేతికను వినియోగించవచ్చు, ప్రస్తుతం ఉన్న సమాచారం ఆధారంగా సేవల్ని ఎలా విస్తృత పరచవచ్చు అనే దానిపై ప్రజంటేషన్ ఇచ్చారు. ఏఐ, ఎంఎల్, డీఎల్, చాట్ జీపీటీ, జెమిని, డేటా డ్రివెన్, ఎవిడెన్స్ బేస్డ్ గవర్నెన్స్, ఏఐ ప్లేబుక్, ఏఐ బేస్డ్ పైలెట్ ఐడియాస్ వంటి అంశాలపై ప్రత్యేక సెషన్స్ ఏర్పాటు చేశారు. వ్యవసాయం, విద్య, వైద్య, పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని పలువురు నిపుణులు వివరించనున్నారు. రెండు రోజుల పాటు కొనసాగనున్న వర్క్‌షాప్‌లో మొదటిరోజు కార్యదర్శులు, రెండోరోజు విభాగాధిపతులు హాజరుకానున్నారు. ఈ వర్క్‌షాప్‌కు సీఎస్, డీజీపీ, వివిధ శాఖల అధికారులు, కేంద్ర ఐటీ శాఖ మాజీ సెక్రటరీ చంద్రశేఖర్ ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. అలాగే వాద్వాని సెంటర్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ సీఈవో ప్రకాష్ కుమార్, డబ్ల్యుజీడీటీ డీన్ కమల్ దాస్‌తో సహా పలువురు నిపుణులు పాల్గొన్నారు.

## ఏపీలో కొత్త పెన్షన్లకు గ్రీన్ సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

పెన్షన్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కొత్తగా ధరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్‌ను జూన్ నుండి అందజేస్తారు. కాగా, 2014- 19 మధ్య టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పెన్షన్ నమోదు ప్రక్రియ నిరంతరాయంగా జరిగేది. లబ్ధిదారులు వారంలో ఏ రోజైన సరే పెన్షను దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. అధికారులు వాటిని ఏ వారానికి ఆ వారం పరిశీలించి నెలాఖరుకు పెన్షన్ జాబితాను సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పెన్షన్ పొందే అవకాశం ఉండేది. కానీ, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి చెక్ పెట్టింది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే లబ్ధిదారుల జాబితాను రూపొందించే విధానం తీసుకొచ్చింది. ప్రతి ఏడాది జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొందిస్తామని తేల్చి చెప్పింది. అయితే, గడిచిన ఐదేళ్లలో ఒక్క సారి కూడా ఆ ప్రకారంగా జాబితాను రూపొందించిన దాఖలాలు లేవు. విద్యుత్, ఇన్‌కమ్ టాక్స్, ఫోర్ వీలర్, ఇళ్లు, పొలం తదితరాల పేరుతో వేలాదిమందిని పెన్షన్ పథకానికి అనర్హులను చేసి జగన్ ప్రభుత్వం తొలగించింది. అయితే, ఇలాంటి వారంతా కూటమి ప్రభుత్వంలో ఉపశమనం పొందుతున్నారు.

## వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు ప్రలోభాలు.. ప్రత్యేక విమానాలేంటి?: బొత్స

**విశాఖపట్నం:** ఏపీలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఆర్థిక మూలాల మీద దెబ్బ కొడతామని కూటమి నేతలు బెదిరించడం కరెక్ట్ కాదని మండిపడ్డారు ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ. రాజకీయాల్లో? ఇటువంటి సాంప్రదాయం మంచిది కాదని హితవు పలికారు. కూటమి నేతలు ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా మెజార్టీ కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారని అన్నారు. ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తాజాగా విశాఖలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ.. కశ్మీర్‌లో తీవ్రవాదుల కాల్పులు కారణంగా 26 మంది చనిపోవడం బాధాకరం. మన రాష్ట్రానికి చెందిన ఇద్దరు చనిపోవడం దురదృష్టకరం. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఆర్థిక మూలాల మీద దెబ్బ కొడతామని కూటమి నేతలు బెదిరించారు. నేనెప్పుడూ ఇటువంటి రాజకీయాలను చూడలేదు. రాజకీయాల్లో ఇటువంటి సాంప్రదాయం మంచిది కాదు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల కోసం ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేశారు. 11 నెలల మేయర్ పదవి కోసం అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ 11 నెలల కాలంలో ఏం చేస్తారో ప్రజలకు చెబుదాం. ఎన్ని ప్రలోభాలు పెట్టినా మెజార్టీ కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారు. వారందరినీ అభినందిస్తున్నాను అంటూ వ్యాఖ్యలు చేశారు.

## ఏపీ బీజేపీ ఛీఫ్ కోసం పోటీ..

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్ష పదవికి భారీ స్థాయిలో పోటీ నెలకొంది. కూటమి అధికారంలో ఉంది. కేంద్ర ప్రభుత్వంలోనూ ఏపీ ఇంపార్టెన్స్ పెరిగింది. అమరావతి, పోలవరం నిర్మాణాలకు ప్రాధాన్యత దక్కుతోంది. ఈ కారణాలతో ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి గతంలో కంటే ప్రాముఖ్యమైందిగా మారిపోయింది. అందుకే ఈసారి ఎన్నడూ లేనంతగా ఆ పదవి కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. రాష్ట్రంలో ,కేంద్రంలో తమకున్న పలుకుబడి దృష్ట్యా ఎవరికీ వారు తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలుగా ఉన్న దగ్గుబాటి పురందేశ్వరికే మరోసారి ఆ బాధ్యతలు అప్పగించే ఆలోచనలో బీజేపీ అధిష్ఠానం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. కేంద్రంలో కీలక పదవికి ఆమెను తీసుకు వెళ్లాలని భావించినా 2024 ఎన్నికల సమయంలో కీలకంగా ఆమె వ్యవహరించడం ఎన్టీఆర్ కుమార్తె అనే సెంటిమెంట్ ప్రజల్లో ఉండడం టిడిపి నేతలు, జన సైనికులు కూడా ఆమెతో గౌరవంగా ఉండడం పార్టీకి కలిసి వస్తుందని కేంద్ర స్థాయి నేతలు భావిస్తున్నారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేని పనితీరు మరోసారి కలిసి వచ్చే ఛాన్స్ ఉంది. ఇటీవలే ఆమె కుటుంబంతో నారా కుటుంబం కూడా కలిసిపోయిన పరిస్థితులు బేరీజు వేసుకుని పురందేశ్వరికే మరికొంత కాలం పార్టీ బాధ్యతలు అప్పజెప్పాలని కేంద్ర బీజేపీలోని ఒక వర్గం భావిస్తోంది. ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వ్యక్తుల్లో విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సత్యనారాయణ చౌదరి అలియాస్ సుజనాచౌదరి ఒకరు. 2019 ఎన్నికల్లో టిడిపి ఓటమి తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో బీజేపీలో చేరిన ఆయన అప్పటి నుంచి పార్టీకి నమ్మకంగా పని చేస్తూ వస్తున్నారు. ఆర్థికంగా సామాజికంగా బలమైన వ్యక్తి కావడంతోపాటు కేంద్ర స్థాయిలో పలుకుబడి కూడా గట్టిగానే ఉంది. 2024 ఎన్నికల్లో చాలా కీలకంగా వ్యవహరించిన ఆయనకు టిడిపి హైకమాండ్‌తో కూడా దగ్గర పరిచయాలు ఉన్నాయి. అంతేకాకుండా ఇటీవల వైసీపీలో నుంచి బయటికి వచ్చిన ఒక కీలక నేత ఆ నిర్ణయం తీసుకునేలా చక్రం తిప్పింది సుజనా చౌదరే అని త్వరలోనే ఆ వ్యక్తి బిజెపిలో చేరతారని ఏపీ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ ప్రచారంలో వాస్తవం ఎంత ఉన్నా సుజనా చౌదరికి బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పజెప్పినట్లయితే పార్టీని బలోపేతం చేసేలా కీలక వ్యక్తులను ప్రముఖులను పార్టీ వైపు ఆకర్షించేలా చేయగల సమర్థత సుజనా చౌదరికి ఉందని ఆయన వర్గం చెబుతూ వస్తోంది. సుజనా చౌదరి కూడా ఆ దిశగా తన ప్రయత్నాలు ముమ్మరం చేశారన్న సంకేతాలు అందుతున్నాయిబిజెపి ఈసారి రాయలసీమనేతకు రాష్ట్ర అధ్యక్ష పదవి కట్ట పెట్టాలంటే అది దక్కేది విష్ణువర్ధన్ రెడ్డికే. ఇప్పటికే ఆ దిశగా తన ప్రయత్నాలు తీవ్రతరం చేశారాయన. యువనేత కావడం ప్రత్యర్థులకు సీరియస్‌గా సమాధానం చెప్పడం పార్టీకి విధేయుడుగా ఉండడం ఇవన్నీ ఆయనకి కలిసి వచ్చే అంశాలు కాగా.. కాస్త దూకుడు స్వభావం చిక్కులు తెచ్చి పెడుతూ ఉంటుంది. కానీ ఎలాగైనా బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం తన వంతు ప్రయత్నం ఆయన ముమ్మరంగా చేస్తున్నారు బీజేపీ కేంద్ర నాయకత్వం వద్ద అత్యంత పలుకుబడి గల వ్యక్తి. కేంద్ర విధానాలపైన రాష్ట్ర సమస్యలపైన లోతైన అవగాహన ఉన్న వ్యక్తి ఈయనే. 2024 ఎన్నికలకు ముందే ఏపీకి షిఫ్ట్ అయిన జీవీఎల్ నరసింహారావు కొంతకాలం పాటు వైజాగ్‌కు మాత్రమే పరిమితం అయిపోయారు. ఇప్పుడు మారిన పరిణామాల దృష్ట్యా రాష్ట్ర రాజకీయాల్లో కీలక బాధ్యతలు నిర్వహించాలని భావిస్తున్నారు. పైపెచ్చు మొదటి నుంచి బిజేపీతోనూ సంఘ్ పరివార్‌తోనూ లోతైన సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తిగా జివిఎల్ బిజెపి కేంద్ర నాయకత్వం దృష్టిలో గుడ్ లుక్స్‌లో ఉన్నారు. బిజెపి రాష్ట్రంలో కష్టకాలంలో ఉన్న సమయంలోనూ నిబద్ధతతో పనిచేసిన వ్యక్తిగా మాధవ్‌కు గుర్తింపు ఉంది. గతంలో విపక్షంలో ఉన్నప్పుడు ఎమ్మెల్సీగా ప్రజా సమస్యలపై మాట్లాడిన అనుభవం ఉంది. వివాదరహితుడు కావడంతోపాటు ఉత్తరాంధ్రకు చెందిన నాయకుడిగా ఉన్న పేరు అందరితో కలిసిపోయే మనస్తత్వం మాధవ్‌కు ప్లస్ పాయింట్స్. మంచివాడు సమర్థుడు అనే పేరు ఉన్నా మిగిలిన వారితో పోలిస్తే కేంద్ర నాయకత్వం దగ్గర రాష్ట్ర అధ్యక్షుడు పదవి

# సంపాదకీయం

## పొత్తుతో చిత్తయ్యేదెవరు?

గత లోక్‌సభ ఎన్నికలకు ముందు విడిపోయిన ఎఐఎడిఎంకె, బిజెపి పొత్తు ఒకటిన్నర సంవత్సరాల తర్వాత, 2026 ప్రారంభంలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు తిరిగి ఏర్పర్చుకొనేందుకు రెండు పార్టీలు ముందడుగు వేస్తున్నాయి. 2021లో అధికారాన్ని కోల్పోయినప్పటి నుండి తన ప్రాబల్యాన్ని కోల్పోతూ వస్తున్న ఎఐఎడిఎంకె డిఎంకె నేతృత్వంలోని కూటమిని అధికారం నుండి తొలగించే ప్రయత్నాలలో బిజెపితో చేతులు కలిపేందుకు సిద్ధమవుతున్నది. మరోవంక, దక్షిణాదిన వ్యాప్తి చెందేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించక పోవడంతో తమిళనాడులో బలం పెంచుకునేందుకు బిజెపి సైతం ఆత్రుతతో వ్యవహరిస్తున్నది. అయితే ఆ రెండు పార్టీలు తప్పనిసరి పరిస్థితులలో చేతులు కలుపుతున్నా ఆచరణలో పరస్పరం అవిశ్వాసంతో వ్యవహరిస్తున్నాయి. ఆయా పార్టీలలో సైతం పొత్తుకు సానుకూలమైన సంకేతాలు కనిపించడం లేదు. ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా విధానం వంటి అంశాలను దూకుడుగా లేవనెత్తడంతో పాటు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో సంఘర్షణకు దిగడం ద్వారా 'తమిళ్ ప్రైడ్' ఆయుధంగా ప్రజల సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారు. ఓ విధంగా రాష్ట్రరాజకీయాలపై ఆధిపత్యంతో వ్యవహరిస్తున్న డిఎంకెను ఎదుర్కొనేందుకు అవసరమైన సైద్ధాంతిక, రాజకీయ పటుత్వం ఎఐఎడిఎంకె-బిజెపి కూటమిలో కనిపించడం లేదు. బిజెపితో తిరిగి పొత్తు పెట్టుకోవడంపై ఎఐఎడిఎంకెలో అసంతృప్తి గుసగుసలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. చివరకు ఈ పొత్తులో కీలకంగా కనిపించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా సైతం ఒత్తిడులు ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తున్నది. ఆయన మద్దతుతోనే బిజెపి మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఏకపక్షంగా వ్యవహరిస్తూ, అన్నాడిఎంకెను మాత్రమే కాకుండా పార్టీలో కీలక నేతలను సైతం దూరం చేసుకున్నారని తెలుస్తోంది. పొత్తు ప్రకటన కోసం చెన్నైకి రావడానికి రెండు రోజుల ముందు కొంతమంది బిజెపి కార్యకర్తలు ఢిల్లీ వెళ్లి ఆయనను కలిసి అన్నామలైను అధ్యక్ష పదవి నుండి తొలగించాలని కోరితే ఆయన తీవ్రమైన ఆగ్రవేశాలు వ్యక్తం చేశారు. నాయకత్వం విషయం తమకు వదిలివేసి బూత్ స్థాయిలో పార్టీ పని చూసుకోండి అంటూ మందలించి పంపించారు. నాయకులపై ఫిర్యాదు చేయడానికి ఢిల్లీకి రావద్దని హెచ్చరించారు. అయితే, ఎఐఎడిఎంకెతో పొత్తు కోసం ఏప్రిల్ 10న అమిత్ షా చెన్నైకి వచ్చినప్పుడు, దాని నాయకుడు ఇ కె పళనిస్వామి విమానాశ్రయంలో తనకు స్వాగతం చెప్పేందుకు రాకపోవడంతో ఖంగుతిన్నారు. ఆ రోజు సాయంత్రం అనుకున్న ఎన్‌డిఎ మీడియా సమావేశం బిజెపి సమావేశంగా మారింది. దానితో వెంటనే ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త గురుమూర్తి వద్దకు వెళ్లి సమాలోచనలు జరిపారు. ఆ వెంటనే అన్నామలై సైతం వెళ్లి ఆయనను కలిశారు. అన్నాడిఎంకె- బిజెపి పొత్తులో మొదటి నుండి గురుమూర్తి కీలక భూమిక నిర్వహిస్తున్నారు. ఆ తర్వాతనే రాష్ట్ర అధ్యక్షుడిని మార్చడం, మరుసటి రోజు మాజీ అన్నాడిఎంకె నేత నైనార్ నాగేంద్రన్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించిన తర్వాతనే పొత్తు ఖరారు చేస్తూ అమిత్ షా ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి పళనిస్వామి రావడం జరిగింది. అయితే ఆ తర్వాత తమ పొత్తు సీట్ల సర్దుబాటు వరకే అని, ఎన్నికల అనంతరం తాము ఏర్పాటు చేయబోయే మంత్రివర్గంలో బిజెపి ఉండబోదని పళనిస్వామి ప్రకటించడం గమనార్హం. అన్నాడిఎంకెతో పొత్తు ప్రకటించిన తర్వాత ఇటీవలి సంవత్సరాలలో బిజెపి వైపు ఉన్న మాజీ ఎఐఎడిఎంకె నాయకులు, మాజీ సిఎం ఓ పన్నీర్ సెల్వం, తన సొంత పార్టీ ఎఎంఎంకెకు నాయకత్వం వహిస్తున్న టిటివి దినకరన్ వంటి వారు ఈ కూటమికి దూరంగానే కనిపిస్తున్నారు. బిజెపి- ఎఐఎడిఎంకె కూటమి అటువంటి పార్టీలను ఎన్‌డిఎ కూటమిలో ఎలా తీసుకురాగలదో చూడాలి. చెన్నైలో తమ కూటమిని ప్రకటిస్తూ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బిజెపి ఎఐఎడిఎంకె అంతర్గత విషయాలలో జోక్యం చేసుకోదు లేదా తొలగించిన నాయకులను తిరిగి చేర్చుకోవాలని వారిని అడగదు. ఎటువంటి జోక్యం ఉండదు అని స్పష్టమైన హామీ ఇవ్వాల్సి రావడం గమనార్హం. 2016 ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేసిన బిజెపి ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. దాని 188 మంది అభ్యర్థులలో ఎనిమిది మంది తప్ప మిగిలిన వారందరూ డిపాజిట్లు కోల్పోయారు. 2.8% వద్ద, బిజెపి ఓట్ల వాటా 2011 ఎన్నికలలో పొందిన 2.2% నుండి స్వల్పంగా మాత్రమే పెరిగింది. అంతకు ముందు లోక్ సభ ఎన్నికలకు మాత్రమే పరిమితమైన ఎఐఎడిఎంకె-బిజెపి పొత్తు మొదటిసారిగా 2021లో అసెంబ్లీ ఎన్నికలకు విస్తరించింది. దానితో మొదటిసారిగా బిజెపి నాలుగు సీట్లు గెల్చుకోగలిగింది. ఆ పార్టీ రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లను గెలుచుకోవడం ఇది మూడోసారి మాత్రమే. ఎఐఎడిఎంకె సీట్ల సంఖ్య 66కు పడిపోయింది. చాలా సీట్లలో పోటీ చేసిన ఎఐఎడిఎంకె తన ఓట్ల వాటాను 33.3%కి తగ్గించుకుంది. అయితే, కేవలం 20 సీట్లలో పోటీ చేసినప్పటికీ బిజెపి ఓట్ల వాటా స్వల్పంగా 2.6%కి పడిపోయింది. సెప్టెంబర్ 2023 లో, ఎఐఎడిఎంకె నాయకత్వంపై అన్నామలై చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య సంబంధాలను తెంచుకొనే వరకు వెళ్లడంతో 2024 లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేశాయి. డిఎంకె నేతృత్వంలోని ఇండియా బ్లాక్ రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడం ద్వారా తన ఆధిపత్యాన్ని కొనసాగించడంతో వారిద్దరూ ప్రభావం చూపలేకపోయారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలను అసెంబ్లీ స్థాయిలో పరిశీలిస్తే, ఒక్క సీటు కూడా గెలవలేకపోయినప్పటికీ, బిజెపి 59 సెగ్మెంట్లలో రెండవ స్థానంలో, 64 సెగ్మెంట్లలో మూడవ స్థానంలో నిలిచింది. వీటిలో, బిజెపి 56 అసెంబ్లీ సెగ్మెంట్లలో 20 శాతం కంటే ఎక్కువ ఓట్లను, 20 సెగ్మెంట్లలో 30 శాతం కంటే ఎక్కువ ఓట్లను సాధించింది. ఆ బలంతోనే వచ్చే ఎన్నికలలో తన ఉనికిని మరింతగా పెంచుకునేందుకు బిజెపి ఉత్సాహ పడుతున్నది. తమిళ పార్టీలు తమ సైద్ధాంతిక పటుత్వం కోల్పోయాయని, దానితో ఇప్పుడు జాతీయ రాజకీయ పార్టీలకు తమిళనాడులో అనువైన వాతావరణం ఏర్పడుతున్నదని తుగ్లక్ సంపాదకుడు ఎస్ గురుమూర్తి భావిస్తున్నారు. అందుకనే అన్నాడిఎంకె- బిజెపి కూటమిని తమిళ ప్రజలు ఆదరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, జయలలిత మరణం తర్వాత అన్నాడిఎంకె శ్రేణులు అందరినీ ఉమ్మడిగా తీసుకెళ్లగల నాయకత్వం ఆ పార్టీలో కనిపించడం లేదు. మరోవంక బిజెపిని 'తమిళ్ వ్యతిరేక' పార్టీగా ప్రజలు చుస్తున్నారని, అందుకనే ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని దెబ్బ తిన్నామని గతంలో ఆ పార్టీ నాయకులు బహిరంగంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవి వ్యవహారం సైతం బిజెపిని 'తమిళ వ్యతిరేక' పార్టీగా చూపే ప్రయత్నాలకు ఊతం కలిగిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులే ఆందోళన చెందుతున్నారు. అసెంబ్లీ రెండు సార్లు ఆమోదించిన బిల్లులను ఆమోదించకుండా పక్కన పడవేయడం ద్వారా సుప్రీం కోర్టు ద్వారా చివాట్లు తిన్న తర్వాత కూడా ఆయన వైఖరిలో మార్పు కనిపించడం లేదు. ఆ బిల్లుల్లో ఒక బిల్లు విశ్వవిద్యాలయాల వ్యవహారాలలో గవర్నర్ పాత్ర నామమాత్రమే అని స్పష్టం చేస్తుంది. ఏప్రిల్ 16న అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, రిజిస్ట్రార్‌లతో ముఖ్యమంత్రి స్టాలిన్ సమావేశం నిర్వహించారు. అయితే విశ్వవిద్యాలయాలపై ముఖ్యమంత్రి కన్నా తానే అధికుడని సంకేతం ఇచ్చేందుకు ఏప్రిల్ 25 నుండి మూడు రోజుల పాటు ఊటీలో అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల సమావేశం ఏర్పాటుచేసి, దానికి స్వయంగా ఉపరాష్ట్రపతి జగదేవ్ ధంకర్‌ను ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా ఈ విధంగా సమావేశం ఏర్పాటు చేయడం సుప్రీంకోర్టు తీర్పు ధిక్కారమే అంటూ కేవలం డిఎంకే కూటమిలోని పక్షాలే కాకుండా అన్నాడిఎంకె,- బిజెపి కూటమిలోని పక్షాలు సైతం ఆగ్రవేశాలు వ్యక్తం చేస్తున్నాయి. చివరకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు సైతం గవర్నర్ చర్యను సమర్థింపలేకపోతున్నారు. గవర్నర్ చర్యలు రాజకీయంగా డిఎంకె కూటమికి బలం చేకూరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకనే తక్షణమే గవర్నర్‌ను మార్చాలని చూస్తున్నట్లు తెలుస్తున్నది. మరోవంక, అన్నామలైని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకురావడం ద్వారా తమిళ రాజకీయాల్లో కీలక వ్యక్తిగా కొనసాగించాలంటూ అమిత్ షా చేస్తున్న ప్రయత్నాలు సైతం ఈ కూటమి సయోధ్యకు ప్రశ్నార్థకం చేస్తున్నాయి. పరస్పర వైరుధ్యాల మధ్య ఈ కూటమి వచ్చే ఏడాది ఎటువంటి ఫలితాలు సాధించగలదో చూడాల్సి ఉంది.

# దేశవిదేశాల్లో రాణించిన టంగుటూరి

భానుమతి వలెనే టంగుటూరి సూర్యకుమారి కూడా బహుముఖ ప్రజ్ఞావంతురాలు. ఆమె నాట్యకారిణి, నటి, గాయని మాత్రమే కాదు మంచి వక్తగా కూడా గుర్తింపు తెచ్చుకుంది, తెలుగు పాటని, తెలుగు భాషని, భారతీయ నృత్యాలను స్వదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ప్రాచుర్యం పొందడానికి ఆవిడ చేసిన కృషి అపూర్వం. అనన్య సామాన్యం. ప్రాచ్య, పాశ్చాత్య నృత్య, సంగీతాలకు మధ్య సుహృద్భావ సేతువుగా అంతర్జాతీయ కీర్తినందిన మధురగాయని ఆమె. టంగుటూరి సూర్యకుమారి (నవంబర్ 13, 1925 – ఏప్రిల్ 25, 2005) అలనాటి తెలుగు సినిమా నటి, ప్రసిద్ధ గాయకురాలు. ఆమె నవంబర్13,1925లో రాజమండ్రిలో జన్మించారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు తమ్ముడు టంగుటూరి శ్రీరాములు కూతురు. మూడో ఏటనుంచే పాటలుపాడేది. 1937లో మద్రాసు చేరుకుని, పన్నెండు, పదమూడేళ్ళ ప్రాయంలోనే సినీరంగ ప్రవేశము చేసి, 'రైతుబిడ్డ' సినిమాలో నటించింది. 1952లో ఆమె తొలి మద్రాసు అందాల సుందరి (మిస్ మద్రాసు)గా ఎంపికైంది. సూర్యకుమారి రూపం, కంఠస్వరం రెండూ బాగా ఉండడంచేత, అప్పటికే పెదనాన్న ప్రకాశం సభల్లో ప్రార్థన గీతాలు పాడుతూండడం చేత సినిమావారి పిలుపు వచ్చింది. సాంప్రదాయ నియమ, నిష్టలుగల కుటుంబం కావడం చేత కొంత వ్యతిరేకత ఎదురయ్యింది. సూర్యకుమారి కంఠం, రంగూ, రూపం ఆకర్షణీయంగా ఉన్నా, మామూలు అమ్మాయిల కంటే కొంచెం పొడవుగా ఉండటం చేత, సినిమా రంగంలో సమస్య ఎదురైంది. ఆనాటి సగటు హీరోలు ఆమె కంటే పొట్టిగా ఉండటం కారణం. అదీ కాక ఆమె బ్రాహ్మణ, పేరుపొందిన రాజకీయ కుటుంబం నుంచి రావటమే కాదు, ప్రేమ సన్నివేశాలలో హీరోయిన్ మీద హీరో చెయ్యి వెయ్యడం, ఇత్యాదివి ఒప్పుకొనేవారు కాదు. గొప్ప చాతుర్యం ఉండి కూడా ఆమె సినిమాల్లో సుస్థిరత పొందలేక పోయింది. అయినా సూర్యకుమారి సినిమాల్లోకి వచ్చి తెలుగు, తమిళ, కన్నడ, హిందీ నాలుగు భాషల్లోనూ మొత్తం ఇరవై ఆరు సినిమాల్లో నటించింది. విప్రనారాయణ' ఆమె తొలిచిత్రం. అదృష్టం, జయప్రద దేవత, చంద్రహాసన, దీనబంధు. భక్తపోతన, భాగ్యలక్ష్మి, కృష్ణప్రేమ, గీతాంజలి, అదృష్టదీపుడు, మరదలి పెళ్లి, భక్త రామదాసు తదితర తెలుగు చిత్రాల్లో ఉడన్', 'ఖటోలా' తదితర హిందీ చిత్రాల్లో, 'కటకం', 'నేంసారనౌక మొదలైన తమిళ చిత్రాల్లో నటించింది. అలాగే కన్నడ చిత్రం భారతి'లో, ఆంగ్ల చిత్రం 'బాంటే వయిటి లోనూ నటించింది. సూర్యకుమారి, లండన్లో నాట్య ప్రదర్శనలు నిర్వహిస్తూ, కాళికాదేవిగా నాటకాల్లో నటించేది. లలిత గీతాలు యాభై, దేశభక్తిగీతాలు యాభై మొత్తం నూరు గ్రామఫోను రికార్డులు ఇచ్చింది. అలాగే ఒక యాభై దాకా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల సినిమాల్లో తన గొంతుతో పాడిన పాటల రికార్డులు ఉన్నాయి. నటన కంటే



సూర్యకుమారి పాడిన దేశభక్తి గీతాలు, లలితగీతాలు, అష్టపదులు వంటివాటికి ఎక్కువ ప్రజాదరణ లభించడంచేత ఆమె పాట కచ్చేరీలు తరుచూ చేస్తూండేది. ఆంధ్రలోని చాలా ఊళ్ళలో లలిత సంగీత కచ్చేరీలు చేసింది. పేరు ప్రతిష్టలు, ప్రజాదరణ ఆమెకు తృప్తినివ్వలేదు. ఏదో ప్రత్యేక కృషి చెయ్యాలన్న తపన, మూడు నాలుగేళ్ళపాటు కరతాళ ధ్వనులకు, ప్రశంసలకు దూరంగా ఉండి, చదువుమీద దృష్టి కేంద్రీకరించి, ప్రైవేటుగా కేంబ్రిడ్జి సీనియర్ పరీక్ష వ్రాసి, ప్రథమశ్రేణిలో పాసైంది. పలు భాషా చిత్రాలలో నటించిన సూర్యకుమారి మంచి గాయకురాలు కూడా. స్వాతంత్ర్యోద్యమ సమయములో మా తెలుగు తల్లికి మల్లెపూదండ, దేశమును ప్రేమించుమన్నా మొదలైన అనేక దేశభక్తి గీతాలు పాడింది. ప్రకాశం పంతులు ఆమె కళాభిరుచిని బాగా ప్రోత్సహించి, శాస్త్రీయ సంగీతం నేర్పించాడు. ఆయన ఏ సభకు వెళ్ళినా ఆమెను తీసుకెళ్ళి జాతీయ గీతాలు పాడించేవాడు. 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రావతరణ సభలో నెహ్రూ, రాజాజీ, ప్రకాశం ప్రభృతుల సమక్షంలో , వందే మాతరం, మా తెలుగు తల్లికి మల్లె పూదండ పాటలు ఆలపించి అందర్నీ సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. వీటితో పాటు 'స్వప్నజగతిలో ఛాయావీణ' మొదలైన లలిత గీతాలు, అడవి బాపిరాజు 'ప్రభువుగారికీ దణ్ణం పెట్టూ', 'రావోయి చిన్నవాడా' మొదలైన జానపద గీతాలు కూడా పాడుతుండేది. హెచ్.ఎం.వి. తదితర గ్రామఫోన్ కంపెనీలు ఈమె పాటలను రికార్డు చేశాయి. ఆమె పాడిన పాటలు గ్రాంఫోన్ రికార్డులుగా వెలువడి విరివిగా అమ్ముడు పోయేవి. ప్రత్యేకంగా రాయించుకున్న పాటలు ఆమెతో పాడించి మరీ గ్రామఫోన్ రికార్డులుగా తీసుకురావడానికి అప్పటి గ్రాంఫోన్ కంపెనీ హెచ్.ఎం.వి. విశేష ఆసక్తి ప్రదర్శించేది, అలా ఆమె పాడిన పాటల్లో జాతీయ గీతాలు, భావగీతాలు, అష్టపదులు ఇలా చాలా రకాలు ఉన్నాయి. శంకరంబాడి సుందరాచారి రచించిన 'మా తెలుగుతల్లికి మల్లె పూదండ..' పాటని ఆమె పెదతండ్రి టంగుటూరి ప్రకాశం పంతులుతో వివిధ రాజకీయ సభల్లో పాడి ప్రాచుర్యం తెచ్చింది. ఆ సభల్లో వక్తగానూ ఆమెకు పేరుండేది. వెండి కంచాలలో వేడి బువ్వుందోయ్, పసిడి కంచాలలో పాల బువ్వుందోయ్, తిందాము రావోయ్ జాబిలి, ఆడుకుందాము రావోయ్ జాబిలీ' అంటూ నటిస్తూ పాడిన 'దేవత' చిత్రంలోని పాట, నారదుడుగా 'శ్రీకృష్ణ ప్రేమ'లో నటిస్తూ 'రేపే వస్తాడంట గోపాలుడు మాపే వస్తాడంట గోపాలుడు...' ఇలా చాలా పాటలు ప్రజాదరణ పొందాయి. 1958లో భారత చలనచిత్ర పరిశ్రమ ప్రతినిధుల బృందంలో ఒక ప్రతినిధిగా అమెరికాను సందర్శించి, తన ఉపన్యాసాలతో ఆకట్టుకుంది. అలా వారితో ఏర్పడిన సంబంధాలు 1959లో కొలంబియా యూనివర్సిటీ ట్యూటర్ గా వెళ్లి, పాశ్చాత్య సంగీతం, పాశ్చాత్య నృత్యాల్లో శిక్షణ పొంది వచ్చింది. సూర్యకుమారి ఆ రోజుల్లోనే హాలీవుడ్ కి వెళ్లి ప్రముఖ దర్శకుడు ఆల్ ఫ్రెడ్ హిచ్ కాక్ వద్ద పని చేసింది. ఇంగ్లండ్లో సిరపడి ప్రముఖ పెయింటర్ హెరాల్డ్ ఎల్విన్ ను వివాహం చేసుకుని ఇండియా పెర్ఫార్మింగ్ ఆర్ట్స్' అనే సంగీత నాట్య పాఠశాలను నిర్వహించింది. ఇందులో భారతీయ పాశ్చాత్య కళలను, కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, పరస్పర సదవగాహన పెంపొందించం ముఖ్య ఆశయం. 1968లో ఆమె కృషిని బ్రిటిషు రాణి గుర్తించింది. 1969లో గాంధీజీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తూ సెయింట్ పాల్ కెథెడ్రల్ లో గానం చేసిన ప్రథమ భారతీయ వనిత ఆమె. నార్వే, స్వీడన్, హాలెండ్, స్పెయిన్, కెనడా, అమెరికా మొదలైన పలు దేశాలలో భారతీయ సంగీత శిక్షణాలయాలు నెలకొల్పి, వందలాది కళాకారులను తయారు చేసింది. అమెరికాలో బ్రాడ్వే థియేటరులో విశ్వకవి రవీంద్రుని 'కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంబర్' నాటకంలో రాణి పాత్ర ధరించి, బ్రాడ్వే అవార్డు పొందిన మొదటి భారతీయ నటి. ఆ నాటకాన్ని న్యూయార్కులో ఎనిమిది నెలలపాటు ప్రదర్శించి, అటు తరువాత ఆఫ్రికాలో నాలుగు నెలలు పర్యటించింది. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసి 'ది కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంబర్' నాటకంలో నటించింది. ఆ నాటకానికి దేశ విదేశాలలో విశేష ఆదరణ లభించడమే కాకుండా విదేశీయుల అభిమానాన్ని కూడా చూర గొ నే అవకాశం కలిగింది. కొలంబియా యూనివర్సిటీలో, లండను యూనివర్సిటీ విద్యాసంస్థలలో, బ్లాక్ థియేటరులోను భారతీయ నృత్యకళ సంగీతంపై వర్క్ షాపులు నిర్వహించింది. 1975లో హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభ ఆమె సేవలను గుర్తించి సత్కరించింది. 1979లో రాజ్యలక్ష్మి అవార్డుతో ఆమెను గౌరవించింది. ఆమె ఏప్రిల్ 25, 2005 న లండనులో మరణించింది.

# రేడియో ఆవిష్కర్త మార్కోనీ

గుగ్లి ఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ (1874 ఏప్రిల్ 25 – 1937 జూలై 20) ఇటాలియన్ ఆవిష్కర్త, ఎలక్ట్రికల్ ఇంజనీర్. అతను సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపుటకు, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయుటలో పితామహుడుగా గుర్తింపు పొందాడు. అతను రేడియో యొక్క ఆవిష్కర్త. 1909 లో కార్ల్ ఫెడ్రినాండ్ బ్రాన్ తో కలసి వైర్?లెస్ టెలిగ్రాఫీ అనే అంశంపై భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి తీసుకున్నాడు. 1897 లో బ్రిటన్ లో వైర్?లెస్ టెలిగ్రాఫ్, సిగ్నల్ కంపెనీకి వ్యవస్థాపకునిగా ఉన్నాడు. అతను ఇతర భౌతిక శాస్త్రవేత్తల ప్రయోగాలను ఆధారంగా చేసుకొని రేడియో అనే కొత్త ఆవిష్కరణ చేసి వ్యాపార రంగంలో ఘనమైన విజయాన్ని సాధించాడు. రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ మార్కోనీ పరిశోధనలకు దోహద పడ్డాయి. మార్కోని 1874 ఏప్రిల్ 25 లో ఇటలీ దేశంలోని బొలొగ్నాలో అన్నీ జేమ్?సన్, గుసెప్ మార్కోనీ దంపతులకు జన్మించాడు. విద్యార్థి దశలో మార్కోనీ పరిశోధనల పట్ల మక్కువ చూపించేవాడు. తన తల్లిదండ్రులచే నియమించబడిన ప్రైవేట్ ఉపాధ్యాయుల నుండి ఇంట్లో రసాయనశాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రాలను నేర్చుకున్నాడు. లివోర్నోలోని ఉన్నత పాఠశాల భౌతిక ఉపాధ్యాయుడు ప్రొఫెసర్ విన్సెంజో రోసా 17 ఏళ్ల మార్కోనీకి భౌతిక దృగ్విషయాల ప్రాథమిక విషయాలను, అలాగే విద్యుత్తుపై కొత్త సిద్ధాంతాలను నేర్పించాడు. 18 యేళ్ళ వయస్సులో అతను తిగిరి బోలోగ్నాకు తిరిగి వచ్చాడు. 1890 ల ప్రారంభంలో, అతను "వైర్‌లెస్ టెలిగ్రాఫీ" అనే ఆలోచనపై పనిచేయడం ప్రారంభించాడు, అంటే ఎలక్ట్రిక్ టెలిగ్రాఫ్ ఉపయోగించిన వైర్లను కనెక్ట్ చేయకుండా టెలిగ్రాఫ్ సందేశాలను ప్రసారం చేయడం. బోలోనా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రీగ్ అధ్వర్యంలో ఇరవయ్యేళ్ళ యువకుడు మార్కోనీ కొన్ని నెలల పాటు కృషి చేశాడు. తల్లిదండ్రులతో బాటు నివసిస్తున్న తన ఇంటి పై అంతస్తు లోనే అతని ప్రయోగశాల ఉండేది. 1888 లో, విద్యుదయస్కాంత వికిరణాన్ని ఉత్పత్తి చేయగలవచ్చునని, గుర్తించగలమని నిరూపించాడు. ఒకరోజు అర్ధరాత్రి సమయంలో తల్లిని నిద్రలేపి ఓ తమాషా చూపిస్తానని పైకి తీసుకెళ్ళాడు. ఒకచోట మోర్స్ కీ 12 అడుగుల దూరంలో ఎలక్ట్రిక్ బెల్ ని అమర్చాడు. కీని నొక్కినప్పుడల్లా గంట



మోగడం ప్రారంభించింది. మధ్యలో తీగలు లేకపోయినా గంట మోగటం ఆశ్చర్య పరిచింది. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన ఈ ప్రయోగం గొప్ప చారిత్రాత్మక సంఘటన అని చాలాకాలం తరువాత మార్కోనీ తల్లి గ్రహించ గలిగింది. మార్కొనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. ఓ చిన్న గుట్ట ఆవలివైపు దాకా సంకేతాలు వెళ్ళగలిగాయి. సంకేతం ఆవలి వైపున చేరగానే దాన్ని గుర్తించానని తెలియ జేయడానికి గాను ఆయన తమ్ముడు గుట్టపై నిలబడి నాట్యం చేసేవాడు. క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరించేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యు డయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణిని ఓ పడవలో ఉంచుకొని బయలు దేరాడు. వార్తలను వైర్ లెస్ ద్వారా సముద్ర తీరానికి పంపితే, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే. వేల్స్ రాకుమారుడు ఒకసారి విహార నౌకలో వెడుతూ వైట్ దీవుల కావల జబ్బు పడ్డాడు. కుమారుని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసు కోవాలని విక్టోరియా రాణి సంకల్పించింది. వెంటనే మార్కోనీని అభ్యర్థించగా అతడు వైర్ లెస్ పరికరాలను నెలకొల్పి, 16 రోజుల పాటు నిర్విరామంగా వార్తలను చేరవేసే ఏర్పాటు చేశాడు. మొత్తం 150 టెలిగ్రాంలు అటూ, యిటూ ప్రసారం చేయబడ్డాయి. 1909 లో రెండు పడవలు సముద్ర మధ్యంలో ఢీ కొన్నాయి. వైర్ లెస్ ద్వారా తీరానికి సమాచారం వెంటనే అందించక పోయి ఉంటే 1700 మంది ప్రయాణీకులు మునిగిపోయే వారు. 1912 ఏప్రిల్ లో టైటానిక్ అనే ఓడ సముద్ర మద్యంలో ఓ మంచు కొండను ఢీకొంది. ఓడ మునిగి పోతుండగా అక్కడి ఆపరేటర్ వైర్ లెస్ ద్వారా %బూూ% సంకేతాలను అనేక సార్లు పంపించాడు. ఫలితంగా 700 మందిని రక్షించటానికి వీలైంది. 1907 లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన ఓడలు ప్రపంచ పర్యటన చేస్తున్న సందర్భంగా జాతీయ గీతం వాద్యాలాపనను ఒక ఓడ నుండి మరో ఓడకి ప్రసారం చేసుకో గలిగారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు. మార్కోనీ రేడియో ప్రసారానికి సంబంధించిన పరిశోధనల్ని అవిశ్రాంతంగా కొనసాగించాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలో కెల్లా తొలి ప్రసార కేంద్రం (%ఎతీశ్మీం ఖ్రఅస్త్ర ర్ఖ్ఆశీఆ%) పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభ మైనాయి. 1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు. 1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిస్టర్ 1948 లో తయారు చేసింది. బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్‌ల కార్యక్రమాలతో బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న ప్రారంభమైన బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభమైంది. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది.

## "టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్

# 2025" లో యస్వీయూకు ప్రతిష్టాత్మక స్థానం

ఏప్రిల్ 24,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 'ది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ - 2025' లో 600వ బ్యాండును చేరుకుని రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో తన ప్రతిభను మరోసారి చాటుకుంది. యస్వీయూ ఈ స్థానాన్ని చేరుకోవడం పట్ల ఉపకులపతి ఆచార్య చిప్పాడ అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. ఇది గర్వించదగిన ముఖ్యమైన మైలురాయి అని వారు అన్నారు. ఇది విశ్వవిద్యాలయం విద్యా నైపుణ్యం, అంతర్జాతీయ దృశ్యమానతను, నిబద్ధతను తెలియజేస్తుందని అన్నారు. ఉన్నత విద్య, వివిధ పరిశోధనల ఆవిష్కరణలలో విశ్వవిద్యాలయ చేసిన నిరంతర ప్రయత్నాలకు ఈ విజయం ప్రతిబింబమని అన్నారు. ఈ గౌరవాన్ని తెచ్చిపెట్టిన అధ్యాపక సభ్యులు, పరిశోధకులు, పరిపాలనా సిబ్బంది , విద్యార్థులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ సంస్థ ఆసియా అంతటా ఇంటెన్సివ్ విశ్వవిద్యాలయాలను పరిశోధించి , అత్యంత సమగ్రమైన అంచనాలతో ర్యాంకులు పరిగణిస్తుంది. 2025 ఎడిషన్‌లో, 35 దేశాలు, ప్రాంతాల నుండి 853 విశ్వవిద్యాలయాల్లో బోధన, పరిశోధన నాణ్యత, విజ్ఞాన పంపిణీ , అంతర్జాతీయ దృక్పథం వంటి కీలక సూచికల ఆధారంగా మూల్యాంకనం చేయబడ్డాయి. అందులో భాగంగా యస్వీయూ పనితీరును అంతర్జాతీయ ఔట్‌లుక్: 29.2, పరిశోధన నాణ్యత: 25.0, పరిశ్రమ నిశ్చితార్థం: 25.6, పరిశోధన వాతావరణం: 14.1, బోధన: 43.5 వంటి కొలమానాల ఆధారంగా అంచనా వేసి ఈ ప్రతిష్టాత్మక గుర్తింపును అందించింది. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ "ది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ - 2025" వేదిక అంతర్జాతీయ విద్యా వేదికపై యస్వీయూ ప్రతిభ పెరుగుతున్న తీరు ఈ ర్యాంక్ నొక్కి చెబుతుందని , ఇది గమ్యస్థానం కాదని, ప్రపంచవ్యాప్తంగా అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాన్ని ఉంచాలని కోరుకుంటున్నామని , అందులో భాగంగా ఇది ముఖ్యమైన ముందడుగు అని అన్నారు.



## ఎస్ఎస్‌యు క్యాంపస్‌లో రక్తదాన శిబిరం






ఏప్రిల్ 24, (ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, ఎన్ ఎస్ ఎస్ యూనిట్-%ఎ%, యూనిట్-%బి% సంయుక్త ఆధ్వర్యంలో రుయా ఆసుపత్రి సహకారంతో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఆవరణలో "రక్తదాన శిబిరాన్ని" నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథి ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణ మూర్తి, వైస్-ఛాన్సలర్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, గౌరవ అతిథుల సమక్షంలో-ఆచార్య రాధాగోవింద త్రిపాఠి, ఫైనాన్స్ ఆఫీసర్, ప్రొ.దక్షిణామూర్తి శర్మ, డీన్, స్టూడెంట్స్ వెల్ఫేర్, ఎం ఎస్ యు, ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్. కృష్ణ మూర్తి మాట్లాడుతూ రక్తదానం చేయడం మహోన్నతమైన కార్యమని, వివిధ వైద్య విధానాలకు రక్తమార్పిడి ఎంతో అవసరమన్నారు. ప్రొ.రాధాగోవింద త్రిపాఠి మాట్లాడుతూ రక్తదానం దాతలకు కొత్త రక్తకణాల ఉత్పత్తిని ప్రేరేపించడంతో పాటు మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడం వంటి ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది అని అన్నారు .ప్రొ.దక్షిణామూర్తి శర్మ రక్తదానం ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన దాతలు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. డా.బి.బాలదాత్రేయ, సీనియర్ మెడికల్ ఆఫీసర్, ఎన్ ఎస్ యు, తిరుపతి, దాతలకు సంక్షిప్త సూచనలను అందించారు మరియు రక్తదానం తర్వాత అనుసరించాల్సిన జాగ్రత్తలను హైలైట్ చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంలో భాగమైన ఇతర ప్రముఖులలో డాక్టర్ హరిత, మెడికల్ ఆఫీసర్, రుయా ఆసుపత్రి తిరుపతిటీ డా.ఎ.చందులాల్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు డా.పి.శ్వేత, సీనియర్ మెడికల్ ఆఫీసర్, ఎన్ ఎస్ యు, తిరుపతిటీ శ్రీ.కరణం సందీప్, రుయా హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుడుటీ డా.సి.చిరంజీవి, కన్సల్టెంట్, ఎన్ ఎస్ యు, తిరుపతిటీ .వి.సేతురామ్-ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డా.బుల్లి దాస్, అడిల్.కో-ఆర్డినేటర్. ఈ రక్తదాన శిబిరంలో మొత్తం 50 మంది దాతలు రక్తదానం చేశారు. దాతలందరికీ ఫలహారాలు, పండ్లతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా.ఎ.చందులాల్ 'వోట్ ఆఫ్ థాంక్స్'తో కార్యక్రమం ముగిసింది.

# న్యాయ శిబిరం నిర్వహించిన శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం విద్యార్థులు

ఏప్రిల్ 24,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి సమాజ అనుసంధానం న్యాయ అవగాహనను ప్రోత్సహించడంలో భాగంగా, ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ క్రింద న్యాయ విభాగంలోని న్యాయ సహాయ కేంద్ర ఆధ్వర్యంలో న్యాయ శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఆఫ్ లా ప్రొఫెసర్లు, విద్యార్థులతో కలిసి తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం పయిడిపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం గ్రామస్తుల న్యాయ సంబంధిత సమస్యలను పరిష్కరించడమే కాకుండా, వారికి న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగించడం ద్వారా సాధికారత కల్పించడం. ఈ శిబిరంలో విద్యార్థులు మరియు అధ్యాపకులు గ్రామస్తులతో ఇంటరాక్ట్ అయి, సైబర్ చట్టాలు, ఐటీ చట్టం, మోటారు వాహనాల చట్టం, మహిళలకి సంబంధించిన భారతీయ న్యాయ సంహితలోని నిబంధనలు వంటి అనేక న్యాయ అంశాలపై చర్చించారు. అలాగే, గ్రామస్థుల వ్యక్తిగత సందేహాలను పరిష్కరించి, వారు న్యాయ సంస్థలను ఎలా సంప్రదించాలి, లీగల్ ఎయిడ్ సేవలు ఎలా పొందాలి అనే విషయాల్లో మార్గనిర్దేశం అందించారు. సమాచారం గల పాంప్లెట్లు పంపిణీ చేయబడినవి, మరియు కొంతమంది విద్యార్థులు న్యాయ విషయాలను సులభంగా అర్థమయ్యేందుకు ప్రసంగాలు ఇచ్చారు. ఈ శిబిరంలో గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొని తమ కృతజ్ఞతను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులకి ఒక విలువైన అనుభవంగా నిలవడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో న్యాయ అవగాహన పెంపొందించడంలో కూడా మైలురాయిగా నిలిచింది. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు న్యాయ విద్య మరియు సామాజిక బాధ్యతల మధ్య ఉన్న ఖాళీని పూర్తి చేస్తున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహించడానికి విద్యార్థినులు మరియు న్యాయ విభాగం ఉత్సాహంగా ఉన్నట్లు తెలిపారు.




## జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఔషధి వనం




ఏప్రిల్ 24, (ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని హెల్త్ సెంటర్ ఆవరణలో ఎన్ ఎస్ యు వైస్-ఛాన్సలర్ కృష్ణ మూర్తి ఔషధ వనం (ఔషధ మొక్కల తోట) ప్రారంభించారు. తోటలో దాదాపు 70 ఔషధ మొక్కలు నాటబడ్డాయి. ప్రొ.జి.ఎస్.ఆర్. మెడిసినల్ గార్డెన్‌ను అభివృద్ధి చేసినందుకు ఆయుర్వేద కన్సల్టెంట్ సీనియర్ మెడికల్ ఆఫీసర్లు డా.సి.చిరంజీవి- డా.బి.బాలదాత్రేయ %డా% డా.పి.శ్వేత ,హెల్త్ సెంటర్ బృందాన్ని అభినందించారు. వివిధ రకాల ఔషధ మొక్కలతో గార్డెన్‌ను మరింత విస్తరింపజేస్తామని అన్నారు.

# జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం.








పాతపట్నం ఏప్రిల్ 24, ప్రజా జ్యోతి న్యూస్.. దేశాభివృద్ధిలో గ్రామ పంచాయతీల పాత్ర ముఖ్యమైనదని మండల పరిషత్ అధ్యక్షురాలు శ్రీమతి దొర సావిత్రమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షురాలు మాట్లాడుతూ పల్లెలే ప్రగతికి పట్టుకొమ్మలని ,వాటిని అభివృద్ధి చేయడం వల్లే దేశ అభివృద్ధి సాధ్య పడుతుందని పిలుపునిచ్చారు. మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ మండలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయతీలను ఎంపిక చేసి వాటిని గౌరవించాలని సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారిని మాట్లాడుతూ పల్లెల్లో పారిశుద్ధ్యం, నీటి సౌకర్యం బాగుంటే ఆ గ్రామాలు అభివృద్ధి బాటలో ఉంటాయని చెప్పారు .విశ్రాంతి ఎంపీడీవో చిరంజీవి మాట్లాడుతూ పంచాయతీ రాజ్ పుట్టుక గురించి , విధుల గురించి వివరంగా వివరించారు .ఈ సందర్భంగా పలువురు సర్పంచులు ,ఎంపీటీసీలు తమ అభిప్రాయాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయతీల సర్పంచులను ,ఎంపీటీసీలను విశ్రాంత ఎంపీడీవో చిరంజీవి, ఎంపీడీవో సిబ్బంది అరుణ్ ను ఘనంగా సత్కరించారు .కార్యక్రమంలో ఎంపీపీ తో పాటు మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మంచు కరుణాకర్ రావు, ఎంపీడీవో చంద్రకుమారి ,ఏవో తిరుపతి పట్నాయక్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట్రావు, విశ్రాంత ఎంపీడీవో చిరంజీవి, మండలంలో ఉన్న అందరూ సర్పంచులు, ఎంపీటీసీలు, మండల పరిషత్ సిబ్బంది మిత్రో ,అరుణ్ సచివాలయ సెక్రటరీలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## సత్యనారాయణ కుటుంబానికి నష్టపరిహారం అందించాలి.

పోడూరు /ఆచంట.ఏప్రిల్ 24,ప్రజాజ్యోతి న్యూస్. ఆచంట మండలం కరుగోరుమిల్లి పంచాయతీ పరిధి ముత్యాల వారి పాలెం గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలి ముత్యాల సత్యనారాయణ కుటుంబానికి రు 2 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సిర్రా నరసింహమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వశిష్ట గోదావరిలో ప్రమాదవశాత్తు ఉపాధి హామీ కూలీ మృతి చెందడం బాధాకరమన్నారు. ఆ పేద కుటుంబానికి పెద్దదిక్కు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆ కుటుంబము రోడ్డున పడ్డారన్నారు. భార్య ఆరుగురు కుమార్తెలు ఒక కుమారుడితో కుటుంబ పోషణ భారంగా మారి ఉపాధి పనికి వెళ్తే చివరికి విధి వక్రించి పెద్దదిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడ్డారన్నారు. మంగళవారం ఉదయం ఉపాధి హామీ పని నిమిత్తం కోడేరు లంక గ్రామానికి వెళ్లి పని ముగించుకుని మార్గ మధ్యలో స్నానం చేసేందుకు వశిష్ట గోదావరి లో గల్లంతయి మృతి చెందిన సంఘటన విధేయతమే. సందర్భంగా అధికారులు తక్షణమే స్పందించి బాధిత కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.




## "కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం"

## శిక్షణ తో మీ కుటుంబ ఆదాయాన్ని పెంచుకోండి:

సారవకోట మండల టిడిపి అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ..

సారవకోట ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి న్యూస్ సారవకోట మండలం ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం(ట్రైలరింగ్) బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ వారి సహకారంతో గొర్లిబంధ గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమం ముఖ్య అతిదులుగా సారవకోట ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు మండల టీడీపీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ పాల్గొని రిబ్బన్ కట్ చేసి తదుపరి ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కోఆర్డినేటర్ మెట్ట చంద్రశేఖర రావు, ఎంపీడీవో బి వి మోహన్ కుమార్, సారవకోట మండల టిడిపి అధ్యక్షులు వెంకటరమణ మరియు ఎంపీపీ చిన్నాలు కూర్మ నాయుడు లు మాట్లాడుతూ మహిళా లందరు ఉచిత కుట్టు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని అందరూ స్వయం శక్తి కోసం తనవంతు కృషి చేయాలని మాట్లాడారు. అనంతరం ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ పీవివి మోహన్ కుమార్,ఏ.ఓ చిన్నామ్మడు,వాండ్రాయి,సర్పంచ్ పోలాకి చిన్నబాబు,కొమ్మసారియా పల్లి సర్పంచ్ గోంటి లక్ష్మణ్, లంబ సర్పంచ్ షణ్ముఖ రావు,నిక్కు జనార్ధన్, టీడీపీ నాయకులు సోమలాపురి మురళీధర్,ఇట్రాజుల వెంకటరమణ మరియు ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# పంచాయితీల పరిపుష్టికి కూటమి ప్రభుత్వం జీవనాడి

## సారవకోట మండల టీడీపి అధ్యక్షులు కత్తి'రి వెంకటరమణ..






**సారవకోట ఏప్రిల్ 24, ప్రజా జ్యోతి న్యూస్** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ముందుగా సారవకోట మండలంలో పంచాయతీ, మండల పాలక వర్గ సభ్యులకు సారవకోట మండల టీడీపి అధ్యక్షులు కత్తి'రి వెంకటరమణ పంచాయతీరాజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలగన్న గ్రామ స్వరాజ్యం ఏర్పాట్లు ప్రజలు ప్రభుత్వాలు భాగస్వాములుగా కొనసాగాలని, మౌలిక వసతులు కల్పన, మెరుగైన పారిశుద్ధ్యము, శుద్ధ త్రాగునీరు అందించడము, పంచాయితీ పాలకవర్గాలకు సాధ్యమవుతాయని సర్పంచులకు ప్రభుత్వాలు సంపూర్ణ అధికారాలు కట్టబెట్టాలని, గ్రామపంచాయతీలు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పంచవర్ష ప్రణాళికలు రూపొందించుకొని, తన గ్రామ అభివృద్ధి లక్ష్యంగా సర్పంచులు ప్రభుత్వాల సహకారంతో ప్రజలందరికీ సేవా దృక్పథంతో పాలన సాగించాలని, పంచాయితీల పాలనలో మాజీ సైనికులు, సీనియర్ సిటిజన్స్, ఇతర ప్రాంతాలలో ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా పలుకుబడి కలిగిన గ్రామ పౌరుల భాగస్వామ్యంతో, వారి సహకారంతో పంచాయితీలు అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. కేరళ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను బలిష్టంగా అమలు చేస్తుందని, ఆంధ్రప్రదేశ్లో కూడా గ్రామపంచాయతీలను స్వయం పోషక విభాగాలుగా తీర్చిదిద్దాలని, 16వ ఆర్థిక సంఘం నిధులను గ్రామపం చాయతీల పరిపుష్టికి సంపూర్ణంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వాలు చేయూతనివ్వాలని సూచించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వాలు పంచాయతీలకు పెద్ద మొత్తాలలో నిధులు మంజూరు చేసి అభివృద్ధికి తోడ్పాటు కూటమి ప్రభుత్వం అందించాలని అందిస్తుందని, ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలోని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి అయిన పవన్ కళ్యాణ్ పంచాయతీ అభివృద్ధిపై తమదైన శైలిలో ముందుకు సాగుతున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి విజన్ రూపొందించి అమలు చేసేందుకు కృతనిచ్చేయంతో ఉన్నారని. గ్రామీణ పరిపాలనలో అవినీతి లేని అభివృద్ధి తో కూడిన వ్యవస్థ రూపకల్పనకు ప్రభుత్వాలు కృషి చేయాలని కత్తి'రి అన్నారు. గ్రామీణ పంచాయతీ రాజ్ వ్యవస్థ రూపకల్పన ముఖ్య ఉద్దేశమైన గ్రామ స్వరాజ్య పరిపుష్టికి ప్రజల భాగస్వామ్యం అత్యవసరమని, సామాజిక స్పృహతో సేవా దృక్పథంతో ముందుకు వచ్చేవారిని పంచాయితీ పాలనలో భాగస్వామ్యులు చేసి వారు సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వాలు గ్రామపంచాయతీల పరిపుష్టికి జీవనాడిగా వ్యవహరించాల న్నారు. సర్పంచులకు, ఎంపీపీ, స్టాఫ్, ఎంపీటీసీ లకు సన్మానం చేయటం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ పీవివి మోహన్ కుమార్, ఏఓ రమణమ్మ, స్టాఫ్, సర్పంచులు, ఎంపీటీసీ లు మరియు టీడీపి నాయకులు నిక్కు జనార్దరావు, సోమలాపురి మురళిధర్ రావు, ఇట్రారాజుల వెంకటరమణమూర్తి తదితరులు పాల్గున్నారు.

# వైఎస్ జగన్ ను కలిసిన తిరుపతి రూరల్ ఎంపీటీసీలు

## ఇటీవల జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో విజయంపై అభినందనలు

## మోహిత్ రెడ్డికి వెన్నుదన్నుగా నిలబడాలని సూచించిన జగన్



**ఏప్రిల్ 24,(ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తిరుపతి రూరల్ మండలంకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్ లతో పాటు పలువురు పార్టీ ముఖ్య నాయకులు గురువారం కలిశారు. ఇటీవల జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి నిజాయతీగా నిలబడి మద్దతు తెలిపిన ప్రతి ఒక్క ఎంపీటీసీని జగన్ అభినందించారు. అంతకు ముందు ఎంపీటీసీలను స్థానిక కూటమి పార్టీల నేతలు ఎలా ప్రలోభపెట్టారు అన్న విషయాలను చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జగనన్నకు వివరించారు. అనంతరం జగన్ ప్రతి ఒక్క ఎంపీటీసీ త్యాగాన్ని గుర్తు చేసుకుని అధికార పార్టీ నేతలు ఎన్నిరకాలుగా ప్రలోభాలకు గురిచేసినా పార్టీ కోసం గట్టిగా నిలబడి పార్టీ అభ్యర్థికి మద్దతు తెలపడం శుభ పరిణామన్నారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నాయకత్వంలో చంద్రగిరిని మళ్లీ వైఎస్ఆర్ సీపీ ఖాతాలోకి తీసుకురావాలని, అప్పటి వరకు వీరోచితంగా పోరాడాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి గ్రామ స్థాయిలో ప్రజలకు తెలియపరచాలన్నారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడుగా మీ అందరికీ సుపరిచితుడుగా కష్టపడటానికి సిద్ధంగా వున్నాడని, అతనికి అండగా నిలబడాలన్నారు. అనంతరం పలువురు ఎంపీటీసీలు జగనన్న వద్దకు వెళ్లి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తమకు అన్ని విధాలుగా అండగా నిలబడ్డాడని, ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటారని ఆయన నాయకత్వంలో పార్టీ బలోపేతానికి పనిచేస్తామన్నారు. అనంతరం సర్పంచ్ లు, పార్టీ నేతలతో కూడా జగన్ ఆత్మీయంగా మాట్లాడుతూ చెవిరెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న మీరంతా పోరాటయోధులన్న విషయం తమకు తెలుసునని చెబుతూ అందరినీ అభినందించారు. చివరగా తిరుపతి రూరల్ ఎంపీపీగా గెలిచిన మూలం చంద్రమోహన్ రెడ్డిని అభినందించారు.

# పారదర్శక పాలనకు నిదర్శనం కూటమి ప్రభుత్వం





**కూటమి హయంలో విస్తృతంగా సచివాలయం సేవలు**

**రూ. 40 లక్షల నిధులతో నూతన సచివాలయం ప్రారంభం**

**స్వచ్ఛతే లక్ష్యంగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు**


**ఎమ్మెల్యే కూన రవికుమార్**

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పారదర్శక పాలనకు నిదర్శనం కూటమి ప్రభుత్వమని , అధికారం చేపట్టిన అతి కొద్ది నెలల్లోనే అటు సంక్షేమం ,ఇటు అభివృద్ధి పై దృష్టి సారిస్తూ పాలన అందిస్తున్న నాయకుడు చంద్రబాబు అని ఆమదాలవలస ఎమ్మెల్యే , రాష్ట్ర పి. యూ.సి చైర్మెన్ కూన రవికుమార్ అన్నారు. పొందూరు మండల కేంద్రంలో ఎన్.ఆర్.జి.ఈ.ఎస్ నిధులతో రూ. 40 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయం నూతన భవనాన్ని ,చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సచివాలయాలు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండేలా సచివాలయాల సేవలను కూటమి ప్రభుత్వం మరింత విస్తృతం చేస్తుందన్నారు.. గ్రామాల పరిశుభ్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గత వైకాపా ప్రభుత్వం హయంలో నిర్లక్ష్యానికి గురైన చెత్త సంపద నిది కేంద్రాలను ఎన్డీయే ప్రభుత్వం విస్తృతంగా వినియోగంలోకి తీసుకువస్తుందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీ ఒక్క గ్రామంలో పారిశుద్ధ్యం మునుపటి కంటే మెరుగుపడిందని తెలిపారు. నిర్లక్ష్యం కి గురైన చెత్త సంపద నిది కేంద్రాలను వెలుగులోకి తీసుకురావడం ద్వారా సంపద సృష్టించవచ్చునన్నారు. చెత్త సంపద కేంద్రాల వల్ల గ్రామంలో చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవచ్చున్నానారు. తడి చెత్త ,పొడి చెత్త వేరు చేయడం వలన, సేంద్రీయ ఎరువులు తయారు చేయడం జరుగుతుందన్నారు.పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా స్వచ్ఛ ఆంధ్ర , స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం విస్తృతంగా అమలులోకి తీసుకువచ్చింది అని తెలిపారు. ఈ మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ , మేజర్



పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మీ , ఎంపీపీ కిల్లి ఉషారాణి ,పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చిన రంగ , ఎ.ఎం.సి మాజీ ఛైర్మెన్ అన్నెపు రాము , మండల మహిళా అధ్యక్షురాలు,మాజీ సర్పంచ్ అనకాపల్లి విజయలక్ష్మీ ,అనకాపల్లి శ్రీనివాస రావు,జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు, జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు,మాజీ సర్పంచ్ కోరుకొండ జయలక్ష్మీ , ఎంపీటీసీ కోరుకొండ సాయికుమార్, ఈ. ఓ మోహన్ బాబు , ఎంపిడిఓ మన్మథ రావు , ఎమ్మార్వో వెంకటేష్ రామానుజుల ,ఆర్. డబ ల్యు.ఎస్ జే.ఈ ఎం.వి కె నాయుడు , ఏ.పి. ఓ పైల శ్రీనివాస రావు , పి.ఆర్. ఐ డి.ఈ.ఈ జె చంద్ర శేఖర్ , పొందూరు పి.ఆర్. ఐ ఎ.ఈ అనంత్ , పొందూరు ఏ.ఈ సత్యన్నారాయణ ,పి.ఆఫ్. ఐ డి.ఈ.ఈ పొందూరు సామ్యూల్ రాజు ,కూటమి నాయకులు , కార్యకర్తలు,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# సీనియర్ క్రికెట్ ప్లేయర్ చీర్ల కిరణ్ చే టీటీడీ ఉద్యోగుల పిల్లలకు క్రికెట్ ఉచిత శిక్షణ




**ఏప్రిల్ 24,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** వేసవి సెలవులలో టీటీడీ ఉద్యోగుల పిల్లలకు , టీటీడీ విద్యాసంస్థ లలో చదువుకుంటున్న పిల్లలకు 27.04.2025 వ తేది (ఆదివారం) నుండి 01.06.2025 వ తేది వరకు ఎస్వీ హై స్కూల్ క్రికెట్ గ్రౌండ్ నందు ప్రతి రోజు సాయంత్రం 6:00 గంటల నుండి 8:30 గంటల వరకు పిల్లలను క్రీడలలో ప్రోత్సహించడానికి క్రికెట్ లో ఎంతో అనుభవం ఉన్న సీనియర్ క్రికెట్ ప్లేయర్స్ భారత జట్టు ఆంధ్ర రంజీ జట్టులో ఆడుతున్న క్రికెట్ ప్లేయర్స్ తో కలిసి ఆడిన అనుభవం ఉన్న చీర్ల కిరణ్, మస్తాన్, సూర్య చే ఉచితంగా క్రికెట్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చీర్ల కిరణ్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసారు. ఆసక్తి గల టీటీడీ ఉద్యోగులు వారి పిల్లల పేర్లు , టీటీడీ విద్యాసంస్థ లలో చదువుతున్న పిల్లల పేర్లు ఈ కింది నంబర్ లకు ఫోన్ ద్వారా కాని, వాట్సాప్ ద్వారా కాని నమోదు చేసుకోవాలని కోరారు.

సంప్రదించవలసిన కోచ్ ల నెంబర్ :

1. చీర్ల కిరణ్ - 9989033100
2. మస్తాన్ - 96 52 988727
3. సూర్య - 738-205-9520

# అప్రమత్తమైన తిరుమల విజిలెన్స్ శాఖ





**ఏప్రిల్ 24,(ప్రజా జ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో టిటిడి విజిలెన్స్ శాఖ సెక్యూరిటీనీ కట్టుదిట్టం చేసింది. ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఇన్చార్జి సి వి ఎస్ ఓ హర్షవర్ధన్ రాజు సూచనల మేరకు వీజీవో సురేంద్ర నేతృత్వంలో సెక్టర్ 3 ఇన్చార్జి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ సైలేంద్రబాబు ఆధ్వర్యంలో తిరుమల ఘాట్ రోడ్డులోని లింక్ రోడ్డు సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు.అనుమానం వచ్చిన వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

# పహల్గాంలో ఉగ్రదాడి ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది...

**మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా**

**చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**



**ఏప్రిల్ 24,(ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో టూరిస్టుల పై జరిగిన ఉగ్రదాడి ఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు. జమ్మూకాశ్మీర్ పహల్గామ్ ప్రాంతంలో ఉన్న పర్యాటకులపై ఉగ్రమూకలు దాడి చేసిన ఘటన కాశ్మీర్ నే గాక దేశాన్నే కుదిపేయడం పై గురువారం ఓ ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పహల్గాంలో టూరిస్టుల పై జరిగిన ఉగ్రదాడి పిరికిపందల చర్య ఆయన ఖండించారు. ఈ దాడిలో 26 మంది చనిపోవడం, మరికొంత మంది గాయపడటం తనను బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకున్నట్లు తెలియజేశారు. ఈ దాడిలో మరణించిన వాళ్లలో ముగ్గురు తెలుగు వాళ్లు ఉండటం అత్యంత బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలబడం అభినందనీయమన్నారు. అలాగే ఉగ్రవాదం పై పోరుకు యావత్ దేశం కలిసి కట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా జిల్లా గ్రామ పంచాయతీ అధికారికి అవార్డు




**ఏప్రిల్ 24,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతి జిల్లాలోని 774 గ్రామ పంచాయతీలలో 2024-2025 ఆర్థిక సంవత్సరముకు గాను ఇంటి పన్నులు మరియు పన్నేతరములు వసూళ్ళకు సంబంధించి మొత్తము డిమాండు రూ.53.01 కోట్లుకు ఉండగా, అందులో రూ.44.21 కోట్లు అనగా 83 శాతము వసూళ్ళు కాబడి రాష్ట్రములోనే మూడవ స్థానములో అత్యధిక వసూళ్ళు సాధించినందునకు గాను జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, తిరుపతి జిల్లా సుశీల దేవికి జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవము( ఏప్రిల్ 24,2025)న పురస్కరించుకోని మంగళగిరిలో జరిగిన కార్యక్రమములో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదగా అవార్డు అందుకున్నారు.

# రాష్ట్రంలో విచ్చలవిడిగా జరుగుతున్న లిక్కర్ అక్రమాలు

## వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి.

**పాతపట్నం ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి న్యూస్..** కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగంలో ఉన్న దుకాణాలను మూసేసి, ప్రయివేటు వారికి కట్టబెట్టి, రాష్ట్రంలో విచ్చలవిడిగా జరుగుతున్న లిక్కర్ అక్రమాలు జరుగుతున్నాయని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. వాటిని కప్పి పుచ్చుకోవడానికి తెలుగుదేశం పార్టీ, కూటమిలోని నాయకుల చేతిలో లిక్కర్ మాఫియా చేస్తున్న భారీ అవినీతిని దాచిపెట్టడానికి, వైయస్సార్సీపీపై బురదజల్లి, దీనిపై పెద్ద ఎత్తున విషప్రచారం చేస్తోంది, తప్పుడు కేసులు పెట్టి, ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రయత్నాలు చేస్తునే ఉన్నారు, మరోవైపు దోచుకుంటున్నారు.మద్యం దుకాణాలు కూడా సుమారు కూటమి నాయకులకు, వారికి సంబంధించిన మనుషులకే వచ్చేలా వ్యవహారాన్ని నడిపారు. ఎవరూ అప్లికేషన్లుకూడా పెట్టుకోనీయకుండా బెదిరింపులకు దిగారు. ప్రయివేటు దుకాణాలనుంచి 30శాతం కమీషన్లు తీసుకుంటూ ఇవ్వని వారిపై ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు దాడులు చేయడం రాష్ట్రం అంతా చూస్తుంది. మద్యం దుకాణాలన్నింటినీ టీడీపీ నాయకుల ఆధీనంలో ఉన్న మాఫియా చేతిలో తీసుకొచ్చారు. ఏ బ్రాండు అమ్మాలి. ఎంతకు అమ్మాలి.. నిర్ణయాలన్నీ లిక్కర్ మాఫియా చేతిలోనే. ప్రతి క్వార్టర్ బాటిల్పైన సుమారు రూ.20లకు అమ్ముతున్నారు. ముందస్తు వ్యూహంతో తమకు నచ్చిన ప్రయివేటు కంపెనీతో చంద్రబాబుగారు ఒక టుకడా సర్వే చేయించి, ఆ సర్వే ఆధారంగా వారికి కావాల్సిన బ్రాండ్లు మాత్రమే అమ్మేలా చేస్తున్నారు.ఈ బ్రాండ్లకు సంబంధించిన ఆర్డర్లను తమకు నచ్చిన డిస్టలరీలకు అమ్ముతున్నారు.క్వాలిటీ దారుణంగా తగ్గించిన మద్యాన్ని రూ.99లకు అమ్ముతూ, దాని



తయారీ కూడా తమకు నచ్చిన డిస్టరీలకు ఇస్తూ, భారీ ఎత్తున దోపిడీకి పాల్పడుతూ, మరోవైపు ప్రజల ఆరోగ్యాన్ని దారుణంగా దెబ్బతీస్తున్నారు వీలైనంత మేర లిక్కర్ అమ్మకాలు పెంచడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. వీలైనంత మేర అవినీతి సొమ్మును దండుకోవడానికి అనధికారికంగా 20 నుంచి 30శాతం మేర లిక్కర్ అమ్మాలని టార్గెట్లు పెట్టారు. పర్మిట్ రూమ్స్ ఏర్పాటు చేసి వాటి నుంచి డబ్బులు వసూలుచేసుకుని భారీ ఆర్జిస్తున్నారు వీధివీధికీ బెల్టుషాపులు ఏర్పాటుచేశారు. ఆ బెల్టుషాపులకు కూడా వేలంపాటలు పెట్టి డబ్బు వసూలు చేస్తున్నారు. వేల కోట్ల రూపాయలమేర ప్రభుత్వ ఖజానాకు నష్టంచేస్తూ, ఆ డబ్బును దోచుకుంటున్న టీడీపీ, కూటమి నాయకుల చేతిలో ఈలిక్కర్ మాఫియా రాష్ట్రంలో నిర్విఘ్నంగా కొనసాగుతోంది.చంద్రబాబు ఒకవైపు ఈ మాఫియాను నడిపిస్తూ, ప్రతి నెల వందలకోట్ల రూపాయలు తనకు, తన పార్టీ నాయకులకు దోచిపెడుతూ, ఆ అవినీతి ప్రజల దృష్టికి వెళ్లనీయకుండా, వైయస్సార్సీపీ హయాంలో అత్యంత పారదర్శకంగా తీసుకొచ్చిన లిక్కర్ విదానంపై తప్పుడు కేసులు పెడుతూ, ఆ నీడలో ఈ మాఫియాను నడిపిస్తున్నాడు.వైఎస్సార్సీపీ హయాంలో.. 2019-24 మధ్య ఐదేళ్లలో కొత్తగా ఒక్క డిస్టిలరీకి కూడా అనుమతి ఇవ్వలేదు. మద్యం విధానంలో అక్రమ దందా సాగించే సిండికేట్ వ్యవస్థను పూర్తిగా ఎత్తివేసింది. లిక్కర్ షాపుల నుంచి పూర్తిగా ప్రైవేటు వ్యక్తులను తొలగించింది. ప్రభుత్వ ఆధీనంలోనే అమ్మకాలు సాగించింది. 33 శాతం మద్యం దుకాణాలను తీసివేసింది. షాపుల సంఖ్యను 4,380 నుంచి 2,934కు తగ్గించింది. మద్యం దుకాణాలకు అనుబంధంగా ఉన్న 43 వేల బెల్టు షాపులను, 4,380 పర్మిట్ రూమ్లను రద్దు చేసింది. మద్యం ధరలను షాక్ కొట్టేలా పెంచింది. ఎక్సైజ్కు సంబంధించిన నేరాలకు పాల్పడితే శిక్షలను కఠినం చేసింది. మద్యం విక్రయాల వేళలను కుదించింది. ప్రతి ఊరికి ఒక మహిళా పోలీసును నియమించింది. దీంతో మద్యం అమ్మకాలు బాగా తగ్గాయి.ఇంత పారదర్శక వ్యవస్థపై చంద్రబాబు తప్పుడు కేసులు పెడుతున్నాడు. ఆ కేసుల్లో చంద్రబాబు భేతాళ కుట్ర బట్టబయలైంది. టీడీపీ వీరవిధేయ పోలీసు అధికారులతో కూడిన సిట్ నివేదిక సాక్షిగా రెడ్బుక్ కుతంత్రం బెడిసికొట్టిందని తెలియజేశారు.

# భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

**ఏప్రిల్ 24,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి**
భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు అల్లయ్య అధ్యక్షతన తిరుపతి జిల్లా కలెక్టర్ ఆఫీస్ నందు ధర్నా నిర్వహించారు. ఇందులో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం, ఈ ధర్నా ను ఉద్దేశించి మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం చలివేంద్రాలు పేరట 350 కోట్లను అదేవిధంగా ఇన్సూరెన్స్ పేరుతో 100 కోట్లను ఖర్చు చేసింది. అనంతరం వైసిపి ప్రభుత్వం కూడా 800 కోట్లను దారి మళ్ళించి భవన నిర్మాణ కార్మికుల సొమ్మును దుర్వినియోగం చేసింది. సంక్షేమ బోర్డు లోని సొమ్ము కార్మికులకే చెందాలని ఉన్న సుప్రీంకోర్టు తీర్పులను అమలు చేయకుండా ప్రభుత్వాలు మొండిగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో 1214 జీవోను తీసుకొచ్చి కనీసం క్లైములు కూడా అమలు చేయకుండా నిలిపివేయడం దుర్మార్గం అని వెల్లడించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులను ఏకం చేసి పోరాటాలకు సిద్ధం చేస్తావని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మికుల జిల్లా అధ్యక్షులు అల్లయ్య మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా సంక్షేమ బోర్డులో ఉన్న క్లైములను తక్షణమే విడుదల చేయాలని అర్హులైన వారందరికీ సంక్షేమ బోర్డు ద్వారా గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఎండి శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు భాగంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేనిపక్షంలో గత



ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ సభ్యులు పుట్టా శంకరయ్య, రఫీ, వేణు, తిరుమల్ రెడ్డి, నరసింహులు, రాజా, శ్రీరాములు, దాసు, మరియు రేణిగుంట సిఐటియు నాయకులు మునిరాజా, హరి, శివానందం, ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన మౌన నిరసన

**ఏప్రిల్ 24,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** జమ్మూకాశ్మీర్ లోని పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి జనసేన ఘనంగా నివాళులు అర్పించింది. గురువారం సాయంత్రం ఎన్జీఓ కాలనీలోని జనసేన పార్టీ కార్యాలయ ఆవరణలో పార్టీ నాయకులు మౌన నిరసన నిర్వహించారు. జనసేన పార్టీ మృతులకు నివాళిగా మూడు రోజుల పాటు సంతాప దినాలు ప్రకటించింది. బుధవారం పార్టీ జెండాలను అవనతం చేయడంతో పాటు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించింది. రెండోరోజైన గురువారం జనసేన నాయకులు మౌన నిరసన వ్యక్తం చేశారు. అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపి హత్య చేయడం హేయమైన చర్య అని జనసేన నాయకులు విమర్శించారు. శుక్రవారం సాయంత్రం జనసేన పార్టీ ఆధ్వర్యంలో మానహారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులతోపాటు ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్పోరేటర్లు ఎస్ కే బాబు, నరసింహాచ్చారి, నరేంద్ర, నాయకులు దూది శివ, తిరుత్తుణి వేణుగోపాల్, కీర్తన, సుభాషిణి, ఆకుల వనజ, బాబ్జి, హరిశంకర్, మునస్వామి, ఆర్కాట్ క్రిష్ణప్రసాద్, మనోజ్, బాలిశెట్టి కిషోర్, బండ్ల లక్ష్మీపతి, పోటుకూరు ఆనంద్, సునీల్ చక్రవర్తి, గుట్టా



నాగరాజు రాయల్, మల్లిశెట్టి లక్ష్మీ, మధులత, రాధా, కోకిల, ఆముదాల వెంకటేష్, రుద్రకిషోర్, వినోద్ రాయల్ తదితరులు.

# చర్యకు ప్రతి చర్య తీసుకుంటాం..

## శ్రీకాకుళం బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు ...

**శ్రీకాకుళం ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి న్యూస్..** జమ్మూ కాశ్మీర్ లో పర్యాటకుల పై ఉగ్రవాదులు జరిపిన దాడులు పిరికి పంద చర్యగా దేశావ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి.ఈ దాడిలో ఆంధ్రప్రదేశ్ కు చెందినఇద్దరు పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం హృదయావిధారకమని బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు వ్యాఖ్యనించారు.ఈ దాడిని నిరసిస్తూ శ్రీకాకుళం జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గాలలో ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. హొం మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో ఇప్పటికే 35 విమానాలను ఏర్పాటు చేసి 4500 మందిని ఇప్పటికే వారి స్వస్థలాలకు తరిలించాము అని అన్నారు.మృతదేహాలను కూడా కుటుంబాలకు చేరుస్తున్నాము అని అన్నారు.ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను ఎక్కడ వున్నా వదిలే ప్రసక్తి లేదని ,.దేశం మొత్తం బాధిత కుటుంబాల వెంట ఉంది అని న్యాయం జరిగేలా మా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అని అన్నారు..



## దతరగతి ఫలితాలలో 600 కి 576 మార్కులు సంపాదించిన సత్య రేవతి

**కాకినాడ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 24 ( ప్రజా జ్యోతి )** ఎ యు కొత్తపల్లి మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన అమజాలపు తాతాజీ. అమజాలపు దుర్గ భవాని. కుమార్తె. అమజాలపు సత్య రేవతి. కోనపై పేట. జడ్పీహెచ్ హైస్కూల్లో 23 బుధవారం పదవ తరగతి ఫలితాలు ఏలువడగా. 600కి 576 మార్కులు సంపాదించి ప్రథమ స్థానంలో నిలిచింది. కార్పొరేటు స్కూలు దీటుగా ప్రభుత్వ స్కూల్లో ప్రథమ స్థానం సంపాదించిన సందర్భంగా తల్లిదండ్రులు. ఆనందాన్ని వ్యక్తం చేశారు.



## చంద్రగిరి జనసేన కార్యాలయంలో సంతాప సభ

**ఎప్రిల్ 24,(ప్రజా జ్యోతి) ,తిరుపతి జిల్లా ప్రతినిధి** పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ, దాడిలో మృతి చెందిన వారికి సంతాప సూచకంగా జనసేన పార్టీ చంద్రగిరి నియోజకవర్గం తరపున స్థానిక చంద్రగిరి నియోజకవర్గ కేంద్ర కార్యాలయం వద్ద ఇంచార్జి దేవర మనోహర ఆధ్వర్యంలో మౌన దీక్ష చేపట్టారు. ఇందులో భాగంగా ఈ రోజు ఉదయం నుండి చంద్రగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద మండల అధ్యక్షులు మరియు ఇంచార్జ్లు రవి కిషోర్, దూది జస్వంత్, పగడాల యువరాజ్, యువ కిషోర్, రూపేష్, సంజీవి హరి మృతులకు నివాళులు అర్పించి మౌన దీక్షకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పూల చందు, మండల నాయకులు వాకా మురళీ, రాకేష్, మధు రాయల్, సంగీతం కిరణ్, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ శ్రీనివాసానంద స్వామిని సత్కరించిన లోతుగెడ్డ తులసీ వర ప్రసాద రావు..



**కొత్తూరు ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి న్యూస్.** గిరిజన గ్రామం గొట్టిపల్లి పంచాయతీ కొత్తగూడ గ్రామంలో శ్రీ గిరివర్ధన వేణుగోపాల స్వామి వారి ప్రథమ వార్షికోత్సవంలో శ్రీ శ్రీనివాసానంద సరస్వతి స్వాముల భక్తి ప్రవచనాలు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు, లోతుగెడ్డ లక్ష్మీ నారాయణ నాయుడు, కోయిలాపు సంజీవరావు,కోయిలాపు శ్రీనివాసరావు, గొట్టిపల్లి సర్పంచ్ ప్రతినిధి నిమ్మకా రామక్రిష్ణ, సవర ముఖలింగం మొదలగు వారు పాల్గొన్నారు.లి




## సర్పంచ్ గండి రాంబాబు అధ్యక్షతన ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం




**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం,ఏప్రిల్24 ప్రజాజ్యోతి న్యూస్** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్నిపురస్కరించుకుని మొదటిగా సర్పంచ్ రాంబాబు మరియు ఉప సర్పంచ్ దండమూడి శేషు జాతీయ నాయకులైన గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి వారికి నివాళులుఅర్పించారు. అనంతరం సర్పంచ్ గండి రాంబాబు మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994లో పంచాయతీ రాజ్ చట్టాన్ని ఏర్పాటు.చేసిందని నాటినుండి నేటి వరకు కేంద్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆయా రాష్ట్రాల పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖలతో సంయుక్తంగా కలిసి పనిచేస్తుందని. గ్రామాలకు పంచాయతీలు వెన్నముకలా పని చేస్తాయని అన్నారు ఈ సందర్భంగా గ్రామ రాజ్యం ద్వారా రామ రాజ్యం సాధించాలనే కలలు కన్న గాంధీ ని దృష్టిలో పెట్టుకుని దేశాభివృద్ధికి మూలం గ్రామలే,అందుకే గ్రామ పంచాయతీ రాజ్ శాఖ కు కొన్ని విస్తృతమైన అధికారాలు భారత రాజ్యాంగంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కల్పించడం జరిగిందని తెలిపారు. తద్వారా గ్రామ పంచాయతీలు అభివృద్ధికి ఆ గ్రామ ప్రజలే పాటుపడడానికి వీలు కల్పించడం జరిగిందని అందుకే స్థానిక ప్రజల సహాయ సహకారం ఆయా గ్రామాల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోసాయి, సచివాలయం సిబ్బంది, పలువురు స్థానికులు పాల్గొన్నారు

## మర్రిగూడ లో ఎమ్మెల్యే ఎంజీఆర్ పల్లె నిద్ర..

**హిరమండలం ఏప్రిల్24 ప్రజా జ్యోతి న్యూస్..** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన పల్లె వెలుగు - స్వర్ణ గ్రామం పథకంలో భాగంగా గ్రామాభివృద్ధిని ప్రోత్సహించే దిశగా పల్లె నిద్ర కార్యక్రమం పాతపట్నం నియోజకవర్గం హిరమండలం మండలం మర్రిగూడ గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు ఉదయాన్నే కాల కృత్యాలు తీర్చుకొని గ్రామస్తులతో వీధి వీధిన తిరుగుతూ సమస్యలు తెలుసుకుని వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. వీధులలో మురికి కాలువాలను, సీసీ రోడ్డులను, నీటి బావులను పరిశీలించారు మర్రిగూడ గ్రామాన్ని అన్ని విధాలుగా అందరు సహకారంతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు..ఈ కార్యక్రమంలో మండల నాయకులు,అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# 10వ తరగతి తుది పరీక్షల్లో 100శాతం ఫస్ట్ క్లాస్ ఫలితాలు సాధించిన పోలీసు స్కూలు..

## విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్..

**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** 13మంది విద్యార్థులు 10వ తరగతి ఫైనల్ పరీక్షలకు హాజరుకాగా 13మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్ ఫలితాలు సాధించారన్న జిల్లా ఎస్పీ 11మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారన్న జిల్లా ఎస్పీ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించే విధంగా కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపీఎస్ జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో విజయనగరం పట్టణం పోలీసు లైన్స్ లో నడపబడుతున్న పోలీసు సంక్షేమ ఆంగ్ల పాఠశాల విద్యార్థులు 10వ తరగతి ఫైనల్ పరీక్షల్లో 100శాతం ఉత్తమ ఫలితాలు సాధించినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఏప్రిల్ 24న తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించినందుకు వేడుకగా జిల్లా ఎస్పీ పోలీసు కార్యాలయంలో విద్యార్థులతో కేక్ కట్ చేయించి, విద్యార్థులకు తినిపించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ – నామమాత్రపు ఫీజులతో పోలీసు సంక్షేమ ఆంగ్ల పాఠశాలలో ఇతర కార్పొరేట్ స్కూల్స్ కు ధీటుగా క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం పోలీసు స్కూలు నుండి ప్రప్రథమంగా 13మంది విద్యార్థులు 10వ తరగతి తుది పరీక్షలకు హాజరుకాగా, 100శాతం ఉత్తమ ఫలితాలతో 13మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్ లో ఉత్తీర్ణులయ్యారన్నారు. ఇదే రకమైన ఫలితాలను పోలీసు స్కూలు విద్యార్థులు భవిష్యత్తులో కూడా సాధించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించుటలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల మంచి శ్రద్ధ కనబర్చారని, విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా స్టడీ అవర్స్ నిర్వహించారన్నారు. విద్యార్థుల విజయం ఇక్కడితో ఆగిపోకూడదని, విజయ పరంపర ఇక్కడ నుండే ప్రారంభం కావాలన్నారు. పోలీసు వెల్ఫేర్ స్కూలును ఇంకా అభివృద్ధి చేసేందుకు అవసరమైన బిల్డింగ్స్, టీచింగ్, మెథడాలజీ, మెటిలియల్ వంటి ప్రణాళికలు, ప్రతిపాదనలను తీసుకొని వస్తే, వాటిని పాఠశాలలో అందుబాటులోకి తీసుకొని వచ్చి, భవిష్యత్తులో జిల్లా లోనే క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న పాఠశాలగా తీర్చిదిద్దుతామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. పోలీసు వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య మాట్లాడుతూ – తమ స్కూలు పిల్లలు డైమండ్స్‌గా మార్చడంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించారని, వారికి సబ్జెక్ట్స్ పరంగా ఎటువంటి సందేహాలు ఉన్నా, ఎప్పటికప్పుడు వాటిని నివృత్తి చేసామన్నారు. గత కొన్ని మాసాలుగా ఉపాధ్యాయులు పడిన శ్రమ మంచి ఫలితాలు ఇచ్చిందని, తమను ఎంతగానో ప్రోత్సహిస్తున్న జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఇన్చార్జ్ ఆర్ఎస్ఐ ఎన్.గోపాల నాయుడు మాట్లాడుతూ – 10వ తరగతి ఫైనల్ పరీక్షలకు హాజరైన తొలి ప్రయత్నంలోనే 100శాతం ఉత్తమ ఫలితాలు సాధించడం ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. 13మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 11మంది 500మార్కులు పైగా సాధించడం, మిగిలిన ఇద్దరూ 490 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. 581 మార్కులతో స్కూలు ఫస్ట్ గా నిలిచిన ఎస్. వైష్ణవి, 575 మార్కులతో స్కూలు సెకండ్ గా నిలిచిన సిహెచ్.హర్ష వర్ధన్, 562 మార్కులతో స్కూలు థర్డ్ నిలిచిన జి.లవీంద్రులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి, ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేసారు. స్కూలు ఉపాధ్యాయులు, హెచ్. ఎం.సంధ్య మరియు ఇతర పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అభినందించి, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా పని చేసి, ఉత్తమ ఫలితాలు రాబట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, అదనపు ఎస్పీ (ఎఆర్) జి.నాగేశ్వరరావు, ఆర్ ఐలు ఎన్.గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, టి.శ్రీనివాసరావు, హెచ్.ఎం.సంధ్య, స్కూలు ఇన్చార్జ్ ఆర్ఎస్ఐ వర ప్రసాద్ మరియు ఇతర పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట






- కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- వినూత్న సంస్కరణలతో విద్యార్థుల చెంతకు ప్రభుత్వ విద్య
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి
- పాఠశాలల బలోపేతం లో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి
- కోరుకొండ విజయ్ కుమార్ పదవీ విరమణ లో పాల్గొన్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** వినూత్నమైన సంస్కరణలతో కూటమి ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పేట వేస్తుందని ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర పి. యూ. సి చైర్మెన్ కూన రవికుమార్ అన్నారు. పొందూరు మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కోరుకొండ విజయ్ కుమార్ 42 సంవత్సరాలు పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందిన సందర్భంగా జెవీ ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాష్టారు ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రతీ ఒక్క విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుని పాత్ర అత్యంత కీలకమైందనదన్నారు. ఉపాధ్యాయ వృత్తి లో విశిష్టమైన సేవలను అందించిన కోరుకొండ విజయ్ కుమార్ మాష్టారు ను సేవలను ఆయన కొనియాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థ పటిష్ఠతకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి వహిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో చిన్నారుల బంగారు భవిష్యత్ ఉన్నతంగా తీర్చిదిద్దేలా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా చూడాలని ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు ఈ విషయం పై ప్రత్యేక దృష్టి వహించాలన్నారు. ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు అందుతున్న పథకాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలాన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.పి. టి.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి , మాజీ ఎమ్మెల్సీ పాకల పాటి రఘువర్మ, జిల్లాల అధ్యక్షులు మజ్జి మధన్ మోహన్, మండల అధ్యక్షులు మొగ దాల రమణ రావు ,ఎంపీపీ కిల్లి ఉషారాణి ,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ , స్థానిక సర్పంచ్ రే గిడి లక్ష్మీ , ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి , జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు , జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కొంచాడ రమణ మూర్తి ,పొల్యూ షన్ కంట్రోల్ బోర్డు రుతార్డ్ సూపరిండెంటెండ్ ఇంజనీర్ కోరుకొండ రమేష్ ,పొందూరు మండల విద్యాశాఖ అధికారి 1 జి శ్రీరాములు , ఎం.ఈ. ఓ 2 పట్నాన రాజారావు ,ఎచ్చెర్ల ఎం.ఈ. ఓ కారు పున్నయ్య,రిటైర్డు ఎం.ఈ. ఓ పైడి వెంకట రామరాజు , యంగ్ స్టార్ యూత్ క్లబ్ సభ్యులు పట్టు శాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు పూండ్రు రామకృష్ణ ,పలు మండలాల ఉపాధ్యాయులు , పలు ఉపాధ్యాయ సంఘాలు , ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పుష్పాల వెంకటరావు ఫామ్ హౌస్‌లో అరుదైన తెల్లనేరేడు



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం,ఏప్రిల్24 ప్రజాజ్యోతి న్యూస్** తెల్ల నేరేడు రుచిలో అమోఘం కొలెస్ట్రాల్ ని తగ్గించడంలో సహాయ పడతాయని కొందరు ఆరోగ్య నిపుణులు నమ్ముతున్నారు. తెల్ల నేరేడు పండ్లలో ఔషధ గుణాలతో పాటు రుచి కూడా బాగుంటాయి. ఇవి మధుమేహం, శరీర బరువు నియంత్రణ మరియు కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో సహాయ పడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కొంతమంది ప్రజలు తెల్ల నేరేడు పండ్లను ప్రతి రోజు తీసుకోవడం వల్ల శరీరానికి చాలా ప్రయోజనాలు కలుగుతాయని నమ్ముతారు. ఐదు సంవత్సరాల వయసు గల చెట్టు సంవత్సరానికి ఒకసారి 5 నుండి 10 వేల పళ్ళను అందిస్తుంది. ఈ తెల్ల నేరేడు పండ్ల మొక్కలు తైవాన్ కి చెందిన పుష్పించే మొక్కల కుటుంబంలో భాగమని చెబుతున్నారు. ఇవి తెల్ల లేదా లేత గులాబీ రంగులో ఉంటాయి. అటువంటి అరుదైన జాతి తాళ్లపూడి మండలం రావూరు పాడు గ్రామానికి చెందిన పుష్పాల వెంకటరావు ఫామ్ హౌస్ లో దర్శనమివ్వడం ఒక అదృష్టంగా చెప్పుకోవచ్చు.

## పదవ తరగతి ఫలితాల్లో విద్యార్థిని ప్రతిభ

- 576 మార్కులు సాధించిన గొర్లె వర్షిత రావు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు ,స్కూల్ సిబ్బంది




**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్:.** ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మానసవేణిలో చదువుతున్న పొందూరు ఎస్టీ కాలనీ కు చెందిన విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. కష్టపడి చదివి 600 మార్కులు గానూ 576 మార్కులు సాధించి గొర్లె వర్షిత రావు విజయం సాధించింది. ఉత్తమ మార్కులు సాధించి తమ పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు మానసవేణి కాన్వెంట్ అండ్ హై స్కూల్ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిందరులు రిటైర్డు ఆర్మీ సత్యారావు , ఎస్టీ కాలనీ వాసులు , పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## సకాలంలో పన్నులు చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించండి : కమిషనర్




**బద్వేల్ ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ పురపాలక సంఘం పరిధిలోని చెన్నంపల్లె లో మునిసిపల్ మరియు సచివాయాలసిబ్బందితో కలసి మార్నింగ్ వాక్ నిర్వహించిన మున్సిపల్ కమీషనర్ నరసింహారెడ్డి. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ పురపాలక సంఘానికి సంబంధించిన అన్ని రకాల పనులు సకాలంలో చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. నీటిని వృధా చేయకుండా అవసరం మేరకే వాడుకోవాలన్నారు. నీటి సరఫరా,వీధి లైట్లు ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ సమస్య లేకుండా చూడాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. అక్రమకుళాయి లు తక్షణమే రెగ్యులర్ చేయించుకోవాలని లేని యెడల కుళాయి కనెక్షన్ లు తొలగిస్తామన్నారు. అలాగే చెత్త బయట వేయకుండా కేటాయించిన చెత్త సేకరణ వాహనాల్లోనే వేస్తూ పట్టణ పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ తోడ్పడవలసినది గా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమములో కమీషనర్ తో పాటు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్, టిపిబిఓ నరసయ్య, అసిస్టెంట్ ఇంజనీర్ మహేష్,మునిసిపల్ సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్టీల గృహ నిర్మాణాలకు ఆర్థిక సాయం..

- జిల్లా కలెక్టర్ వెంకట మురళి..
- బాపట్ల కు చేరిన హబిటాబ్ ఫర్ హ్యూమానిటీ ఇండియా బృందం..
- బృందాన్ని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్..



**బాపట్ల, ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద లబ్ధిదారులైన ఎస్టీల గృహ నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన హాబిటాట్ ఫర్ హ్యూమానిటీ ఇండియా బృందం గురువారం బాపట్ల జిల్లా చేరుకుంది. జిల్లా కలెక్టర్ జె వెంకట మురళిని స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బృందం మర్యాదపూర్వకంగా కలిసి చర్చించింది. సమాజంలో దారిద్ర్యరేక దిగువన ఉన్న ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వం గూడు కల్పించడం సంతోషదాయకమని కలెక్టర్ చెప్పారు. ఆర్థిక స్తోమత లేక చాలామంది అర్ధాంతరంగా గృహ నిర్మాణాలను నిలిపివేసిన విషయాలను బృందంతో కలెక్టర్ చర్చించారు. అత్యంత నిరుపేదలకు ప్రభుత్వం సహాయ అందిస్తున్నప్పటికీ డబ్బులు లేక కొందరు అర్ధాంతరంగా నిర్మాణ పనులను నిలిపివేశారని వివరించారు. అలాంటి నిరుపేదలకు మీ వంతు ప్రోత్సాహం అందించాలని కోరారు. అత్యంత నిరుపేదలైన ఎస్టీల గృహ నిర్మాణాలకు మా సంస్థ నుంచి సహాయ సహకారాలు అందిస్తామని హాబిటాట్ ఫర్ హ్యూమానిటీ ఇండియా డైరెక్టర్ జస్టిన్ జెబాకుమార్ తెలిపారు. బహుళ జాతి కార్పొరేట్ సంస్థల సహకారంతో ఎస్టీలకు సహాయం చేయాలని మా సంస్థ నిర్ణయం తీసుకుందని వివరించారు. ఎస్టీ కాలనీలలో గృహ నిర్మాణాలకు ప్రోత్సాహం ఇస్తామన్నారు. అనంతరం బాపట్ల పట్టణంలోని తూర్పు లేఅవుట్‌ను కలెక్టర్ తో పాటు బృందం సభ్యులు సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి వై.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


# ఆదివాసి రైతులకు సాంప్రద విత్తనాలపై వినియోగం పై వెలుగు అసోసియేషన్ అవగాహన సదస్సు..






**కొత్తూరు, ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి న్యూస్.** పాతపట్నం మండలం లో శోభ పంచాయితీ పరిధి లొ గల బెన్నాడుగుడా గ్రామంలో కొత్తూరు వెలుగు అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివాసియులకు సంప్రదాయ విత్తనాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ శిక్షణా కు రిసోర్స్ పర్సన్ గా పాలక నాగేశ్వరా రావు హాజరు అయ్యారు.ఈ శిక్షణ యొక్క ముఖ్య ఉద్దేశ్యం మనం ఆరోగ్యాంగా ఉండాలంటే కలిసితం లేని ఆహారం తీసుకోవాలి.కలిసితం లేని పంటలు గూర్చి మనం ఇప్పుడు తెలుసుకోవలసిన అవసరం వుంది.ఆదివాసిలు అటవీ ప్రాంతాలల్లోమన పూర్వికులు ఏ ఏ పంటలు పండించారో ఇక్కడకు వచ్చిన రైతులు ద్వారా తెలుసుకుందాం.హాజరైన రైతుల్లో సవర పెద్ద చంద్రమ్మ(60) గతంలో ఏం పంటలు పండించి తినేవాళ్ళు చెప్పని అడుగగా మా కొండల్లో పోదు వ్యవసాయం చేసి జొన్నలు, కొర్రలు, సమలు, గంటెలు, ఊదాలు, కందులు , తెగలు, ఎదురు పంటలు పండించి తినేవాళ్ళం.ఈ ఇప్పుడు ఎలాంటి ఆహారం తింటున్నాము అని చేర్చించగా అప్పుడు పంటలు తగహిపోయింది. నాభర్త, నేను ఉదయం జొన్న కూడో, ఉదా కుడో కొంత తిని మరికొంత కొండకు తీసుకొని వెళ్ళేవాళ్ళం. పోడు చేసి అప్పటి వీత్త నాలు దాసినవి నాటేవాళ్ళం. మంచి పంట వచ్చేది. ఏ ఎరువులు లేని పంట తింటే మంచి ఋషిగా ఉండేది.ఇప్పుడు ఆ పంటలకు దూరం అయ్యాము. ఆనాటి విత్తనాలు లేవు ఇప్పుడు ఇచ్చిన విత్తనాలు హైబ్రిడ్ విత్తనాలు దొరుతున్నాయి.రిసోర్స్ పర్సన్ నాశగేశ్వరరావు మాట్లాడుతూ మనం వాడే విత్తనాలు కలిసితం అయ్యాయి. పాత విత్తనాలు వాడడం ద్వారా ఆరోగ్యాకరమైన ఆహారం పొందగలం మాట్లాడారు. అలాగే మనం నిత్యం కూరగాయలు మార్కెట్లో కొంటూ ఉన్నాము. బాగుంది కానీ అవి రసాయనక ఎరువులు వేయకుండా పండించరు. అవేఅన ఆరోగ్యానికి దెబ్బ తీస్తాయి. అలాంటి ఆహారం తినడం వల్ల చిన్నవాళ్లకు, పెద వాళ్ళకి కిల్లు నొప్పులు, నరాలు బలహీనత. మన అనారోగ్యం మనము తీసుకున్న అహారం తోనే నయం చేసుకోవాలి. ఉదాహరణకు మన శరీరంలో రక్తహీనత వచ్చింది అంటే మన తినే ఆహారం లొ లోపం ఉంది అని తెలుసుకోవాసలి. మనము రాగులు పండించి తింటే మంచిది, కొర్రలు, జొన్నజావా, రాగులు జావా, అట్లు, తోపా ఈ విధంగా మనము తిని మన పిల్లలకు నేర్పాలి.మనము వాడే విత్తనాలు దేసి విత్తనాలు వెతికి తెచ్చి చిరుధాన్యాలు పంటలు పందించండి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఒక వైపు, స్వచ్ఛంద సేవ సంస్థలు ఒక వైపు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించారు. ఈ నేపధ్యంలో మన ఊరు జనం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఆదివాసీ రైతు తాకున్న భూమిలో కొంత పోడు లేదా అవకాశం ఉంటే అంతర పంటలు ద్వారా చిరుధాన్యాలు సాగు చేసి అవే ఆహారంగా తీసుకొంటే అసలు వైద్యమే అవసరం లేదు కనుకా ప్రతీ ఒక్కరూ పండించించిన పంట నిల్వ చేసి అవసరమైనపుడు మీ అవసరాలు నిమిత్తం వాడుకుంటే మీకు ఆదాయం లభిస్తుంది ఖర్చు తగ్గుతుంది. వెలుగు అసోసియేషన్ కొత్తూరు వారి ముఖ్య ఉద్దేశ్యం ఆదివాసీలలో ఆదాయం పెరగాలి, ఖర్చు తగ్గాలి అప్పుడే మన జీవన మనుగడ కు ముప్పు తప్పుతుందని జగన్ తేలియజేశారు. మీకు తెలియని ఓ గొప్ప విషయం ప్రతి గిరిజన మరియు ఆశ్రమ పాఠశాలలో రాగి పానీయం లేదా రాగి జావా పాఠశాలలో వారంలో ఒకటి లేదా రెండు సార్లు బాలికలకు సాయంకాలం యోగా లేదా డ్రిల్ క్లాసులకు ముందు బాలికలు ఇస్తారు.దీని వల్ల బాలికల్లో ఇమ్యూనిటి మరియు ఎనర్జీ పెరిగి ఆరోగ్యంగా ఉంటారు. అనే ఓ మంచి ఉద్దేశ్యం తో ఇస్తారు. ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి బెన్నాడు గూడ ,లక్ష్మి గూడ మరియు కరాడాసింగ్ గూడ నుండి 35 మంది మహిళలు,యువకులు మరియు ఆదివాసి రైతులు పాల్గొన్నారు. కొత్తూరు వెలుగు అసోసియేషన్ ఈ శిక్షణకు నాగరాజు జగన్, మొబలియాజర్ యస్. కామేష్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

# ఉగ్రవాద చర్యలను ఖండిస్తూ ప్రజాసంఘాల కొవ్వొత్తుల ర్యాలీ



**బద్వేల్ ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పట్టణంలో గురువారం సాయంకాలం (సిపిఎం) అనుబంధ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల సెంటర్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు కాశ్మీర్ పహాల్గాన్ పర్యాటక ప్రాంతంలో పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలు చేసిన దాడులను ఖండిస్తూ దేశంలో శాంతిని నెలకొల్పాలని ఉగ్రవాద సంస్థలను రూపుమాపాలని, దాడులకు పాల్పడి అమాయక ప్రాణాలు తీసిన నిందితులకు ఉరిశిక్ష విధించాలని కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ లోని పహాల్గావ్ పర్యాటక ప్రాంతంలో టూరిస్టులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపి 28 మంది అమాయకులను పొట్టనపెట్టుకున్నారు. ఈ సంఘటనను పిరికిపంద చర్యగా అభివర్ణిస్తూ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదుల కాల్పులలో అసువులుబాసిన, నేలకొరిగిన భారత ముద్దు బిడ్డలకు కన్నీటి నివాళులు అర్పిస్తూ ప్రగాడ శ్రద్ధాంజలి సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు,స్వల్పంగా గాయపడ్డవారు, తీవ్రంగా గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. మృతిచెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. అక్కడ తిరిగి మామూలు పరిస్థితులు ఏర్పడాలని అందుకు అందరూ సహకరించాలని సంయమనంతో సామరస్యపూర్వకంగా సోదరభావంతో మెలగాలని అన్నారు మృతి చెందిన కుటుంబాలకు భారత ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి 5 కోట్ల రూపాయలు ఆర్థిక సాయం అందించి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు ముష్కరులను పట్టుకొని కులము, మతము , భేదం లేకుండా ఉరిశిక్ష వేయాలన్నారు,భారత ప్రభుత్వం ఉగ్రవాదులను ఏరివేతలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా మరియు అశ్రద్ధగా నడుచుకోకుండా ఉక్కుపాదం మోపాలని, అన్నారు భారతదేశంలో ఇలాంటి సంఘటనలు పునరావృ తంకాకుండా చూడవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పై ఉన్నదని, ఇలాంటి సంఘటనలను భారతదేశ ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు, ఉగ్రవాదులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దెబ్బకు దెబ్బ తీసి సరైన గుణపాఠం నేర్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పటాన్ చాంద్ భాషా, పట్టణ అధ్యక్షులు షేక్ అన్వర్ భాష, పట్టణ నాయకులు ఖాజాగౌస్, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు, పట్టణ నాయకులు ఎస్. జి నాగార్జున, కె.శివకుమార్, డి. హరి, జి. రాజగోపాల్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం. చిన్ని, పట్టణ అధ్యక్షులు ఎస్.ఎం షరీఫ్, పట్టణ నాయకులు షేక్ ఫాతిమా,ఐద్వా మహిళా సంఘం పట్టణ నాయకురాళ్లు పి. మోక్షమ్మ, షేక్ మస్తాన్ బీ, షేక్ కైరోన్ బీ, ఫాతిమా, నాగరత్నమ్మ,చేతి వృత్తిదారుల సంఘం పట్టణ నాయకులు చెప్పలి సుబ్బరాయుడు,గంప సుబ్బరాయుడు, వికలాంగుల సంఘం పట్టణ నాయకులు వెంకటపతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# యుటిఎఫ్ ఉచిత కోచింగ్ డీఎస్సీ అభ్యర్థుల పాలిట వరం

## -కడప ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి




**బద్వేల్ ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి న్యూస్)** యుటిఎఫ్ చే నిర్వహించబడుతున్న ఉచిత కోచింగ్ డీఎస్సీ అభ్యర్థులకు వరం లాంటిదని కడప ఉప విద్యాశాఖాధికారి జి.రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం కడపలోని యుటిఎఫ్ భవన్లో జరిగిన డీఎస్సీ ఉచిత కోచింగ్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ని నిర్వహిస్తున్నదని, కేవలం 45 రోజులు మాత్రమే పరీక్షలకు సమయమున్న పరిస్థితులలో డీఎస్సీ అభ్యర్థులు, ఆశావాహులు కోచింగ్ కొరకు వేలాది రూపాయలను వెచ్చిస్తూ, సుదూర ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిన అవసరం లేకుండానే కడపలోని యుటిఎఫ్ భవన్లో యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా కోచింగ్ ను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం పాటుపడుతూ, ఊరి బడిని కాపాడుకుందాం అనే నినాదంతో ముందుకు వెళుతున్న యుటిఎఫ్ ఏలాంటి లాభాపేక్ష లేకుండా నవతరం ప్రభుత్వ ఉపాధ్యాయులను తయారు చేయాలనే సంకల్పంతో ఈ కోచింగ్ ను నిర్వహిస్తున్నదన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల పట్ల వ్యామోహం, మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వ విద్యా రంగం నానాటికి నిరాధారణకు గురవుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్య నిరాధారణకు గురైతే పేద, బడుగు, బలహీనవర్గాల వారు ఉచితంగా విద్యనందుకునే అవకాశాన్ని కోల్పోతారన్నారు. విద్య అంగడి సరుకుగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్య బలోపేతం కావలసిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. డీఎస్సీ అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా చదివి, ఆత్మస్థైర్యంతో ముందుకు వెళితే అద్భుత ఫలితాలను పొందవచ్చని పేర్కొన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం యుటిఎఫ్ తన వంతు పాత్రను పోషిస్తున్నదన్నారు. ప్రభుత్వ విద్య బలహీనపడడం తోనే సమాజంలో నైతిక విలువలు అడుగంటాయని, నైతిక విలువలు నశించిన సమాజం గురువు స్థానాన్ని సైతం దిగజార్చుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకవర్గాలు విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుండి క్రమేపి తప్పుకుంటు న్నాయని, అందులో భాగంగానే ఇప్పటికే ప్రాథమిక విద్య బలహీన పడుతున్నదని వారు పేర్కొన్నారు. సమాజంలో నశిస్తున్న నైతిక విలువలను కాపాడుకోవాలన్నా, పేద బడుగు బలహీన వర్గాల వారికి నాణ్యమైన విద్య అందాలన్నా ఊరి బడి మనుగడ సాగించాల్సిందేనన్నారు. విద్య రంగ పరిరక్షణలో భాగంగానే విలువలతో కూడిన ఉపాధ్యాయ తరాన్ని సమాజానికి అందివ్వడం కోసం ఆర్థికంగా వెనుకబడిన డీఎస్సీ అభ్యర్థులకు వెసులుబాటు కల్పించేందుకు తెలుగు రాష్ట్రాల్లో ఉద్దండులైన అధ్యాపకుల చేత డీఎస్సీ ఉచిత కోచింగ్ ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. డీఎస్సీ ఆశావాహులు తమ కలలను సాకారం చేసుకునేందుకు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని వారు కోరారు. డీఎస్సీ కోచింగ్ నందు శిక్షణ ఇచ్చే అధ్యాపకులు వి.బ్రహ్మయ్య, కోవెల ప్రసాద్ రెడ్డి, కె.సత్యానంద రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, మహేష్, ప్రభాకర్, జి.గోపీనాథ్ లు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వంద మందికి పైగా డీఎస్సీ అభ్యర్థులు హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.సుదర్శన్ రెడ్డి, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాత రాణి, జిల్లా కార్యదర్శులు ఎస్.ఎజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కేదార్నాథ్, శంకర్ రెడ్డి, ప్రకాష్ బాబు, శివశంకర్, శివకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడులతో భారతదేశ సమైక్యతను దెబ్బతీయలేరు

గుంతకల్లు జనసేన నేత వాసగిరి మణికంఠ


గుంతకల్ జనసేన కన్నీటి నివాళి...

రెండవ రోజు సంతాప దినం...




**గుంతకల్లు ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి):** జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం జమ్మూ కాశ్మీర్ లో ఉగ్రవాదుల చేతిలో మృత్యువాత పడ్డ మృతులకు గుంతకల్లు జనసేన నేత వాసగిరి మణికంఠ ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులర్పించి సంతాపం తెలియజేస్తూ మౌన దీక్షను చేపట్టారు.పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ, ఈ దుశ్చర్యలో మృతి చెందిన వారికి సంతాప సూచకంగా ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు కీర్తిశేషులు మాధవరావు కి జనసేన శ్రేణులు ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా గుంతకల్లు నియోజకవర్గం జనసేన బాధ్యుడు వాసగిరి మణికంఠ మాట్లాడుతూ ఉగ్రవాదుల దుశ్చర్యను పిరికిపందలు చేసిన అత్యంత హేయమైన చర్యగా భావిస్తున్నామని, భారతదేశంలో సమైక్యతను దెబ్బతీయాలన్న ఉగ్రవాదుల క్రూరమైన ఆలోచనతో జమ్మూ కాశ్మీర్లోని బైసారన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని హతమార్చడంపై ఆయన తీవ్రంగా స్పందించా రు.ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని ఎన్డీఏ ప్రభుత్వం ఉపేక్షించదని వారు కచ్చితంగా తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు.ఈ ఘటనలో అమాయక ప్రజలు చనిపోవడం చాలా బాధ కల్గించిందన్నారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.కశ్మీర్లో ఇటీవల రికార్డు స్థాయిలో పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, శాంతిభద్రతలకు విఘాతం కలిగించి ఆ ప్రాంతాన్ని అస్థిరపరిచే కుట్రలు పన్నుతున్నారని అన్నారు. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా సంఘవిద్రోహ శక్తులు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఇలాంటి వాటిని ప్రధాని మోదీ,హోం మంత్రి అమిత్ షా లు ఉపేక్షించరన్నారు. పహల్గామ్ ఘటనలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బండి శేఖర్, వీరమహిళ బండి చంద్రకళ,జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యుడు పవర్ శేఖర్, గుంతకల్ నియోజకవర్గం చిరంజీవి యువత అధ్యక్షుడు పాండు కుమార్,జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఆటో రామకృష్ణ,ఎంపీ పామయ్య, కథల వీధి అంజి,పూల ఎర్రిస్వామి,కసాపురం సుబ్బయ్య,సుంకర నాగరాజు,ధన,మైనారిటీ నాయకుడు దాదు,ముత్తు, లారెన్స్,అనిల్ కుమార్, ప్రకాష్ తదితరులు పెద్ద ఎత్తున దీక్షలో పాల్గొన్నారు.

## ఈస్ట్ బాపట్ల గ్రామ సచివాలయాన్ని సందర్శించిన రాష్ట్ర ప్రణాళికా శాఖ ప్రతినిధి శ్రేయాఘోష్..




**బాపట్ల, ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** ఆంధ్ర ప్రదేశ్ లోని గ్రామ సచివాలయాలు ద్వారా అమలవుతున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు అర్హులైన పేదవారికి ఎలా అందుతున్నాయని పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటన కోసం గురువారం ఈస్ట్ బాపట్ల గ్రామ సచివాలయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రణాళికా శాఖ తరపున శ్రేయా ఘోష్ సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక రకాల సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన పేదవారికి అందుతున్నాయా ? లేదా.. అనే విషయాన్ని గ్రామ సచివాలయంలోని అన్ని శాఖలకు సంబంధించిన సిబ్బందిని పలురకాలుగా ప్రశ్నించి సమాచారాన్ని సేకరించారు. గ్రామాల్లో అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలు, రైతులు కౌలు దారులు కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, మహిళా ,శిశు సంక్షేమం కోసం ఏర్పాటైన అంగన్వాడీ కేంద్రాల పనితీరు , గ్రామ సచివాలయాల ద్వారా పౌరులకు అందించే సేవలు పారదర్శకంగా జరుగుతున్నాయా , ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారు అనే విషయాల గురించి శ్రేయ ఘోష్ నిశితంగా పరిశీలించారు. సిబ్బంది తమ సేవలను సమర్థవంతంగా అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అయినంపూడి శ్రీనివాసరావు, గణాంకఅధికారి వాణి, ఉపగణాంక అధికారి దాసరి శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## మాస్టారు... మాస్టార్ మీరు సూపర్

**మహబూబాబాద్ :** తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకప్పుడు విద్యా కేంద్రాలుగా వెలుగొందిన ఈ బడులు, నేడు తల్లిదండ్రుల ప్రైవేట్ మోజు తో కళ తప్పిపోతున్నాయి. గ్రామంలో ఒకరు తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమం పేరుతో లక్షలు గుమ్మరిస్తుంటే, మిగిలిన వారు కూడా అదే బాటలో పరుగెడుతున్నారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతున్నా.. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. పక్కింటి వారిని చూసి తమ పిల్లలను ప్రైవేట్ పరం చేసే ధోరణి సమాజంలో వేళ్లూనుకుపోయింది.నెలనెలా లక్షల జీతం తీసుకునే వారికి ఇది పెద్ద భారం కాకపోయినా, రోజువారీ కూలీ చేసుకునే పేద తల్లిదండ్రులకు ఇది పెను భారంగా అవుతుంది. అయినా.. సమాజంలో తమ స్థాయిని నిలబెట్టుకోవడం కోసం వారు అప్పులు చేసి మరీ ప్రైవేట్ బడులకు తమ పిల్లలను పంపుతున్నారు. "ఒక గొర్రె బాయిలో పడితే మిగతా గొర్రెలు కూడా దాని వెంటే వెళ్తాయి" అన్న చందంగా.. ఊరైనా పట్టణమైనా ఇదే పరిస్థితి నెలకొంది.ఈ నేపథ్యంలో.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఎలాగైనా తమ బడిని నిలబెట్టుకోవాలనే తపనతో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కళ్లెం వీరారెడ్డి చేసిన ప్రయత్నం మాత్రం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. బడిబాట కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఆయన తన ఉపాధ్యాయ బృందంతో కలిసి ఉపాధి హామీ పనులకు వెళ్లారు. అక్కడ కూలీ చేస్తున్న తల్లిదండ్రులను కలుసుకొని.. చేతులు జోడించి వేడుకున్నారు. "అయ్యా, అమ్మా.. ప్రభుత్వ బడుల్లో ఎంతో అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారు. మీరు కష్టపడి సంపాదించిన డబ్బును ప్రైవేట్ బడులకు వృథా చేయకండి. మీ పిల్లలను మా బడిలో చేర్పించండి. ఒకవేళ మా చదువులో లోపం ఉంటే మమ్మల్ని

# ఉగ్రవాదం హేయమైన చర్య

**కాశ్మీర్ పహల్గామ్ లో ఉగ్రవాదుల దాడిలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే నరేంద్ర వరమరాజు...**




**బాపట్ల, ఏప్రిల్ 24( ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ )** కాశ్మీర్ పహల్గామ్ బైసరన్ వ్యాలి లో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించిన బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పహల్గామ్ ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని బాపట్ల నియోజకవర్గ ఎన్.డి.ఎ కూటమి ఆద్వర్యంలో ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్గొని బాపట్ల పట్టణంలోని చీలు రోడ్డు సెంటర్ నుండి జమ్ములపాలెం ఫ్లైఓవర్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాశ్మీర్ పహల్గామ్ బైసరన్ వ్యాలి లో పర్యాటకులపై జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తూ బాపట్ల అంజుమాన్ కమిటీ ముస్లిం సోదరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఎంతో అభినందనీయమని తెలిపారు ఉగ్రవాదులు సృష్టించిన మారణకాండ భారతదేశం మొత్తాన్ని కన్నీటి సంద్రంలో ముంచి వేసిందని చెప్పారు ఈ దాడిలో 28 మంది అమాయక టూరిస్టుల ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు కాశ్మీర్ అందాలను చూడటానికి వచ్చిన పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయ మైన చర్యాని పేర్కొన్నారు ఉగ్రవాద దాడులకు కచ్చితంగా భారత్ సమాధానం చెబుతుందని తెలిపారు కాల్పుల్లో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నానన్నారు. ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆ భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలన్నారు అనంతరం దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు తెలియజేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి,నాయకులు, కార్యకర్తలు,అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టులో కోతులు



**కరీంనగర్ :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వాం దేవస్థానానికి ప్రతి రోజూ పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. ఇతర రాష్ట్రాల నుంచీ.. ఇక్కడికి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. ఇక్కడ కొండపైన కొలువై ఉన్న అంజనేయస్వామి ఆలయానికి వందల సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ చాలా యేళ్లుగా కోతులు ఉన్నాయి. అయితే.. గతంలో.. కొండపైన భారీ వృక్షాలు.. వివిధ రకాల పండ్ల చెట్లు ఉండటంతో.. ఎలాంటి సమస్య రాలేదు. అయితే అటవీ విస్తీర్ణం తగ్గడంతో పాటు పండ్ల చెట్లు కనుమరుగువుతున్నాయి. దీంతో కోతులన్నీ ఇక ఆలయానికి చేరుకుంటున్నాయి. మొత్తం ఆలయ పరిసర ప్రాంతాల్లోనే కోతులు సంచరిస్తున్నాయి. 15 యేళ్లుగా కోతులు భక్తులను ముప్పితిప్పలు పెడుతున్నాయిఈ నేపథ్యంలోనే కోతుల ఆహారం కోసం గతంలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. కొండ కింద.. మంకీ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ రకాల పండ్ల మొక్కలు పెంచి.. వాటిని అక్కడికి తరలిస్తామని నిర్ణయం తీసుకున్నారు. కానీ, కేవలం బోర్డు మాత్రమే ఏర్పాటు చేశారు. తరువాత ఇక్కడ ఎలాంటి పండ్ల మొక్కలు నాటలేదు. ఆహారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కోతులన్నీ కొండపైన తిష్ట వేస్తున్నాయి. కొండ సమీపంలో చెట్లు ఉన్నా.. అధికంగా కలప చెట్లు ఉంటాయి. పండ్ల చెట్లు లేవు. దీని కారణంగా భక్తులను వానరాలు టార్గెట్ చేస్తున్నాయి. కడుపు నింపుకోవడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నాయి. భక్తుల చేతిలో ఏం ఉంటే.. అవి ఎత్తుకొని వెళ్తున్నాయి.ఇక్కడ ప్రసాదం తీసుకోవాలంటే.. భక్తులు భయపడుతున్నారు. అంతేకాకుండా చాలా మంది భక్తులు స్వామి వారి సన్నిధిలో గడుపుతారు. వంట చేసుకోవడం కూడా ఇబ్బందిగా ఉంది. ఆహార పదార్థాలు ఎత్తుకొని వెళ్తున్నాయి. భక్తులు చేతిలో కర్ర పట్టుకొని కాపాలా ఉంటున్నారు. ముఖ్యంగా కొండగట్టులో ఎలాంటి పండ్ల చెట్లు లేకపోవడంతో భక్తులు ఇచ్చే ఆహారంపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఎండకాలంలో.. ఆహారం కోసం మరింత ఇబ్బంది పడుతున్నాయి.అయితే, కొంత మంది భక్తులు.. ఇక్కడికి వచ్చి వివిధ రకాల పండ్లు ఇక్కడికి వచ్చి కోతులకు పెడుతున్నారు. కానీ.. అ ఏమాత్రం సరిపోవడం లేదు. సహజంగానే హనుమాన్ ఆలయాల వద్ద ఎక్కువగా కోతులు ఉంటాయి. వాటికి కడుపు నింపేందుకు అధికారులు ఎలాంటి ఆలోచన చేయడం లేదని భక్తులు మండిపడుతున్నారు. పెద్ద ఎత్తున పండ్ల మొక్కలు నాటి.. కోతుల జోన్ ఏర్పాటు చేసి వాటికి ఆహారాన్ని అందించాలని భక్తులు కోరుతున్నారు. ప్రతి రోజూ ఇక్కడ కోతులు రంగం చేస్తున్నాయి. ఒక్కసారి కోతి పైకి వస్తే.. చేతిలో ఏం ఉన్న వదిలిపెట్టి వెళ్తారు. గతంలో చేతిలో ఉన్న బ్యాగ్‌లు, సెల్‌పోన్లు ఎత్తుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి. వాటిని మళ్లీ కోతుల నుంచీ తీసుకోవడానికి భక్తులు నానా తంటాలు పడాల్సి వస్తుంది.అయితే.. మంకీ ఫుడ్ కోర్టును అభివృద్ధి చేసి, భారీగా పండ్ల మొక్కలు పెంచితే తప్ప కొంత మేరకు భక్తులకు బాధలు తప్పేలా లేవు. లేదంటే.. భయం.. భయంగానే భక్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ కోతులు ఎక్కువగా ఉన్నాయని, చేతిలో ప్రసాదం పట్టుకుంటే ఎత్తుకొని వెళ్తున్నాయని భక్తులు అంటున్నారు. చాలా జాగ్రత్తగా తీసుకొని వెళ్తున్నామని చెబుతున్నారు. పిల్లలు భయపడుతున్నారని అంటున్నారు. కోతుల కోసం.. పెద్ద ఎత్తున పండ్ల మొక్కలు నాటి, వాటికి ఆహారాన్ని అందించాలని భక్తులు కోరుతున్నారు.

# కాళేశ్వరం..రెండో దశ విచారణ



**కరీంనగర్ :** ఆసియాలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పథకంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రచారం చేశారు. అయితే నిర్మించిన మూడేళ్లకే ప్రాజెక్టులోని లక్ష్మీ బ్యారేజీ పిల్లర్లు కుంగాయి. అన్నారం బ్యారేజీ పిల్లర్ల వద్ద బుంగ పడింది. ఈ నేపథ్యంలో 2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో విచారణకు ఆదేవించింది. విచారణకు కమిషన్‌ను నియమించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ రేపటి నుంచి రెండో దశ దర్యాప్తును చేపడుతోంది. మొదటి దశలో ప్రాథమిక విచారణ పూర్తి చేసిన కమిషన్, ఇప్పుడు మరింత లోతైన పరిశీలనకు సిద్ధమైంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగడంతో సంబంధిత అంశాలపై దష్టి కేంద్రీకరించిన ఈ విచారణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి నీటిపారుదల మంత్రి హరీశ్‌రావులకు నోటీసులు జారీ కానున్నాయి.ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తీసుకున్న నిర్ణయాలు, ఖర్చులు, ఒప్పందాలు, పనుల నాణ్యతను కమిషన్ సమగ్రంగా పరిశీలించనుంది. కోట్లాది రూపాయల బడ్జెట్‌తో నిర్మితమైన ఈ ప్రాజెక్టులో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో, కమిషన్ గడువు మరో రెండు నెలలు పొడిగించే అవకాశం ఉంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది.కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్‌ఎస్), విజిలెన్స్ విభాగం నివేదికలు ప్రభుత్వానికి అందాయి. ఈ నివేదికలను అధ్యయనం చేసిన తర్వాత, ఇంజనీర్లు, అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు. ఈ ప్రక్రియ అనంతరం కేసీఆర్, హరీశ్‌రావులను విచారణకు పిలిచే అవకాశం ఉంది.కాళేశ్వరం విచారణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారనుంది. ప్రజలలో నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు ఈ దర్యాప్తు కీలకమని ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి. విచారణ ఫలితాల ఆధారంగా తగిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉంది.తాజాగా కాళేశ్వరం కమిషన్ విచారణతో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ సభకు బ్రేక్ పడే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. విచారణ నేపథ్యంలో కేసీఆర్, హరీశ్‌రావు కమిషన్ ఎదుట హాజరయ్యే అవకాశం ఉంది. మరోవైపు బీఆర్‌ఎస్ పార్టీ పాతికేళ్ల సభకోసం విస్తృతంగా ఏర్పాటు చేస్తోంది. ఈ తరుణంలో విచారణ కమిషన్ రంగంలోకి దిగడం ఇప్పుడు రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. మరి కమిషన్ నిర్ణయాలు ఎలా ఉంటాయో చూడాలి. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ తదుపరి దశలో కీలక నిర్ణయాలు, బాధ్యుల గుర్తింపు రాష్ట్ర రాజకీయ, పరిపాలనా వాతావరణంపై గణనీయ ప్రభావం చూపనున్నాయి.

## మహిళలకు భద్రత "శక్తి యాప్"
## జిల్లా ఎస్పీ తుషార్ డూడి

శక్తి యాప్ గురించి విస్తృత అవగాహన కల్పిస్తున్న జిల్లా "శక్తి బృందాలు"లి



**బాపట్ల, ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** "శక్తి యాప్" వినియోగించడం వలన మహిళలకు మరింత భద్రత చేకూరుతుందని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. "శక్తి యాప్" ఉపయోగాలు, అందులో నిక్షిప్తం చెయ్యబడిన సమాచారం, వినియోగించు విధానం తదితర అంశాల గురించి మహిళలకు, విద్యార్థినిలకు విస్తృత అవగాహన కల్పించాలని "శక్తి బృందాలను" జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం జిల్లాలోని శక్తి బృందాలు వారి పరిధిలోని కళాశాలలు, కోచింగ్ సెంటర్స్, వ్యాపార సముదాయాలు, మాల్స్, రైల్వే స్టేషన్ లు, బస్టాండ్ లు ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో మహిళలకు విధ్యార్థినులకు శక్తి యాప్ గురించి వివరించి వారి మొబైల్ లలో శక్తి యాప్ నిక్షిప్తం చేసుకొనే విధంగా విస్తృత అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులలో మహిళల రక్షణకు శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ లలో మహిళల ఫిర్యాదులను స్వీకరించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన "ఉమెన్ హెల్ప్ డెస్క్", పోలీస్ స్టేషన్లకు వచ్చి తమ సమస్యలను చెప్పుకోవడానికి ఇబ్బందిగా భావించే మహిళలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి "సఖి వన్ స్టాప్ సెంటర్" సేవల వినియోగం గురించి, అత్యవసర పరిస్థితులలో బాలబాలికలకు సంబంధించిన సమస్యలకు 1098, మహిళలకు సంబందించిన సమస్యలకు 181, పోలీస్ శాఖను సంప్రదించేందుకు 100,112, సైబర్ నేరాలకు గురైతే సంప్రదించవలసిన 1930, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం అందించాడనికి 1972 హెల్ప్ లైన్ నెంబర్ ల గురించి శక్తి బృందాలు అవగాహన కల్పించాయి.

## ఉల్లాస్ కన్వర్జెన్స్ సమావేశం..



**బాపట్ల, ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జిల్లాలోని డ్వాక్రా మహిళా సంఘాలలో ఉన్న చదువురాని మహిళలకు, అంగన్వాడీ ఆయాలు, పాఠశాలల్లో పనిచేసే వంటవారు, వారి సహాయకులు, ఎన్ఆర్ఈజీ ఎస్ కార్మికుల లో చదువురాని వారికి చదవడం రాయడం నేర్పించడంతో పాటు, వారికి ఆర్థిక అక్షరాస్యతను, సాంకేతిక అక్షరాస్యతను అందజేసి, వారి జీవన ప్రమాణాలను మెరుగు పరిచే ఉద్దేశ్యంతో వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించి జిల్లా కమిటీ సభ్యులతో డిఆర్వో కన్వర్జెన్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు. మొదటి విడతలో 15,268 మంది ఈ కార్యక్రమంలో నమోదు కాగా, 2వ విడత ఉల్లాస్ కార్యక్రమంలో 31,228 మంది చదువు రాని వారిని నమోదు చేసుకుని, అక్షరాస్యులను చేయడం లక్ష్యంగా నిర్దేశించడం జరిగింది. స్వయం సహాయక బృందాల మహిళలు, ఇతర అభ్యాసకులు , రోజూ తరగతులకు హాజరై, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డి ఆర్వో పేర్కొన్నారు. కార్ర్యమంలో జిల్లా కమిటీ సభ్యులు వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జగన్మోహనరావు, నోడల్ అధికారి మధుసూదన రావు, డి ఆర్ డి ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్, కొణిదల మనోరంజన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడిని నిరసిస్తూ నిరసన ర్యాలీ





జమ్మూ కాశ్మీర్ లోని పహల్గావ్ లో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ మండలంలోని ఐలాండ్ సెంటర్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా రేపల్లి జనసేన సమన్వకర్త భాస్కరరావు మాట్లాడుతూ పర్యాటకులను ఎంతో కిరాతకంగా ఉగ్రవాదులు దాడి చేయడం అందరిని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయారని వారి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు సురేష్, మండల టిడిపి అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, జనసేన నాయకులు రవికిరణ్, కూటమి నాయకులు కార్యకర్తలు, జనసేన నాయకులు కార్యకర్తలు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు

# బిజినెస్

## భారత వృద్ధి అంచనాలకు ప్రపంచ బ్యాంక్ కోత




భారత వృద్ధి రేటు అంచనాలకు ప్రపంచ బ్యాంక్ కోత పెట్టింది. దేశంలో మూలధన వ్యయాల తగ్గుదలకు తోడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో బలహీనత, అమెరికా విధాన అనిశ్చితి నేపథ్యంలో భారత జీడీపీ 0.4 శాతం తగ్గి 6.3 శాతానికి పరిమితం కావొచ్చని విశ్లేషించింది. ఇంతక్రితం ఈ అంచనా 6.7 శాతంగా ఉంది. భారత్‌లో ప్రయివేటు పెట్టుబడులు, ప్రభుత్వ మూలధన వ్యయాలు నెమ్మదించడం వల్ల గడిచిన 2024-25లోనూ వృద్ధి నిరాశపర్చిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. ప్రభుత్వం తన లక్ష్యాలను చేరుకో లేదని వెల్లడించింది. గడిచిన 2024-25లో జీడీపీ 6.5 శాతానికి మందగించనుందని విశ్లేషించింది. ఇంతక్రితం రోజూ అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) కూడా భారత జీడీపీ అంచనాలకు కోత పెట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుత 2025-26లో వృద్ధి 6.2 శాతానికి పరిమితం కావొచ్చని.. ఇంతక్రితం 6.5 శాతం అంచనాతో పోల్చితే 0.3 శాతం తగ్గనుందని ఐఎంఎఫ్ పేర్కొంది.

## రూ.12,800 కోట్లతో రెండు అణు రియాక్టర్ల నిర్మాణం



కర్ణాటక రాష్ట్రంలోని కైగా వద్ద 700 మెగావాట్స్ ఎలక్ట్రిక్ సామర్థ్యం కలిగిన రెండు అణు రియాక్టర్ యూనిట్ల నిర్మాణానికి సంబంధించి పర్చేజ్ ఆర్డర్‌ను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) దక్కించుకుంది. ముంబయిలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐఎల్) సీనియర్ అధికారుల నుండి పర్చేజ్ ఆర్డర్‌ను ఎంఇఐఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సిహెచ్ సుబ్బయ్య అందుకున్నారు. కైగా యూనిట్లు 5, 6 అణు రియాక్టర్లను ఎన్‌పిసిఐఎల్ కోసం ఎంఇఐఎల్ నిర్మించి ఇవ్వనుందని సుబ్బయ్య తెలిపారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్మెంట్, కన్స్ట్రక్షన్ (ఇపిసి) విధానంలో ఎంఇఐఎల్ ఈ అణు రియాక్టర్ల నిర్మాణాన్ని చేపట్టన్నామన్నారు. ఇప్పటి వరకు ఎన్‌పిసిఐఎల్ ఏకమొత్తంగా ఇచ్చిన అతిపెద్ద ఆర్డర్ ఇదేనన్నారు. తమ సంస్థ అత్యుత్తమ సాంకేతిక సామర్థ్యానికి, పోటీ తత్వానికి ఈ కాంట్రాక్టు సాధించటం ఓ నిదర్శనమన్నారు.

# బంగారం స్వచ్ఛతకు లెక్కలుంటాయి.. ఆ నంబర్ల వెనుకున్న అర్థం ఇదే..!



బంగారమంటే భారతీయులకు ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పండగలు, శుభకార్యాలు, పుట్టినరోజులు.. ఇలా ప్రతిసారి దీనికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. మహిళలు బంగారు ఆభరణాలను ధరించడానికి బాగా ఇష్టపడతారు. తాము పొదుపు చేసుకున్న డబ్బులతో వాటినే ఎక్కువగా కొనుగోలు చేస్తారు. అయితే బంగారాన్నికొనడానికి అక్షయ తృతీయ రోజు మంచి ముహూర్తమని భావిస్తారు. ఈ రోజునే సమీపంలోని బంగారం దుకాణాల వద్దకు వెళ్లి తమ స్థోమతకు తగినట్టుగా కొనుగోలు జరుపుతారు. అయితే బంగారం కొన్నప్పుడు వాటి స్వచ్ఛత స్థాయిపై అవగాహన ఉండాలి. సాధారణంగా బంగారు ఆభరణాలను కొనుగోలు చేసినప్పుడు వాటి స్వచ్ఛతను 22, 24 కేరెట్ల రూపంలో చెబుతారు. బంగారు నాణేలు, కడ్డీలను కొనుగోలు చేసినప్పుడు వాటిపై 999, 995 అనే గుర్తులు ఉంటాయి. వాటికి గురించి చాలా మందికి పూర్తిస్థాయిలో అవగాహన ఉండదు. ఈ నంబర్లు బంగారం స్వచ్ఛతకు చిహ్నాలుగా చెప్పవచ్చు. 24 కేరెట్ల బంగారమంటే పూర్తిస్థాయి స్వచ్ఛమైనది అని అర్థం. దీనిలో ఎటువంటి లోహాలు కలవవు. 99.99 శాతం స్వచ్ఛత స్థాయి ఉంటుంది. కానీ ఇది ఆభరణాల తయారీకి పనికి రాదు. ఎందుకంటే బంగారంలో మరో లోహం కలిస్తేనే ఆభరణాలను తయారు చేయడానికి వీలుంటుంది. బంగారం కడ్డీలు, నాణేలపై 999 (99.9 శాతం), 995 (99.5 శాతం) నంబర్లు ఉంటే అది 24 కేరెట్ల స్వచ్ఛమైన బంగారం అని అర్థం. ఆ నంబర్లు స్వల్ప తేడాలతో ఒకే నాణ్యతను కలిగి ఉంటాయి. బంగారం స్వచ్ఛత పెరిగే కొద్దీ దాని ధర కూడా ఎక్కువవుతుంది. అక్షయ తృతీయ రోజు బంగారం కొనాలనుకునే వారికి నాణేలు, కడ్డీలు బాగుంటాయి. వాటితో పండగ రోజు మేలిమి బంగారం కొనుగోలు చేసిన అనుభూతి కలుగుతుంది. 24 కేరెట్ల (24 కె) బంగారం అత్యంత స్వచ్ఛమైనదని చెబుతున్నా.. ఆ నాణ్యతతో తయారు చేసిన ఆభరణాలు చాలా తక్కువగా ఉంటాయి. ఎక్కువగా 22 కె, 18 కెతో తయారు చేసిన వస్తువులే దుకాణాల్లో లభిస్తాయి. దీని వెనుక ఉన్న కారణం ఏమిటంటే బంగారంలో ఇతర లోహాలు కలిస్తేనే ఆభరణాలు గట్టిగా ఉంటాయి. చక్కని డిజైన్ తో రూపొందించడానికి వీలు కలుగుతుంది. కాబట్టి చాలా మంది వ్యాపారులు ఆ నాణ్యతతోనే ఆభరణాలను తయారు చేస్తారు. అక్షయ తృతీయ రోజు కొనుగోలు చేయడానికి 24 కేరెట్ల బంగారం దొరకలేదని నిరాశ చెందనవసరం లేదు. దుకాణాల్లో 24 కేరెట్ల పెండెంట్లు, నాణేలు, చిన్న పూజా వస్తువులు లభిస్తాయి. ఇప్పుడిప్పుడే మన దేశంలో 23 కేరెట్ల ఆభరణాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. భారత ప్రభుత్వం 2021 నుంచి ఆరు స్వచ్ఛత స్థాయిలలో బంగారు వస్తువులకు హాల్ మార్కింగ్ ను తప్పనిసరి చేసింది.

# 13 ఏళ్లకే కంపెనీకి సీఈవో.. కేరళ బాలుడి విజయగాథ!

సాధారణంగా 13 ఏళ్ల వయసున్న పిల్లలు స్కూల్లో 8వ తరగతి చదువుతూ ఉంటారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత తోటి పిల్లలతో ఆడుకుంటారు. లేకపోతే ట్యూషన్ కు వెళుతూ చదువులో బిజీగా ఉంటారు. తల్లి లేదా తండ్రి మొబైల్ తీసుకుని గేమ్స్ ఆడతారు. కానీ అదే వయసున్న ఆదిత్యన్ రాజేష్ ఒక మొబైల్ అప్లికేషన్ ను డెవలప్ చేసి తన సొంత ఐటీ కంపెనీని స్థాపించాడు. ఇతడి యూట్యూబ్ చానెల్ కు లక్షల మంది సబ్ స్క్రైబర్లు ఉన్నారు. ఆదిత్యన్ జీవితం అందరికీ ఆదర్శవంతంగా మారింది. పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకుని జీవితంలో విజయం సాధించాడు. అతడు కేరళ రాష్ట్రంలోని తిరువల్లలో జన్మించాడు. ప్రస్తుతం దుబాయ్ లో నివసిస్తున్నాడు. ఐదేళ్ల వయసులోనే అతడికి కంప్యూటర్ పై ఆసక్తి పెరిగింది. దానికి కారణం అతడికి తక్కువ మంది స్నేహితులు ఉండడమే. దీంతో అతడు టెక్నాలజీతో స్నేహం చేశాడు. దానిలో మెళకువలను నేర్చుకున్నాడు. సరదాగా మొదలైన ఆ ప్రయాణం అతడిని విజయ తీరాలకు చేర్చింది. ఆదిత్యన్ ముందుగా యూట్యూబ్ లో ఆటలు నేర్చుకున్నాడు. స్పెల్లింగ్ బీస్ లో పాల్గొనేవాడు. అనంతరం కోడింగ్ , డిజైనింగ్ పై ఆసక్తి పెరిగి, వాటిలో నైపుణ్యం సాధించాడు. దాదాపు ఆరేళ్ల వయసులోనే హెచ్ టీఎంఎల్, సీఎస్ఎస్ తదితర కోడింగ్ భాషలను నేర్చుకోవడం ప్రారంభించాడు. టెక్నాలజీపై ఉన్న ఇష్టమే అతడిని ప్రపంచంలో ప్రత్యేకమైన వ్యక్తిగా నిలబెట్టింది. కోడింగ్ నేర్చుకున్న తర్వాత తొమ్మిదేళ్ల వయసులో ఆదిత్యన్ తన మొదటి ఆండ్రాయిడ్ యాప్ ను తయారు చేశాడు. అది విజయవంతంగా పని చేయడంతో అతడిలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అది ప్రయాణానికి ప్రోత్సాహం అందజేసింది. చిన్నపిల్లవాడి సాంకేతిక నైపుణ్యానికి అందరూ ఆశ్చర్యపోయారు.



ప్రస్తుతం ఐఫోన్ లో ఉపయోగించే సాఫ్ట్ వేర్ కోసం ఒక యాప్ ను డెవలప్ చేయాలని ఆదిత్యన్ ఆకాంక్షిస్తున్నాడు. యాప్ ను తయారు చేయడంతోనే ఆదిత్యన్ ఆగిపోలేదు. ఏ క్రేజ్ అనే పేరుతో యూట్యూబ్ చానెల్ ను కూడా నిర్వహిస్తున్నాడు. దీని ద్వారా టెక్నాలజీ, కోడింగ్ గేమింగ్, వెబ్ డిజైనింగ్ గురించిన సమాచారాన్ని తన యూజర్లకు తెలియజేస్తారు. ఇతడి యూట్యూబ్ కు అనేక మంది సబ్ స్క్రైబర్లు ఉన్నారు. ట్రినెట్ సొల్యూషన్స్ అనే సాఫ్ట్ వేర్ డెవలప్ మెంట్ కంపెనీని తన స్నేహితులతో కలిసి స్థాపించాడు. అది కూడా కేవలం 13 ఏళ్ల వయసులోనే కావడం విశేషం. ఈ కంపెనీ ఇప్పటి వరకూ 12 మంది క్లయింట్ల కోసం ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసింది. ప్రపంచ వ్యాప్తంగా తన కంపెనీని విస్తరించడమే ఆదిత్యన్ రాజేష్ లక్ష్యం.

# స్పోర్ట్స్

# ఇండియన్ హెడ్ కోచ్‌కి డెత్ వార్నింగ్ పంపిన ఐసిస్ ఉగ్రవాదులు!

భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు 'ఐసిస్ కాశ్మీర్' నుండి హత్య బెదిరింపులు రావడం ఇటు క్రికెట్ పరంగా అటు దేశ భద్రత పరంగా కలకలం రేపింది. ఇటీవల జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 28 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయిన ఘటన నేపథ్యంలో, గంభీర్‌కు ఈ బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. "నేను నిన్ను చంపేస్తాను" అనే వ్యాఖ్యలతో కూడిన ఈ-మెయిల్‌ను గంభీర్‌కు పంపారని ఇండియా టుడే నివేదించింది. మంగళవారం ఉగ్రదాడి జరిగిన తర్వాత బుధవారం ఉదయం గంభీర్ ఢిల్లీ పోలీసులను ఆశ్రయించి తన కుటుంబానికి పూర్తి భద్రత కల్పించాలని అధికారిక ఫిర్యాదు చేశారు. మాజీ బీజేపీ ఎంపీ అయిన గంభీర్ ప్రస్తుతం టీం ఇండియా ప్రధాన కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి గంభీర్ తీవ్రంగా స్పందిస్తూ తన సోషల్ మీడియా ఖాతా ఎ (ట్విట్టర్) ద్వారా "మృతుల కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నాను అని దీనికి బాధ్యులు అయిన వారు మూల్యం చెల్లించుకుంటారు అని భారత్ ప్రతీకారం తీర్చుకుంటుంది అని వ్యాఖ్యానించారు. గంభీర్ ఇటీవలే తన కుటుంబంతో సెలవుల కోసం ఫ్రాన్స్ వెళ్లి, ఈ నెల ప్రారంభంలోనే దేశానికి తిరిగి వచ్చారు. ఐపీఎల్ 2025 జరుగుతున్న ఈ సమయంలో ప్రధాన కోచ్‌లకు విశ్రాంతి సమయం లభించే అవకాశం ఉండగా, గంభీర్ ఈ ఫేజ్‌ను వ్యక్తిగత విశ్రాంతికి ఉపయోగించుకున్నట్లు తెలుస్తోంది. గత సంవత్సరం జూలైలో టీం ఇండియా ప్రధాన కోచ్‌గా నియమితుడైన గంభీర్, మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ స్థానాన్ని భర్తీ చేశారు. కోచ్‌గా తన ప్రయాణంలో కొన్ని కఠినమైన దశలను కూడా గంభీర్ ఎదుర్కొన్నారు. శ్రీలంకతో



వన్డే సిరీస్, న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌లలో భారత్ ఓటమిని చవిచూడగా, ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని కూడా గంభీర్ నాయకత్వంలో భారత్ కోల్పోయింది. డ్రెస్సింగ్ రూమ్ చర్చలు మీడియాకు లీక్ కావడం, భారత జట్టులో భిన్నాభిప్రాయాలు తెరపైకి రావడం వంటి సంఘటనలు గంభీర్‌పై విమర్శలు పెంచాయి. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజయం గంభీర్‌కు మళ్లీ విశ్వాసాన్ని తీసుకొచ్చింది. టీం ఇండియా ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి అజేయంగా టైటిల్ గెలుచుకుంది. తొమ్మిదో నెలల వ్యవధిలో ఇది భారత్‌కు రెండో ఐసిసి ట్రోఫీ కావడం విశేషం. ఈ విజయంతో పాటు గంభీర్ క్రికెట్‌లో తన తిరుగులేని కృషిని చూపించగలిగారు. అయితే ఇప్పుడు వచ్చిన హత్య బెదిరింపులు ఆయనకు, భారత క్రికెట్ బోర్డుకి సవాల్‌గా మారింది. భారత క్రికెట్ ప్రధాన కోచ్‌గా ఉన్న వ్యక్తికి అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ నుంచి బెదిరింపులు రావడం, దేశ భద్రత వ్యవస్థను అప్రమత్తం చేస్తోంది. పోలీసులు ఇప్పటికే ఈ కేసును పరిశీలించేందుకు చర్యలు ప్రారంభించగా, గంభీర్ కుటుంబానికి భద్రతను పెంచారు.

## బంగ్లాకు జింబాబ్వే ఝలక్

టెస్టు క్రికెట్‌లో పసికూన జింబాబ్వే జట్టు బంగ్లాదేశ్‌కు ఝలక్ ఇచ్చింది. తొలిటెస్ట్‌లో బంగ్లాదేశ్‌పై 3 వికెట్ల తేడాతో జింబాబ్వే జట్టు విజయం సాధించింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ అర్ధసెంచరీకి తోడు జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబ్బాని 9 వికెట్లతో రాణించాడు. 147 పరుగుల లక్ష్యాన్ని జింబాబ్వే జట్టు ఏడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ముజరబ్బానీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో మొమినుల్ హక్(50), కెప్టెన్ నజ్ముల్ హొసేన్ శాంటో(40)ల పోరాటంతో బంగ్లాదేశ్ 191కే ఆలౌటయ్యింది. అనంతరం జింబాబ్వే ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(57), సియాన్



విలియమ్స్(59) అర్ధ సెంచరీలతో చెలరేగారు. దీంతో జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 273 పరుగులు కొట్టి 82 పరుగుల ఆధిక్యం సాధించింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా బ్యాటర్లు రాణించడంతో 255పరుగులకు ఆలౌటైంది. దీంతో జింబాబ్వే జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత పోను 147పరుగులు చేయాల్సి వచ్చింది. ఛేదనలో జింబాబ్వే బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(54), బెన్ కరన్ (44)లు తొలి వికెట్‌కు 95 పరుగులు జోడించి పటిష్ట స్థితిలో నిలిపారు. వీళ్లిద్దరి జోరుతో విజయానికి చేరువైన జింబాబ్వేను మిరాజ్(5/50) వరుసగా వికెట్లు తీసి కష్టాల్లోకి నెట్టాడు. ఓవైపు వికెట్లు పడుతున్నావెస్లీ మధేవెరె(19 నాటౌట్), రిచర్డ్ గరవ(4 నాటౌట్)లు జట్టును విజయ తీరాలకు చేర్చారు. రెండో టెస్టు ఏప్రిల్ 28న చిట్టగ్రామ్ వేదికగా జరగనుంది.

## పహల్గామ్ దాడిలో పాక్ హస్తం.. బయట పెట్టిన ఆ దేశ మాజీ క్రికెటర్



జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి పై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ భయంకరమైన దాడిలో 28 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి తామే బాధ్యత వహిస్తున్నామని పాకిస్తాన్ మద్దతుగల ఎల్ఇటీ-టిఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది. కాగా ఈ ఉగ్రవాద దాడి వెనుక పాక్ హస్తం ఉందని ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా ఆరోపించాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేసిన కనేరియా.. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తోన్నందుకు పాకిస్తాన్ సిగ్గుపడాలన్నాడు. ఇందులో పాక్ పాత్ర లేకుంటే ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉన్నారని డానిష్ ప్రశ్నించాడు. కాగా పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత, భారతదేశం వైపు నుంచి చర్యలు ప్రారంభమయ్యాయి. దౌత్యపరంగా భారత ప్రభుత్వం పాకిస్తాన్ తో సంబంధాలను తెంచుకుంది. ఇందులో భాగంగానే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇంతలో అమెరికా, రష్యా, చైనా తదితర దేశాలు, అగ్ర నాయకులు పహల్గామ్ దాడిని ఖండించారు. ఉగ్రవాదం నిర్మూలనలో భారతదేశానికి సహకరిస్తామని ప్రకటించారు. అయితే, ఈ దురాగతాన్ని ఖండిస్తూ పాకిస్తాన్ ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ఇప్పుడు దీనినే తప్పుపట్టాడు పాకిస్తాన్ మాజీ స్పిన్నర్ డానిష్ కనేరియా. పహల్గామ్ దాడిపై సందేహాలు వ్యక్తం చేసిన డానిష్ కనేరియా.. 'ఈ దాడిలో పాకిస్తాన్ హస్తం నిజంగా లేకుంటే, మన ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్ ఈ విషయం గురించి ఎందుకు స్పందించడం లేదు? అలాగే భారతదేశంలో దాడి జరిగినప్పుడు పాకిస్తాన్ సైన్యాన్ని అకస్మాత్తుగా హై అలర్ట్‌లో ఉండాలని ఎందుకు చెప్పారు? ఎందుకంటే మీకు నిజం తెలుసు. మీరు ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. వారిని పెంచి పోషిస్తున్నారు. ఇందుకు మీరు సిగ్గుపడాలి' అని డానిష్ కనేరియా సోషల్ మీడియా ద్వారా పాకిస్తాన్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాడు.

# నేను పాకిస్థానీని కాదు..

## స్పందించిన ప్రభాస్ హీరోయిన్

జమ్మూ కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పహల్గాంలో ప్రకృతి అందాలను ఆస్వాదించడానికి వెళ్లిన పర్యటకులపై సోమవారం మధ్యాహ్నం ఉగ్రవాదులు దాడి జరిపిన విషయం తెలిసిందే. ఈ నరమేధంలో 28 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడితో కశ్మీర్‌లోయతోపాటు దేశంమొత్తం భగ్గుమంది. ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా కేంద్రం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇదిలావుంటే ఈ ఘటన అనంతరం పాకిస్థాన్‌కి చెందిన నటులపై మళ్లీ వ్యతిరేకత మొదలైంది. తాజాగా ప్రభాస్ నటిస్తున్న ఒక ప్రాజెక్ట్‌లో ఇమాన్ ఎస్మాయిల్ అనే హీరోయిన్ నటిస్తుండగా.. ఇమాన్ పాకిస్థాన్‌కి చెందిన నటి అని.. ఆమెను మూవీ నుంచి తొలగించాలని సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. తాజాగా ఈ ఘటనపై ఇమాన్ ఎస్మాయిల్ స్పందించింది. తాను పాకిస్థాన్‌కి చెందిన అమ్మాయిని కాదని.. తాను ఇండో అమెరికన్ అని రాసుకోచ్చింది. పహల్గాంలో జరిగిన విషాద సంఘటనకు సంబంధించి నా హృదయపూర్వక సంతాపం తెలియజేస్తున్నాను. ఈ ఘటనలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారందరికీ నా ప్రగాఢ సానుభూతి. అమాయక ప్రాణాల నష్టం ఎంతో బాధాకరం. ఈ ఘటన నా హృదయాన్ని కలచివేసింది. హింసాత్మక చర్యలను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. కళ ద్వారా వెలుగు, ప్రేమను పంచడమే నా లక్ష్యంగా ఉన్నందున, మనమందరం ఒకేతాటిపైకి వచ్చే రోజు త్వరలోనే వస్తుందని ఆశిస్తున్నాను. రీసెంట్‌గా నేను పాకిస్థాన్‌కి చెందిన నటిని అంటూ వస్తున్న వార్తలు వైరలవుతున్నాయి. తాజాగా ఈ వార్తలపై నేను క్లారిటీ ఇవ్వాలి అనుకుంటున్నాను. నేను కానీ నా కుటుంబం కానీ పాకిస్తాన్ సైన్యంతో సంబంధం కలిగి లేరు. నేను హిందీ, తెలుగు, గుజరాతీ, ఇంగ్లీష్ మాట్లాడే గర్వించదగిన భారతీయ అమెరికన్‌ని. నా తల్లిదండ్రులు యుక్త వయసులో చట్టబద్ధంగా యునైటెడ్ స్టేట్స్‌కు వలస వచ్చిన తర్వాత నేను కాలిఫోర్నియాలోని లాస్ ఏంజిల్స్‌లో జన్మించాను. వారు అనంతరం అమెరికన్ పౌరులుగా మారారు. అమెరికాలో నా విశ్వవిద్యాలయ విద్యను పూర్తి చేసిన తర్వాత, నేను నటిగా, కొరియోగ్రాఫర్‌గా గుర్తింపు సాధించాను. ఈ గుర్తింపు అనంతరం నాకు ఇండియన్ సినిమాలలో ఛాన్స్ రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. సినీ పరిశ్రమ నా జీవితంలో గొప్ప ప్రభావాన్ని చూపింది. భారతీయ గుర్తింపు సంస్కృతి నా రక్తంలోనే ఉన్నందున, సోషల్ మీడియాను ఐక్యత కోసం ఉపయోగిస్తానని.. విభజన కోసం కాదని ఆశిస్తున్నాను. చరిత్రలో కళ అనేది సంస్కృతులు, వ్యక్తులు, మరియు అనుభవాల మధ్య అవగాహన, సానుభూతి, సంబంధాన్ని సృష్టించే మాధ్యమంగా ఉంది. నా పని ద్వారా ఈ వారసత్వం కొనసాగేలా.. నా భారతీయ వారసత్వ అనుభవాలను ఉత్తేజపరిచేలా నేను కఠినంగా శ్రమిస్తాను అంటూ ఇమాన్ చెప్పుకోచ్చింది.



# టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న ధనశ్రీ వర్మ

భారత క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ మాజీ భార్య, ప్రముఖ కొరియోగ్రాఫర్ ధనశ్రీ వర్మ త్వరలో టాలీవుడ్‌లో అడుగుపెట్టబోతుంది. ధనశ్రీ వర్మ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఆకాశం దాటి వస్తావా. ఈ సినిమాకు శశికుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. నిర్మాత శిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మిస్తున్నారు. కొరియోగ్రాఫర్ యష్ ఈ చిత్రంలో కథానాయకుడిగా నటించబోతుండగా.. మలయాళ నటి కార్తీక మురళీధరన్ కీలక పాత్రలో నటిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుండగా.. ఈ సినిమాతోనే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతుంది ధనశ్రీ వర్మ. యుజ్వేంద్ర చాహల్‌తో విడాకుల అనంతరం కెరీర్‌పై ఫోకస్ పెట్టిన ఈ అమ్మడు ప్రస్తుతం వరుస సినిమాలకు సైన్ చేస్తుంది ఇందులో భాగంగానే ఆకాశం దాటి వస్తావా సినిమాకు ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. ఇందులో ధనశ్రీ డ్యాన్సర్‌గా కనిపించబోతుంది.



# ఓటీటీలోకి 'హన్సిక' సినిమా

హన్సిక నటించిన గార్డియన్ సినిమా ఏడాది తర్వాత సడెన్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. ఎలాంటి ప్రకటన లేకుండానే మేకర్స్ ఈ చిత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. హారర్ నేపథ్యంలో రూపొందిన ఈ మూవీలో హన్సిక ఒక అందమైన యువతిగా, దెయ్యంగా ద్విపాత్రాభినయం చేసింది. ఫిలిం వర్క్స్ పతాకంపై విజయ్‌చందర్ నిర్మించిన ఈ చిత్రానికి దర్శక ద్వయం శబరి, గురుశరవణన్ దర్శకత్వం వహించారు. తమిళంలో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగులో కూడా విడుదలైంది. అయితే, ఈమూవీ బిగ్ డిజాస్టర్‌గా నిలిచింది. ఈ మూవీలో సురేష్ చంద్రమీనన్, శ్రీమాన్ కీలక పాత్రలలో నటించారు. ఔట్‌డేటెడ్ హారర్ మూవీగా ప్రేక్షకులు ఈ చిత్రం గురించి చెప్పుకొచ్చారు. అయితే, గతేడాది మే నెలలో విడుదలైన ఈ చిత్రం సడెన్‌గా 'ఆహా' తెలుగులో స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సినిమా తర్వాత హన్సికకు మరో ఛాన్స్ దక్కలేదు. తెలుగులో చివరగా 105 మినట్స్ అనే మూవీలో ఆమె నటించింది. ప్రస్తుతం నషా పేరుతో తెలుగులో ఓ వెబ్‌సిరీస్ చేస్తున్న ఈ బ్యూటీ పలు టీవీ షోలలో జడ్జ్‌గా వ్యవహరిస్తుంది.

అసలు కథేంటంటే..

రోటీన్ హారర్ స్టోరీగా దర్శకుడు శబరి గురుశరవణన్ తెరకెక్కించారు. అపర్ణ (హన్సిక) ఇంటీరియర్ డిజైనర్‌గా పనిచేస్తుంది. ఓ ప్రమాదంలో గాయపడిన అపర్ణ జీవితం ఊహించని మలుపులు తిరుగుతుంది. ఆమెను ఓ ఆత్మ ఆవహిస్తుంది. అపర్ణ సహాయంతో సిటీలో పెద్ద మనుషులుగా చెలామణి అవుతోన్న వారిపై ఆత్మ ప్రతీకారం తీర్చుకుంటుంది? అసలు ఆ ఆత్మ ఎవరు? అపర్ణ శరీరంలోకి ఆ ఆత్మ ఎలా ప్రవేశించింది? ఆ ఆత్మ కారణంగా అపర్ణ జీవితంలో ఎలా చిక్కుల్లో పడింది అన్నదే అసలు కథ.



### బిగ్‌బాస్ వల్లే బయటి ప్రపంచం తెలిసొచ్చింది..

# జీవితంలో అదే ఆఖరి రోజు!

బిగ్‌బాస్ షోను తెలుగులో మొదలుపెట్టింది జూనియర్ ఎన్టీఆర్. తొలి సీజన్‌కు తారక్ వ్యాఖ్యాతగా వ్యవహరించి షోను సక్సెస్ చేశాడు. కానీ తర్వాత మాత్రం ఆ షో నుంచి తప్పుకున్నాడు. ఆ సమయంలో హీరో నాని ధైర్యం చేసి యాంకర్‌గా మారాడు. ఇది రియాలిటీ షో అన్న విషయం మర్చిపోయి గేమ్ షోనే కదా.. హోస్ట్ చేసేద్దాం అనుకున్నాడు. తన యాంకరింగ్ కూడా బాగానే ఉండేది. కానీ కంటెస్టెంట్ల అభిమానులు మాత్రం నానిపై విమర్శలు చేసేవారు. తన జడ్జిమెంట్‌లో ఏమాత్రం తేడా వచ్చినా ఆన్‌లైన్‌లో విపరీతంగా ట్రోల్ చేసేవారు. ఇదంతా చూసి నానికి దిమ్మతిరిగిపోయింది. ఏదో హోస్ట్‌గా వచ్చిన పాపానికి చెడుగుడు ఆడేసుకుంటున్నారని అప్‌సెట్ అయ్యాడు. తెలుగు బిగ్‌బాస్ రెండో సీజనే.. తన ఆఖరి సీజన్ అని ప్రకటించాడు. ఇంకెప్పుడూ ఈ రియాలిటీ షో జోలికి వెళ్లనన్నాడు. ప్రస్తుతం అతడు ప్రధాన పాత్రలో నటించిన హిట్ 3 మే 1న విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో బిగ్‌బాస్ షో గురించి స్పందించాడు. నాని మాట్లాడుతూ.. నా జీవితంలో బిగ్‌బాస్ చాప్టర్ ముగిసిపోయింది. మళ్లీ దాని జోలికి వెళ్లే ప్రసక్తే లేదు. రెండో సీజన్ చివరి ఎపిసోడ్ రోజే బిగ్‌బాస్ హోస్ట్‌గా నా జీవితంలో ఇదే ఆఖరి రోజు అని పోస్ట్ పెట్టాను. బిగ్‌బాస్.. బయటి ప్రపంచం ఎలా ఉంటుందనేది నాకు కళ్లకు కట్టినట్లు చూపించింది. నన్ను మరింత టఫ్‌గా మార్చింది. ఒక గేమ్ షో అనుకుని వెళ్లాను. ఆ గేమ్ వెనకాల ఇన్ని ఎమోషన్స్ ఉంటాయా? అనిపించింది. అయితే చాలామంది అభిప్రాయాలు షో అయిపోగానే మారిపోతాయ్.. అని చెప్పుకొచ్చాడు. మొత్తానికి బిగ్‌బాస్ వైపు కన్నెత్తి చూడటానికి కూడా ఇష్టపడటం లేదని నాని చెప్పకనే చెప్పాడు.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com